అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com
సంపుటి: 10 సంచిక: 269
12 పేజీలు వెల: 6.50
సోమవారం 18-11-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar

వరిసాగుపై బీఆర్ఎస్‌ది తప్పుడు ప్రచారం

కాళేశ్వరం లేకున్నా రైతులు పంటలు పండించారు : సీఎం రేవంత్ ట్వీట్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాళేశ్వరం వల్లే తెలంగాణలో వరి సాగు పెరిగిందన్న బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం పటాపంచలైందని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ కుంగి, నీటిని నిల్వ చేసే పరిస్థితి లేకపోయినా, ఎన్డీఎస్ఏ సూచన మేరకు అన్నారం, సుందిళ్లలో నీటిని నిల్వ చేయకపోయినా, కాళేశ్వరంతో సంబంధం లేకుండా తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారి రికార్డు స్థాయిలో వరిధాన్యం పండిందని తెలిపారు. ఇది తెలంగాణ రైతుల ఘనత అనీ, వారి శ్రమ, చెమట, కష్టానికి ఫలితం దక్కిందన్నారు. తెలంగాణ రైతు దేశానికే గర్వకారణమనీ, ఈ ఘనత సాధించిన ప్రతి రైతు సోదరుడికి హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నామని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

వరి దిగుబడిలో తెలంగాణా రికార్డ్
66.77 లక్షల ఎకరాలలో 153 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి :మంత్రి ఉత్తమ్

వరి దిగుబడిలో తెలంగాణ రికార్డ్ సాధించిందని పౌరసరఫరాలశాఖ మంత్రి కెప్టెన్ ఎస్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 66.77 లక్షల ఎకరాలలో 153 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించిందని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు గానీ, తెలంగాణా ఏర్పడ్డాక ఇంతటి దిగుబడి మొదటిసారని చెప్పారు. ఇది యావత్ భారత దేశంలోనే వరి దిగుబడి అరుదైన రికార్డుగా నమోదు అయ్యిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన మూడు బ్యారేజీ లు పని చెయ్యక పోయినా వరి దిగుబడిలో అపురూపమైన విజయాన్ని సాధించామని వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముమ్మాటికీ ఇది రైతు పక్షపాత ప్రభుత్వంగా పని చేస్తున్నదని తెలిపారు. ఈ రికార్డ్‌ను నమోదు చేసిన రాష్ట్ర రైతాంగానికి ప్రత్యేక అభినందనలు, తోడ్పాటునందించిన వ్యవసాయ శాఖా,నీటిపా రుదల శాఖాధికారులకు కృతజ్ఞతలు చెప్పారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ఏఐసీసీ పరిశీలకునిగా నియమితులై అక్కడ జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో ఉత్తమ్ కుమార్ పాల్గొంటున్నారు. అదే సమయంలో అక్కడ్నుంచే రాష్ట్రంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్ళు, ధాన్యం దిగుబడి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన మూడు బ్యారేజ్ లు పని చేయకపోయినా వరి దిగుబడిలో రికార్డు సాధించడం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వంతో మమైకమైన రైతాంగం అంకిత భావంతో చేసిన సాగుతోటే ఈ విజయం సాధ్యపడిందని తెలిపారు.

ఎదగనివ్వని కుల వివక్ష



అణగారిన వర్గాల పిల్లల్లో ఎదుగుదల సమస్య అధికం


- ఆదివాసీ, దళితుల్లో మరీ ఆందోళనకరం
- బాధితుల సంఖ్య 35 శాతానికి పైనే
- ఇది ప్రపంచం, సబ్-సహారా ఆఫ్రికా దేశాల కంటే ఎక్కువ
- తాజా అధ్యయనంలో వెల్లడి

భారత్‌లో చిన్నారుల ఎదుగుదల కులాన్ని బట్టి మారుతున్నది. ఆధిపత్య కులాల్లో పిల్లల ఎదుగుదల లోపం.. అణగారిన వర్గాలవారితో పోలిస్తే తక్కువగా ఉంటున్నది. ఆదివాసీ, దళిత పిల్లల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తున్నది. భారత్, సబ్-సహారా ఆఫ్రికాలోని దేశాలకు చెందిన పలు సర్వేల ఆధారంగా తాజా అధ్యయనం ఈ విషయాన్ని వెల్లడించింది. దేశంలో ఐదేండ్లలోపు చిన్నారుల్లో 35 శాతం మంది ఎదుగుదల సమస్యతో బాధపడుతున్నారని వివరించింది. ప్రపంచంలోని ఇతర దేశాలే కాదు.. సబ్-సహారా ఆఫ్రికాలోని దేశాల కంటే కూడా ఈ లోపాన్ని ఎదుర్కొంటున్న చిన్నారుల సంఖ్య భారత్‌లోనే అధికంగా ఉన్నదని తెలిపింది.

న్యూఢిల్లీ : దేశంలో లక్షలాది మంది చిన్నారులు ఎదుగుదల లోపం (వయసుకు తగిన ఎత్తు లేకపోవటం) తో బాధపడుతున్నారు. ఇందులో అనాదిగా వస్తున్న కుల వ్యవస్థ పాత్ర కనిపిస్తున్నది. అంతేకాదు, ప్రభుత్వాల నిర్లక్ష్యపూరితమైన చర్యలూ ఇందుకు కారణమవుతున్నాయి. తగిన చర్యలు తీసుకోకపోవటంతో పోషకాహార లోపం కారణంగా చిన్నారులు ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ నివేదికలు సైతం ఇదే విషయాన్ని తెలుపుతున్నాయి. సబ్-సహారా ఆఫ్రికా కంటే అధిక స్థాయిలో భారత్‌లోని పిల్లల ఎదుగుదల లోపానికి దశాబ్దాలుగా వస్తున్న కుల వివక్ష కూడా కారణమని తాజా అధ్యయనం ఒకటి వెల్లడిస్తున్నది. అశోక యూనివర్సిటీకి చెందిన అశ్వినీ దేశ్‌పాండే, మలేషియాలోని మోనాశ్ యూనివర్సిటీకి చెందిన రాజేశ్ రామచంద్రన్‌లు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు.

ఆఫ్రికా దేశాల కంటే దుర్భర స్థితిలో భారత్

ప్రపంచంలో ఈ రెండు ప్రాంతాల్లో కలిపి ఐదేండ్లలోపు చిన్నారులు.. 44 శాతం మంది ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎదుగుదల లోపంతో బాధపడుతున్న పిల్లల్లో దాదాపు 70 శాతం మంది ఈ రెండు ప్రాంతాల నుంచే ఉండటం గమనార్హం. ఇది పోషకాహార లోపానికి ఒక సూచికగా విశ్లేషకులు చెప్తున్నారు. అయితే, ఇందులో భారత రేటు 35.7 శాతంగా ఉన్నది. 49 దేశాలను కలిగిన సబ్-సహారా ...11లో




సామాజిక అసమానతపై చర్చ జరగాలి

భారత్‌లో పిల్లల ఎదుగుదల లోపంపై కొన్నేండ్లుగా అనేక చర్చలు జరుగుతున్నాయి. కొందరు ఇవి జన్యుపరమైనవిగా చూపితే, మరికొందరు పోషకాహార లోపంగా ఎత్తి చూపుతున్నారు. ఇంకొందరు ప్రభుత్వాల వైఫల్యాన్ని కారణంగా చెప్తున్నారు. దేశంలో బాలురతో పోలిస్తే బాలికల పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నదని కొన్ని అధ్యయనాలు చెప్తున్నాయి. ఆదివాసీలు వంటి అణగారిన సామాజిక వర్గాల్లోని చిన్నారులు పోషకాహార లోపంతో ...11లో

మత స్వేచ్ఛకు విఘాతం

క్షీణిస్తున్న మానవ హక్కులు

పెచ్చరిల్లిన హిందూ మతోన్మాదం 3లో..
దెబ్బతింటున్న సామాజిక సామరస్యం
భారత్‌పై అమెరికా కాంగ్రెస్ రీసెర్చ్ సర్వీస్ తాజా నివేదిక



ఫోటో షూట్లు..కొత్త బెడ్లు, కొత్త బెడ్‌షీట్లు..కాళ్లకు సాక్స్

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మూసీ నిద్ర అంటే ఇదేనా?



24 గంటల నిద్రతో ఏం తెలుసుకున్నారో చెప్పాలి
సబర్మతి రివర్ ఫ్రంట్‌కు లేని అభ్యంతరం మూసీకి ఎందుకు?
బీఆర్ఎస్‌కు ప్రొటెక్టర్‌గా బీజేపీ మారింది
రెండు పార్టీలు పరస్పరం సహకరించుకుంటున్నాయి
డీపీఆర్ వచ్చేంతవరకు కూడా ఓపిక పట్టరా? : టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఆ పార్టీకి చెందిన నేతలు మూసీ నిద్ర పేరిట పెద్ద డ్రామా చేశారని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. మూసీ నిద్ర అంటే ప్రజల సమస్యలు తెలుసుకోవడం, వాటికి పరిష్కారం చూపించడం, ప్రభుత్వాల దృష్టికి తేవడం అని అన్నారు. కానీ బీజేపీ నేతలు మాత్రం ఫోటో షూట్లు...కొత్త బెడ్లు...కొత్త బెడ్‌షీట్లు...దోమలు కుట్టకుండా కాళ్లకు సాక్స్ వేసుకుని నిద్ర చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మూసీ పక్కనగానీ, బఫర్ జోన్లో కూడా నిద్ర చేయలేదన్నారు. మూసీకి ఎక్కడో దూరంగా నిద్ర చేస్తే కాలుష్యం, దుర్గంధం, దోమలు, ఈగలతో ప్రజలు పడుతున్న కష్టాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ఇంతకు కిషన్‌రెడ్డికి మురుగు వాసన వచ్చిందో, లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. మోడీ సీఎంగా ఉన్న సమయంలో సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రారంభించి 20 ఏండ్లు అవుతున్నా పూర్తి కాలేదన్నారు. అక్కడి 13వేల మంది నిర్వాసితులకు పరిహారం కూడా ఇవ్వలేదని విమర్శించారు. సబర్మతికి లేని అభ్యంతరం మూసీకి ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎంపీ బలరాం నాయక్, పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీఆర్ఎస్‌కు ఎప్పుడు కష్టమొచ్చినా బీజేపీ రక్షణ కవచంలా నిలబడుతుందని ...11లో

నర్సిరెడ్డిని మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించాలి

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఆయన కృషి గొప్పది

టీఎస్‌యుటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి



నవతెలంగాణ-జనగామ

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలతో పాటు సామాజిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన అలుగుబెల్లి నర్సిరెడ్డిని ఎమ్మెల్సీగా మరోసారి గెలిపించాలని టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి కోరారు. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలో టీఎస్ యుటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్సీ నర్సిరెడ్డిని మరోమారు పోటీలో నిలిపామని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా వారి పనితీరు బాగుందన్నారు. మండలిలో అనేక అంశాల మీద మాట్లాడి సమస్యల పరిష్కారంలో తనదైన ముద్ర వేశారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను పూర్తిగా విద్యారంగ అభివృద్ధికి మాత్రమే ఖర్చు చేసిన ఏకైక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అని చెప్పారు. నిజాయితీగా ఉంటూ, ఎప్పుడూ ఉపాధ్యాయ, విద్యార్థులకు అందుబాటులో ఉండే ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాత్రమేనని తెలిపారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వారి కృషి ఫలితమేనని గుర్తు చేశారు. ఎక్కడ సమస్య ...11లో

మణిపూర్‌లో మళ్లీ హింస

సీఎం, మంత్రుల నివాసాలపై దాడులు

- ఆస్తులు ధ్వంసం..వాహనాలకు నిప్పు
- నిరవధిక కర్ఫ్యూ..ఇంటర్నెట్ సేవల నిలిపివేత
- బీజేపీకి ఎన్‌పీపీ మద్దతు ఉపసంహరణ



ఇంఫాల్ : మణిపూర్‌లో కొనసాగుతున్న అశాంతి మధ్య, కాన్రాడ్ సంగ్మా నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) ఆదివారం బీజేపీ నేతృత్వంలోని మణిపూర్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంది. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి నడ్డాకు ఎన్‌పీపీ అధికారిక లేఖ పంపింది. "ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్ నాయకత్వంలోని మణిపూర్ ప్రభుత్వం కుల హింసను నియంత్రించటంలోనూ, రాష్ట్రంలో సాధారణ స్థితిని పునరుద్ధరించటంలో పూర్తిగా విఫలమైంది. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎన్‌పీపీ మణిపూర్‌లో బీరెన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి తక్షణమే మద్దతు ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది.

ఎన్‌పీపీ మద్దతు ఉపసంహరణ తర్వాత ?

2022లో మణిపూర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఇక్కడ మొత్తం 60 మంది సభ్యులు ఉన్నారు. అసెంబ్లీలో మెజారిటీ సంఖ్య 31 కాగా, బీజేపీకి సొంతంగా 32 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. దీంతో బీరెన్ సర్కారుకు ప్రమాదం లేదని రాజకీయ పరిశీకులు విశ్లేషిస్తున్నారు. జేడీ(యూ) నుంచి ఆగురుగురు గెలిచినా.. ఐదుగురు ఎమ్మెల్యేలు కాషాయపార్టీ పంచన చేరారు. దీంతో బీజేపీ బలం 37 కి చేరింది. మిగతా ఎమ్మెల్యేలను పరిశీలిస్తే..కాంగ్రెస్ ...2లో

మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణకు రూ.205 కోట్లు


జీవో విడుదల చేసిన ప్రభుత్వం
డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశాలు



వివరాలు 11లో

హైపర్‌సోనిక్ క్షిపణి పరీక్ష సక్సెస్

భారత్ అమ్ములపొదిలో మరో మిస్సైల్ 3లో..
శబ్దం కంటే ఐదు రెట్ల వేగంతో ప్రయాణం
స్వదేశీ పరిజ్ఞానంతోనే అభివృద్ధి
అనేక పేలోడ్లను తరలించే సామర్థ్యం



హే..గాంధీ..!



సమస్యల వలయంలో గాంధీ హాస్పిటల్

అరకొర మందులతో రోగుల బేజారు
రాజ్యమేలుతున్న ప్రయివేటు మెడికల్ మాఫియా
అవయవ మార్పిడిలోనూ అంతంతే పురోగతి
దయనీయ స్థితిలో గాంధీ నర్సింగ్ హాస్టల్

గాడ్సే బులెట్ మహాత్ముని గుండెను చీల్చేసిన తర్వాత 'హే రామ్' అంటూ గాంధీ నెలకొరిగారని చెప్తారు. ఇప్పుడు హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న గాంధీ హాస్పటల్‌ను చూసిన వారు 'హే గాంధీ' అంటూ తలబాదుకుంటున్నారు. కారణం.. ఉన్నతాధికారులు మారినా.. రోగులకు అందించే వైద్య సేవల్లో అదే తీరు.. అలాగే నిర్లక్ష్యం.. అవే రోగుల ఇబ్బందులు.. ఏ మాత్రమూ హాస్పిటల్ పని తీరులో మార్పు రాలేదు. పైగా కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. పరీక్షించడంతోనే పనైపోయింది అన్నట్టు వైద్యులుంటే.. సరిగ్గా మందులు దొరక్క.. సకాలంలో పరీక్షలు కాక రోగులే కాదు.. వారి కుటుంబ సభ్యులు సైతం హైరానా పడుతున్నారు. మందుల కొరతతో బేజారవుతున్నారు.



నవతెలంగాణ-సిటీబ్యూరో

పేదలకు అండగా ఉండాల్సిన సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్ నిర్లక్ష్యంలో మునిగి తేలుతోంది. జ్వరమో.. కడుపు నొప్పో.. ఇంకా ఏదైనా అనారోగ్యంతోనో హాస్పిటల్‌కు వస్తే అందే వైద్యం కంటే.. అక్కడి సమస్యలే మరింత బాధిస్తున్నాయి. హాస్పిటల్‌కు వచ్చి ఓపీ తీసుకోవడం నుంచి వైద్యునికి చూపించి.. పరీక్షలు చేయించుకోవడం.. మందులు తీసుకోవడం వరకు పెద్ద యుద్ధమే చేయాల్సి వస్తోంది. దీనికితోడు వైద్యులు రాసిన మందుల్లో సగం కూడా కౌంటర్లలో ఉండటం లేదు. ప్రభుత్వ కౌంటర్‌లో మందులు సరిగ్గా ఉంచకుండా దగ్గర్లో ఉండే ప్రయివేటు మందుల దుకాణంలో తెచ్చుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని తెలిసినా.. ఉన్నతాధికారులు స్పందించడం లేదు. ఇలా ఒక్కో రోగిపై రూ.100 నుంచి రూ.500 వరకు భారం పడుతోంది.

నర్సింగ్ హాస్టల్ అంతంతే..

బోయిగూడలో ఉన్న గాంధీ నర్సింగ్ హాస్టల్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఈ హాస్టల్‌లో దాదాపు 130 మంది వరకు విద్యార్థులు ఉంటున్నారు. దాదాపు ఆరు నెలలుగా ఈ హాస్టల్‌లో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. డ్రయినేజీ పైపులైను పగిలిపోయి నెల రోజులుగా దుర్గంధం వెదజల్లుతోందనీ, ఈ విషయాన్ని గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్, నర్సింగ్ సూపరింటెండెంట్, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో ఇటీవల నర్సింగ్ విద్యార్థులు గాంధీ హాస్పిటల్‌ను చుట్టుముట్టి నిరసన తెలిపారు. దాంతో ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేశారు.

మందుల మాఫియా..?

గాంధీ హాస్పిటల్‌లో ప్రయివేటు మందుల మాఫియా రాజ్యమేలుతోంది. పేద రోగులను పీల్చిపిప్పి చేస్తోంది. హాస్పిటల్‌లోని ఉచిత ఫార్మసీలో లేని మందులను ఈ ప్రయివేటు మెడికల్ షాపుల యాజమానులు ...11లో

ఈవీలకు బంపర్ ఆఫర్

పాలసీ ప్రకటించిన రవాణామంత్రి పొన్నం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎలక్ట్రిక్ వాహనాలకు (ఈవీ) పలు ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుంది. ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ వివరాలను తెలిపారు. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు. ఫోర్ వీలర్స్, ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాలు, త్రి గూడ్స్ వాహనాలకు ఎలాంటి ట్యాక్స్‌లు ఉండబోవని చెప్పారు. రాష్ట్ర ...11లో

ఇందిరా మహిళా శక్తి భవనాలకు రూ.110 కోట్లు కేటాయింపు

వివరాలు 11లో

మెడికోకు గుండు కొట్టించి..

మెడికల్ విద్యార్థిపై అసిస్టెంట్ ప్రొఫెసర్ దాష్టీకం

- ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆలస్యంగా వెలుగులోకి..
- ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ఆందోళన



నవతెలంగాణ-ఖమ్మం / హైదరాబాద్

ఈ నెల 12వ తేదీ రాత్రి ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థిపై.. అసిస్టెంట్ ప్రొఫెసర్ దాష్టీకం ప్రదర్శించి గుండు గీయించిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దాంతో అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆదివారం మెడికల్ కళాశాల బాలుర హాస్టల్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, జార్జిరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్ కుమార్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు మంద సురేష్, లక్ష్మణ్ మాట్లాడారు. ములుగు జిల్లాకు చెందిన ఓ విద్యార్థి ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కళాశాల హాస్టల్లో ఉంటున్న ఈ విద్యార్థి ఈనెల 12వ తేదీ రాత్రి చైనీస్ స్టైల్‌లో హెయిర్ కటింగ్ చేయించుకుని రాగా, సెకండియర్ విద్యార్థులు అది బాగోలేదని చెప్పడంతో మళ్లీ వెళ్లి ట్రిమ్మింగ్ చేయించుకున్నాడని తెలిపారు. విద్యార్థి హాస్టల్‌కు వచ్చే సరికి హాస్టల్లో యాంటీ ర్యాగింగ్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ "ఏందా కటింగ్" అంటూ కోపోద్రిక్తుడై ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఆ విద్యార్థిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బయటికి తీసుకెళ్లి సెలూన్ షాప్‌లో గుండుగీయించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రభుత్వం న్యూ టీజింగ్ ర్యాగింగ్ అరికట్టాలని, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, ఇటువంటి అమానుష ఘటనలు చోటు చేసుకోవడం దారుణమన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు తగు విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో కళాశాల హాస్టల్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి వినోద్, ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ నాయక్, కౌశిక్, ప్రతాప్, రాజు, సునీల్, జార్జిరెడ్డి, పీడీఎస్‌యూ అజయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

రాష్ట్రంలోని ఖమ్మం, నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ర్యాగింగ్ ఘటనలు తీవ్ర ఆందోళన కల్గిస్తున్నాయనీ, ఆ ఘటనలపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు ఈ మేరకు ఆదివారం ఒక విడుదల చేశారు. మెడికల్ విద్యలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల పట్ల తోటి విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో వికృతమైన చర్యలు చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ర్యాగింగ్ నిరోధనానికి ప్రభుత్వం, కళాశాలలు, పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో మాత్రమే ఈ ఘటనలు బయటకు వచ్చాయనీ, రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ర్యాగింగ్ జరుగుతున్నట్టు తెలుస్తున్నదని తెలిపారు. ర్యాగింగ్ వ్యతిరేక కమిటీలు కేవలం పేరుకే పరిమితమయ్యాయనీ, దాని నిరోధానికి చర్యలు చేపట్టటం లేదని పేర్కొన్నారు. గతంలో వరంగల్‌లో మెడికో ప్రీతి ఘటన జరిగిందనీ, ఇలాంటి చర్యలు సమాజాభివృద్ధికి నష్టం కలిగిస్తాయని తెలిపారు. మెడికల్ కళాశాలల్లో జిల్లా పోలీసు ప్రధాన అధికారి (ఎస్పీ స్థాయిలో) పర్యటించి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లు, కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు మధ్య స్నేహపూర్వకంగా ఉండే వాతవరణం కళాశాల అధికారులు కల్పించాలనీ, విధిగా యాంటి ర్యాగింగ్ బోర్డులు, నోటిసులు, సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు.

ర్యాగింగ్ బాధ్యులపై చర్యలు

మంత్రి దామోదర రాజ నర్సింహ ఆగ్రహం

ర్యాగింగ్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఖమ్మం ర్యాగింగ్ ఘటనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్యాగింగ్ పేరిట భవిష్యత్ పాడుచేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్ ఘటనలపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఉన్నతాధికారులతో ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఫస్ట్ ఇయర్ విద్యార్థికి గుండు కొట్టించిన ఘటనపై దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపి, తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనీ, అన్ని కాలేజీల్లో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాల కోసం పోలీసుశాఖ సహకారం తీసుకోవాలన్నారు. ర్యాగింగ్ వల్ల విద్యార్థుల భవిష్యత్‌పై ప్రభావం పడకుండా చూడాలని ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు. తమ జూనియర్లతో సీనియర్ స్టూడెంట్స్ ఫ్రెండ్లీగా ఉండాలి తప్పితే, ర్యాగింగ్ పేరిట వారిని భయాందోళనకు గురి చేయొద్దన్నారు.



అమీన్‌పూర్‌లో ఉచిత వైద్య శిబిరం

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల సందర్భంగా నిర్వహణ

- మెడిస్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బీరంగూడలో క్యాంప్

నవతెలంగాణ-అమీన్‌పూర్

సంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలోని బీరంగూడలో మెడిస్టార్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రాజయ్య ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందినప్పుడే దేశం ముందుకు పోతుందన్నారు. అనేకమంది ప్రజలు నేటికీ వైద్యం అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని, వైద్య ఖర్చులు భరించలేక ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలందరికీ వైద్యాన్ని అందించే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైద్య శిబిరం నిర్వహించడానికి ముందుకు వచ్చిన మెడిస్టార్ హాస్పిటల్ వారికి అభినందనలు తెలిపారు. అలాగే 2025 జనవరి 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మెడిస్టార్ హాస్పిటల్ డాక్టర్ మాట్లాడుతూ.. తమ హాస్పిటల్‌లో పేద ప్రజల కోసం రూ.10 కన్సల్టేషన్ ఫీజు పెట్టినట్టు చెప్పారు. అనేక టెస్టుల్లో డిస్కౌంట్ కూడా ఇస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతతో అనేక చోట్ల కూడా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, పజలు కూడా ఆదరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పటాన్‌చెరు ఏరియా కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు జయరాం, వెంకటేశ్వరరావు, ఎన్ శ్రీనివాస్, లోకేష్, రాములు, సురేష్, శ్రీనివాస్, హరినాథ్ హాస్పిటల్ డాక్టర్లు తేజస్వి, వెంకట్, సూపరింటెండెంట్ ఆశ, రాణి తదితరులు పాల్గొన్నారు.

కేరళ టైకాన్ సమ్మిట్‌కు కేటీఆర్‌కు ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టైకాన్ కేరళ-2024 సమ్మిట్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. డిసెంబర్ 4, 5 తేదీల్లో కోచీలోని గ్రాండ్ హయత్ హోటల్ వేదికగా 13వ "ది ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ కాన్ఫరెన్స్ సమ్మిట్" జరుగనున్నది. 'మిషన్ 2030- ట్రాన్స్‌ఫార్మింగ్ కేరళ' థీమ్‌తో జరగనున్న ఈ సమ్మిట్‌కు వివిధ రంగాలకు చెందిన కంపెనీల సీఈవోలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, పరిశ్రమల నిపుణులు వెయ్యిమందికిపైగా హాజరవనున్నారు. డిసెంబర్ 5న సాయంత్రం జరిగే సమ్మిట్ ముగింపు వేడుకలకు హాజరు కావాలని టైకాన్ చైర్మెన్ వివేక్ కీష్ణగోవింద్ కేటీఆర్‌ను ఆహ్వానించారు.

kotak

కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్

రిజిస్టర్డు ఆఫీసు: 27బికెసి, సి27, జి బ్లాక్, బంద్రా కుర్ల కాంప్లెక్స్, బంద్రా (ఈస్ట్), ముంబయి-400051
కార్పోరేట్ ఆఫీసు: కోటక్ ఇన్ఫినిటీ, బిల్డింగ్ నెం.21, ఇన్ఫినిటీ పార్క్, జెనరల్ ఎకె వైద్య మార్గ్, మలాడ్(ఈస్ట్), ముంబయి-400097. www.kotak.com

వేలం-ప్రకటన

దిగువ పేర్కొనబడిన రుణగ్రహీత/లు దిగువ సూచించినట్లు బంగారు ఆభరణాలు/ వస్తువుల హామీపై బంగారు రుణ సదుపాయం పొందియున్నారు. రుణగ్రహీత/లు వాయిదాలు మరియు బాకీయున్న బకాయి మొత్తాలను తిరిగిచెల్లింపుటలో డీఫాల్టిచెందారు మరియు ఫలితంగా బకాయి మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీత/లను కోరుతూ బ్యాంకు నోటీసులను జారీచేసింది. అయితే, రుణగ్రహీత/లు వారిబాకీయున్న బకాయిలను తిరిగిచెల్లింపుట/ క్లియర్ చేయుటలో విఫలం చెందియున్నందున, బ్యాంకుపేరున తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలను బ్యాంకు వేలం వేస్తుంది. దిగువ పేర్కొన్న బంగారు ఆభరణాలవేలం దిగువ ఇవ్వబడిన ప్రదేశాల వద్ద నిర్వహించబడును.

దిగువ పేర్కొన్న బంగారు ఆభరణాల వేలం తేది/తర్వాత ఐక్కడ నిర్వహించబడుతుంది:-
తేది: 26 నవంబర్, 2024, సమయం: ఉ.11.00గం.లకు, ప్రదేశం: సంబంధిత బ్రాంచ్ ఆవరణలలో

ApplApac	వినియోగదారుని పేరు	రాష్ట్రం	సబ్ లోకేషన్	బ్రాంచి పేరు	స్థూల బరువు	వేలం తేది
GLN2965005	దాసరి రాజు	తెలంగాణ	హైదరాబాద్	చంపాపేట్	23.40	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3043447	గుండెబోయిన రంజిత్ కుమార్	తెలంగాణ	హైదరాబాద్	ఎస్‌వీఎస్ రోడ్	15.20	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3376813	కొటికలపూడి లక్ష్మి శైలజ	తెలంగాణ	హైదరాబాద్	చందానగర్	15.70	26-11-2024 : తేదీన/తర్వాత
GLN2950070	శేఖ్ మహతబ్ హసాన్	తెలంగాణ	హైదరాబాద్	వనస్థలిపురం	21.90	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3269799	సింగిరెడ్డి ప్రవలిక	తెలంగాణ	హైదరాబాద్	కాపూరిహిల్స్	10.40	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3284920	సింగిరెడ్డి ప్రవలిక	తెలంగాణ	హైదరాబాద్	కాపూరిహిల్స్	8.80	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3431050	అబ్దుల్ అతహరున్నీసా	తెలంగాణ	హైదరాబాద్	సుబేదారి	101.70	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3155971	అదుల లక్ష్మి	తెలంగాణ	హైదరాబాద్	సిద్దిపేట	57.40	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3150398	అగుళ్ల భాగ్య	తెలంగాణ	హైదరాబాద్	సిద్దిపేట	20.00	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3318167	అజ్మీరా రాము	తెలంగాణ	హైదరాబాద్	బిహెచ్ఇఎల్ టౌన్	19.30	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3400345	అనగం వెంకటేశ్వర్లు	తెలంగాణ	హైదరాబాద్	హుజురాబాద్	100.30	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3061899	అవినాష్ కుమార్	తెలంగాణ	హైదరాబాద్	సుచిత్రా సర్కిల్	14.90	26-11-2024 : తేదీన/తర్వాత
GLN2852810	బి. విజయ లక్ష్మి	తెలంగాణ	హైదరాబాద్	అమీర్‌పేట్	299.90	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3121111	బైరబోయిన నాగరాజు	తెలంగాణ	హైదరాబాద్	సుబేదారి	41.50	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3399791	బండారి శివ	తెలంగాణ	హైదరాబాద్	చంద్రాలోక్	23.50	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3235836	బానోత్ సంతోష్	తెలంగాణ	హైదరాబాద్	బకాన్ బిల్డింగ్	25.60	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3042538	బొక్క అనురాధ	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	115.80	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3434424	బొక్క లక్ష్మి	తెలంగాణ	హైదరాబాద్	సుబేదారి	21.50	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3226313	చెన్నగాల ప్రసాద్	తెలంగాణ	హైదరాబాద్	బకాన్ బిల్డింగ్	18.40	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3181194	చెరుకు జయసింహా రెడ్డి	తెలంగాణ	హైదరాబాద్	సుబేదారి	79.20	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3057000	దుబ్బాక నాగేష్	తెలంగాణ	హైదరాబాద్	సిద్దిపేట	28.80	26-11-2024 : తేదీన/తర్వాత
GLN2878121	దూదేకుల అఫ్జర్	తెలంగాణ	హైదరాబాద్	సిద్దిపేట	12.60	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3235725	ఎరపోగు ఆనంద్	తెలంగాణ	హైదరాబాద్	వనస్థలిపురం	23.30	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3032780	గడ్డిపాటి అనిల్ కుమార్	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	113.50	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3248792	గటిరాజు రామరాజు	తెలంగాణ	హైదరాబాద్	చంద్రలోక్	186.20	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3398415	గంధ్రతి వంశీకృష్ణ	తెలంగాణ	హైదరాబాద్	ఎస్‌వీఎస్ రోడ్డు	32.80	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3395952	గంగాపురం ప్రవంతి	తెలంగాణ	హైదరాబాద్	వనస్థలిపురం	22.00	26-11-2024 : తేదీన/తర్వాత
GLN2941903	గౌసుద్దీన్	తెలంగాణ	హైదరాబాద్	వనస్థలిపురం	10.00	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3172955	గౌడ యుగేందర్	తెలంగాణ	హైదరాబాద్	సిద్దిపేట	93.30	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3285361	గుర్రం సురేష్	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	99.90	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3316778	హంబీర్ అశ్విని బాయి	తెలంగాణ	హైదరాబాద్	కామారెడ్డి	53.00	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3442260	ఇడ్డి సుజాత	తెలంగాణ	హైదరాబాద్	చందానగర్	10.00	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3395875	జక్కోని సత్యనారాయణ గౌడ్	తెలంగాణ	హైదరాబాద్	వనస్థలిపురం	14.90	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3325428	కె. కమల	తెలంగాణ	హైదరాబాద్	చందానగర్	167.50	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3393352	కాలేరు భార్గవ్	తెలంగాణ	హైదరాబాద్	చందానగర్	26.20	26-11-2024 : తేదీన/తర్వాత
GLN2942551	కనకమేడల ప్రదీప్	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	32.90	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3068263	కనకమేడల ప్రదీప్	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	26.90	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3261358	కరంజ బ్రహ్మం	తెలంగాణ	హైదరాబాద్	చందానగర్	20.00	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3375378	కేతావత్ గణేష్	తెలంగాణ	హైదరాబాద్	అమీర్‌పేట్	22.50	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3283972	కొమ్మినేని భార్గవ్	తెలంగాణ	హైదరాబాద్	మలక్‌పేట్	28.50	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3397916	కొనేటి సత్యప్రకాష్	తెలంగాణ	హైదరాబాద్	చంపాపేట్	223.80	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3048962	కూరపాటి శ్రావణ్‌కుమార్	తెలంగాణ	హైదరాబాద్	సుబేదారి	138.60	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3048977	కూరపాటి శ్రావణ్‌కుమార్	తెలంగాణ	హైదరాబాద్	సుబేదారి	196.70	26-11-2024 : తేదీన/తర్వాత
GLN2191302	కురువిల్ల జార్జ్	తెలంగాణ	హైదరాబాద్	ఆక్స్‌ఫోర్డ్ ప్లాజా	101.40	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3281219	ఎం. అవంతి	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	19.50	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3301250	ఎం. అవంతి	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	30.50	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3160237	మానుగల్ల రమేష్	తెలంగాణ	హైదరాబాద్	అమీర్‌పేట్	27.40	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3236595	మానుగల్ల రమేష్	తెలంగాణ	హైదరాబాద్	అమీర్‌పేట్	16.30	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3393126	మేఘన జక్కుల	తెలంగాణ	హైదరాబాద్	సనత్‌నగర్	17.90	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3393130	మేఘన జక్కుల	తెలంగాణ	హైదరాబాద్	సనత్‌నగర్	12.60	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3393145	మేఘన జక్కుల	తెలంగాణ	హైదరాబాద్	సనత్‌నగర్	61.40	26-11-2024 : తేదీన/తర్వాత
GLN2908706	మహ్మద్ ఉస్మాన్ పాషా	తెలంగాణ	హైదరాబాద్	హబ్సిగూడ	37.50	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3348855	మహ్మద్ జోహైద్ సుమాన్	తెలంగాణ	హైదరాబాద్	మలక్‌పేట్	13.25	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3165660	మహ్మద్ అబ్దుల్ మజీద్	తెలంగాణ	హైదరాబాద్	చంపాపేట్	49.20	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3322275	ములగిరి హరీష్	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	15.00	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3414525	ముంతాజ్	తెలంగాణ	హైదరాబాద్	రామంతాపూర్	22.80	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3316928	ఎన్. సుమన్	తెలంగాణ	హైదరాబాద్	పటాన్‌చెరు	29.30	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3442300	నీలరపు అనిల్‌కుమార్	తెలంగాణ	హైదరాబాద్	దిల్‌సుఖ్‌నగర్	135.50	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3357360	నేనావత్ శంకర్	తెలంగాణ	హైదరాబాద్	వనస్థలిపురం	25.00	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3294831	పోకల జయమ్మ	తెలంగాణ	హైదరాబాద్	ఖమ్మం	74.00	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3400307	పోకల జయమ్మ	తెలంగాణ	హైదరాబాద్	ఖమ్మం	76.20	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3405450	పోకల జయమ్మ	తెలంగాణ	హైదరాబాద్	ఖమ్మం	46.50	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3093378	పోలేపాక శివకుమార్	తెలంగాణ	హైదరాబాద్	ఎస్‌వీఎస్ రోడ్డు	53.40	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3402052	పొరండ్ల శివకుమార్	తెలంగాణ	హైదరాబాద్	మంచిర్యాల	17.50	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3138328	పోతూలూరి శ్రీకాంత్	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	101.10	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3295590	పూతినేడి వెంకట నాగసారి సాయిప్రకాశ్	తెలంగాణ	హైదరాబాద్	కాపూరిహిల్స్	73.30	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3347256	పుట్ట మాధవి	తెలంగాణ	హైదరాబాద్	సనత్‌నగర్	156.70	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3413949	పుట్ట మాధవి	తెలంగాణ	హైదరాబాద్	సనత్‌నగర్	234.30	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3197376	రాజు మొగిలి	తెలంగాణ	హైదరాబాద్	ఎఎస్‌రావు నగర్	59.30	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3216030	రత్లావత్ శారద	తెలంగాణ	హైదరాబాద్	బకాన్ బిల్డింగ్	30.20	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3273390	రాథోడ్ రవి	తెలంగాణ	హైదరాబాద్	గద్వాల	20.20	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3392699	రొడ్డ హైమవతి	తెలంగాణ	హైదరాబాద్	బిహెచ్ఇఎల్ టౌన్స్	20.30	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3234908	సాయిదం మమత	తెలంగాణ	హైదరాబాద్	చందానగర్	44.90	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3235001	సాయిదం మమత	తెలంగాణ	హైదరాబాద్	చందానగర్	45.50	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3392293	సంజీవ్ కుమార్ కామరాజ్	తెలంగాణ	హైదరాబాద్	ఆక్స్‌ఫోర్డ్ ప్లాజా	31.10	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3427240	శీలం విజయ	తెలంగాణ	హైదరాబాద్	రామంతాపూర్	52.44	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3335661	శివకుమార్ కొండ	తెలంగాణ	హైదరాబాద్	కామారెడ్డి	29.10	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3139970	సొప్పదండి లక్ష్మణ్	తెలంగాణ	హైదరాబాద్	సిద్దిపేట	27.90	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3394146	శ్రీపతి రామస్వామి	తెలంగాణ	హైదరాబాద్	ఎస్‌వీఎస్ రోడ్డు	41.20	26-11-2024 : తేదీన/తర్వాత
GLN2894200	సుమన మేకల	తెలంగాణ	హైదరాబాద్	పటాన్‌చెరు	207.30	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3319973	తలారి జ్యోతి	తెలంగాణ	హైదరాబాద్	ఆక్స్‌ఫోర్డ్ ప్లాజా	19.20	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3435613	తలారి జ్యోతి	తెలంగాణ	హైదరాబాద్	ఆక్స్‌ఫోర్డ్ ప్లాజా	7.90	26-11-2024 : తేదీన/తర్వాత
GLN2983982	రాదతల ఆంజనేయులు	తెలంగాణ	హైదరాబాద్	కామారెడ్డి	25.80	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3145130	ఉప్పునూర్ కరుణాకర్	తెలంగాణ	హైదరాబాద్	శంషాబాద్	53.40	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3396765	వడ్ల భార్గవి	తెలంగాణ	హైదరాబాద్	అమీర్‌పేట్	21.00	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3210295	వాక వెంకట రమణయ్య	తెలంగాణ	హైదరాబాద్	కూకట్‌పల్లి	56.00	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3388258	వాలేపు శివ	తెలంగాణ	హైదరాబాద్	చందానగర్	10.00	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3396949	వల్లెపు కుమార స్వామి	తెలంగాణ	హైదరాబాద్	సుబేదారి	145.10	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3414318	వల్లెపు కుమార స్వామి	తెలంగాణ	హైదరాబాద్	సుబేదారి	78.20	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3228170	వంగల విజయ్ కుమార్	తెలంగాణ	హైదరాబాద్	ఆక్స్‌ఫోర్డ్ ప్లాజా	18.90	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3264240	వెంకట రమణ సి	తెలంగాణ	హైదరాబాద్	సుచిత్రాసర్కిల్	27.00	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3234406	విస్లావత్ అనిల్ నాయక్	తెలంగాణ	హైదరాబాద్	సర్దార్‌పటేల్	9.70	26-11-2024 : తేదీన/తర్వాత
GLN3028707	యన గోపీకృష్ణ	తెలంగాణ	హైదరాబాద్	ఖమ్మం	14.00	26-11-2024 : తేదీన/తర్వాత

వేలం రోజున రెండు ఐటీవలి ఫోటోగ్రాఫులతో పాటు వెరిఫికేషన్ కొరకు వారి ఒరిజినల్‌తోపాటు వారి ఫోటో-గుర్తింపు, సంతకం మరియు నివాస రుజువు యొక్క కాపీని దాఖలు చేయవలసిందిగా బిడ్డరుదారులను కోరబడుచున్నది. బిడ్డరుదారులకు ఏ విధమైన నోటీసు ఇవ్వకుండానే వేలం నిర్వహించు యొక్క వేదిక/ తేది/ సమయం మార్పుచేయు లేదా రద్దుచేయు అధికారాలను బ్యాంకు కలిగియుంటుంది.
వేలం ప్రక్రియ యొక్క ఖర్చును వినియోగదారుని ఖాతాకు డెబిట్ చేయబడుతుంది. ఖాతా మొత్తానికి బిడ్ మొత్తం సరిపోని విషయంలో మిగతా మొత్తాన్ని వినియోగదారుని నుండి రికవర్‌చేయు అధికారాలు బ్యాంకు కలిగియుంటుంది.
వేలం యొక్క నియమ & నిబంధనలకు సంబంధించి ఏవేని తదుపరి వివరాల కొరకు, మీరు దిగువ పేర్కొన్న వ్యక్తి/లను సంప్రదించవలసిందిగా కోరబడుచున్నది.

కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్, ఫోన్: 9700699936

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించండి

- మాజీ మంత్రి హరీష్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కౌలు రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి హరీష్ రావు ఎక్స్ వేదికగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "కౌలురైతులకు రైతు భరోసా దేవుడెరుగు. తాము పండించిన పత్తిని మద్దతు ధరకు అమ్ముకోలేని దుస్థితికి వారి పరిస్థితి దిగజారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పత్తి పండించిన కౌలు రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలి" అని డిమాండ్ చేశారు.

ఢిల్లీలో దట్టమైన పొగ..

107 విమానాలు ఆలస్యం.. 3 రద్దు

ఢిల్లీ : ఓ వైపు పొగమంచు, మరోవైపు కాలుష్యం కలవడంతో ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయంలో విజిబిలిటీ ఉదయం 7:30 గంటలకు 800 మీటర్లకు పడిపోయింది, దీనితో 107 విమానాలు ఆలస్యంగా మరియు 3 రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అక్కడి వాతావరణశాఖ చెప్పిన వివరాల ప్రకారం.. బవానాలో అత్యధికంగా 471 ఏక్యూఐ నమోదైంది. అశోక్ విహార్, జహంగీర్ పురి లలో 466, ముండ్కా, వాజిర్పూర్ లలో 463, ఆనంద్ విహార్, షాదిపూర్, వివేక్ విహార్ లలో 457, రోహిణి, పంజాబీ బాగ్ లలో 449, 447 ఏక్యూఐ నమోదైంది. ఢిల్లీలో ఉన్న ఈ ప్రాంతాలన్నీ హై డేంజర్ కేటగిరీలో ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. 22 స్టేషన్లలో గాలినాణ్యత పూర్తిగా క్షీణించింది.



సోదరుని పాడె మోసిన చంద్రబాబు

- ముగిసిన నారా రామ్మూర్తినాయుడు అంత్యక్రియలు

చిత్తూరు : ఏపీ సీఎం చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడి అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఆదివారం ఆయన స్వగ్రామం తిరుపతి జిల్లా నారావారిపల్లెలో ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, రామ్మూర్తినాయుడి తనయుడు, సినీనటుడు నారా రోహిత్ ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు.. సోదరుడి పాడెను మోశారు. తల్లిదండ్రుల అంతిమ సంస్కారాలు నిర్వహించిన చోటే రామ్మూర్తి నాయుడి అంత్యక్రియలు నిర్వహించారు.

సాయిరామ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం



నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మంనగరంలో అత్యాధునిక సౌకర్యాలతో వైద్యులు జంగాల సునిల్‌కుమార్, జంగాల స్వాతిచే నిర్మించబడిన 'సాయిరామ్ సూపర్ స్పెషాలిటీ' ఆసుపత్రిని ఆదివారం ప్రారంభించారు. ప్రముఖులు జంగాల జ్యోతి, డాక్టర్ వెనిశెట్టి భాస్కర్‌లు ప్రారంభించారు. వెనిశెట్టి మధుమతి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా డీఎంఅండ్‌హెచ్‌ఓ బి.కళావతి భాయి హాజరై ఎండోస్కోప్ యూనిట్‌ని ప్రారంభించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా ఐఎంఏ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బి.శ్రీనివాస్‌రావు, కార్యదర్శి కె.జగదీష్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ బి.సైదులు, ఐఎంఏ ప్రెసిడెంట్ కె.నారాయణరావు, మాజీ ప్రెసిడెంట్ బి.కిషన్‌రావు, మాజీ కార్యదర్శి టి.సురేష్, కోశాధికారి ఆర్.స్వప్నలు పాల్గొని ఆసుపత్రిలోని వివిధ విభాగాలను ప్రారంభించారు. 100 పడకల గల ఈ అత్యాధునిక ఆసుపత్రిలో ఆర్థో, గ్యాస్ట్రో, సర్జికల్ గ్యాస్ట్రో, నెఫ్రాలజీ, జనరల్ మెడిసిన్, ఆంకాలజీ, రేడియాలజీ, డైటీషిన్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి.

కేంద్రానివి కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు

- నేడు హైదరాబాద్‌లో రాష్ట్ర సదస్సు : జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర బీజేపీ ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్టు జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా తెలిపింది. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర పాలకుల కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాల వల్ల దేశ ప్రజలు, రైతులు, కార్మికులు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. అన్ని పంటలకు మద్దతు దర వ్యవసాయ ఖర్చుకు 50శాతం అదనంగా జోడించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రుణ మాఫీ చట్టాన్ని తీసుకురావాలని అనేక సంవత్సరాలుగా రైతులు పోరాడుతున్నారని గుర్తు చేశారు. ఆ ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు కార్మిక కోడ్‌ల వల్ల కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, ఎనిమిది గంటల పని దినం, ట్రేడ్ యూనియన్ హక్కు వంటి హామీలను రద్దు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాలు పోరాడుతున్నా మోడీ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని విమర్శించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ దేశ వ్యాప్తంగా ఎస్‌కేఎం, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం రాష్ట్ర స్థాయి సదస్సును జరుపుతున్నట్టు వారు పేర్కొన్నారు.

మణిపూర్‌లో మళ్లీ హింస

(మొదటిపేజీ తరువాయి)

5, నాగా పీపుల్స్ ఫ్రంట్ 5, కాన్రాడ్ సంగ్మా ఎన్‌పీపీ 7 సీట్లు గెలుచుకున్నాయి. ఇవి కాకుండా, కుకీ పీపుల్స్ అలయన్స్ స్వతంత్ర అభ్యర్థులు 2 , 3 స్థానాల్లో విజయం సాధించారు. మణిపూర్‌లో పరిస్థితి చేజారబోతుండటంతో.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం పరిస్థితిని సమీక్షించనున్నట్టు లీకులు వస్తున్నాయి.

మణిపూర్‌లో అగ్నిమంటలు

మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. ఆందోళనకారులు వీధుల్లోకి వచ్చి విధ్వంసానికి పాల్పడ్డారు. ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ సహా పలువురు ఎమ్మెల్యేల నివాసాలపై దాడి చేశారు. మహిళలు, చిన్నారులను పొట్టనపెట్టుకుంటున్న వారిని శిక్షించలేకపోతే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల దుశ్చర్యను నిరసిస్తూ పలు వాహనాలకు నిప్పు పెట్టారు.

ఏం జరిగింది ?

జిరిబామ్‌లో ఉగ్రవాదులు అపహరించి హత్య చేసిన ఆరుగురి మృతదేహాలు లభించడంతో పెద్ద ఎత్తున విధ్వంసం జరిగింది. దీంతో నిరవధిక కర్ఫ్యూ విధించారు. ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. మృతులలో ముగ్గురు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఉగ్రవాదులు, భద్రతాదళాల మధ్య కాల్పులు జరిగిన తర్వాత జిరిబామ్‌లోని పునరావాస కేంద్రం నుంచి ఆరుగురు అదృశ్యమయ్యారు. వీరిలో ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి మృతదేహాలు శనివారం బారక్ నదిలో లభించాయి. ఒక మహిళ, ఇద్దరు చిన్నారుల మృతదేహాలను శుక్రవారం రాత్రి కనుగొన్నారు. ఉగ్రవాదుల దుశ్చర్యపై ఆగ్రహించిన నిరసనకారులు ప్రదర్శనలు జరిపారు. ముగ్గురు రాష్ట్ర మంత్రులు, ఆరుగురు ఎమ్మెల్యేల నివాసాలపై దాడులు చేశారు. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ అల్లుడు, బీజేపీ ఎమ్మెల్యే ఆర్.కె ఇమో సహా ముగ్గురు శాసనసభ్యుల ఇండ్లను ధ్వంసం చేశారు. వారి ఆస్తులకు నిప్పు పెట్టారు. ఇంఫాల్‌లోని వేర్వేరు ప్రాంతాలలో ఆందోళన చేస్తున్న నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు భాష్పవాయు గోళాలు ప్రయోగించారు.

శాంతి భద్రతల పరిస్థితి అదుపు తప్పటంతో ఇంఫాల్ లోయలోని ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, బిష్ణుపూర్, తౌబాల్, కక్‌చింగ్ జిల్లాలలో నిరవధిక కర్ఫ్యూ విధించారు. శాసనసభ భవనానికి కేవలం 200 మీటర్ల దూరంలో ఉన్న తంగ్‌మైబాండ్ ప్రాంతంలోని రోడ్డు మధ్యలో ఆందోళనకారులు టైర్లు వేసి నిప్పు పెట్టారు. జిరిబమ్ పట్టణంలో శనివారం రాత్రి కనీసం రెండు చర్చిలు, మూడు ఇండ్లను దగ్ధం చేశారు.

జిరిబమ్‌లో శనివారం రాత్రి భద్రతా సిబ్బందితో జరిగిన కాల్పులలో పది మంది కుకీ-జో యువకులు చనిపోయారు. వీరి మృతదేహాలను అసోంలోని సిల్‌చార్ పట్టణం నుంచి చురాచాంద్‌పూర్‌కు విమానంలో తరలించారు. దానికి ముందు సిల్‌చార్ ఆస్పత్రిలో మృతదేహాలకు శవ పరీక్షలు నిర్వహించారు. కాగా మణిపూర్‌లో నెలకొన్న హింసాత్మక పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. మహారాష్ట్ర పర్యటనను రద్దు చేసుకొని ఢిల్లీ చేరుకున్నారు.

అదనపు బలగాల మోహరింపు

హింసాత్మక ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం అదనపు భద్రతా దళాలను మోహరించింది. రాష్ట్రంలోని రెండు తెగలకూ చెందిన ఆందోళనకారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. శాంతి భద్రతల పునరుద్ధరణకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని భద్రతా దళాలను ఆదేశించింది. పరిస్థితి తీవ్రతను గుర్తించిన కేంద్రం జిరిబమ్ సహా ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో సాయుధ దళాల ప్రత్యేకాధికారాల చట్టాన్ని తిరిగి అమలులోకి తెచ్చింది.

పౌర సమాజం అల్టిమేటం

సాయుధ ఉగ్రవాద దళాలపై 24 గంటలలోగా నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని మణిపూర్‌లోని పౌర సమాజ బృందాలు ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశాయి. మరోవైపు హింసతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో పర్యటించాలనీ, శాంతి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేశారు. గతేడాది మణిపూర్‌లో హింస చెలరేగినప్పటి నుంచీ.. మోడీ ఆ రాష్ట్రంలో పర్యటించలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గుర్తు చేశారు. మణిపూర్.. రావణకాష్టంలా తగలబడటానికి మోడీ ప్రభుత్వమే కారణమని ఆయన ఆరోపించారు.

మధిరలో ప్రత్యక్షమైన అఘోరి

- ఆశీర్వాదం తీసుకున్న డిప్యూటీ సీఎం సతీమణి
- హైకేర్ ఆస్పత్రి నూతన భవనం ప్రారంభం

నవతెలంగాణ-మధిర

ఖమ్మం జిల్లా మధిర పట్టణంలోని హై కేర్ ఆస్పత్రి నూతన భవనంలో ఆదివారం జరుగుతున్న పూజా కార్యక్రమంలో అఘోరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని హాజరయ్యారు. ఈ సందర్భంగా అఘోరి కాళ్లకు మొక్కి ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు.



అఘోరిని చూడటానికి మధిర పట్టణ ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో హై కేర్ ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ జంగా నవీన్‌రెడ్డి, జంగా ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి

ప్రజా ఉద్యమాలు ఉధృతం చేయాలి
బూర్జువా పార్టీల విధానాలు ప్రతిఘటించాలి

- ప్రజా ఉద్యమాలకు ఎర్రజెండా నాయకత్వం : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య
- మహబూబాబాద్ జిల్లా సీపీఐ(ఎం) మహాసభలు ముగింపు
- జిల్లా కార్యదర్శిగా సాదుల శ్రీనివాస్ తిరిగి ఎన్నిక



నవతెలంగాణ-మహబూబాబాద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల మూలంగా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతున్నదని, ప్రజలు స్వచ్ఛందంగా ప్రజా పోరాటాలకు వచ్చే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో సీపీఐ(ఎం) ప్రజా ఉద్యమాలు ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య అన్నారు. బూర్జువా పార్టీలను నిలదీసేలా రోడ్లమీదకొచ్చే ప్రజలకు ఎర్రజెండా నాయకత్వం వహించాలని తెలిపారు. సీపీఐ(ఎం) మహబూబాబాద్ జిల్లా 3వ మహాసభ రెండవ రోజు ఆదివారం మహబూబాబాద్‌లోని బిషప్ హజరయ్య ఫంక్షన్ హాల్‌లోని వై వెంకటయ్య ప్రాంగణంలో నిర్వహించగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎస్. వీరయ్యతో కలిసి నాగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్.. ఎన్నికల్లో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపి అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాయని, ఇచ్చిన హామీలు అమలు చేయడంలో చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు దేశం అప్పు రూ.55వేల కోట్లు ఉండగా 11 ఏండ్ల నరేంద్ర మోడీ పాలనలో రూ.1,10,000 కోట్ల అప్పు చేశారని విమర్శించారు. అలాగే ఆకలి, దారిద్ర్యం, పేదరికం, నిరుద్యోగం పెరిగిపోయిందని అన్నారు. ప్రజల ఆగ్రహం నిరసన బయటికి రావడానికి ఇంకా ఎంతో సమయం పట్టదని అన్నారు. శ్రీలంకలో గత పాలకుల విధానాల వల్ల ప్రజల్లో ఆగ్రహం వెల్లువెత్తి.. రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారని తెలిపారు. వారికి ఎర్రజెండా అండగా నిలిచి ముందుండి పోరాడిందని తెలిపారు. దాంతో ప్రత్యామ్నాయంగా ఎర్రజెండాకు అధికారం కట్టబెట్టారని అన్నారు. ఆ స్ఫూర్తితో గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగం, వ్యవసాయ కార్మికులు, కూలీల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లాలో 67000 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, అవన్నీ అన్యాక్రాంతం అయ్యాయని చెప్పారు. భూ పోరాటాలు నిర్వహించి పేదలకు భూములు పంచాలని పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్రజెండానే : ఎస్ వీరయ్య



సమస్యలపై ప్రజలను సమీకరించి పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. భవిష్యత్తు ఎర్రజెండాదేనని జగమెరిగిన సత్యమని, దాన్ని నిజం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని తెలిపారు.

జనం అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని, ప్రభుత్వాలపై ప్రజలో అసహనం పెరుగుతోందని అన్నారు. ఇప్పటికే ప్రజలు రోడ్లపైకొస్తున్నారని, వారి పోరాటాలకు ఎర్రజెండా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. ఇటీవల హైదరాబాద్‌లో ఆటో కార్మికుల 15 సంఘాలు జేఏసీగా ఏర్పడి పోరాటం చేస్తే.. బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్ వచ్చి కార్మిక పోరాటాన్ని కబ్జా చేసారని విమర్శించారు. అశోక్‌నగర్‌లో నిరుద్యోగులు రోడ్లపైకి వచ్చి పోరాడితే కేంద్ర మంత్రి బండి సంజయ్ తానే పోరాటం చేసినట్టు ప్రజలను నమ్మిస్తు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బూర్జువా పార్టీల నాయకులతో ప్రజా సమస్యలు పరిష్కారం కావని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యను ప్రధాన సమస్యగా గుర్తించి ప్రజా పోరాటాలు చేపట్టాలన్నారు. ఈ మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శెట్టి వెంకన్న, గునిగంటి రాజన్న, సుర్ణపు సోమయ్య, ఆకుల రాజు, అల్వాల వీరయ్య, కందునూరి శ్రీనివాస్, కుంట ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శిగా సాదుల శ్రీనివాస్

మూడోసారి ఏకగ్రీవంగా
25 మందితో జిల్లా కమిటీ ఎన్నిక



డోర్నకల్‌లో నిర్వహించిన మహబూబాబాద్ జిల్లా 3వ మహాసభల ముగింపు సభలో 25 మందితో సీపీఐ(ఎం) మహబూబాబాద్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా సాదుల శ్రీనివాస్ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా శెట్టి వెంకన్న, గునిగంటి రాజన్న, సుర్ణపు సోమయ్య, ఆకుల రాజు, అల్వాల వీరయ్య, కందునూరి శ్రీనివాస్, కుంట ఉపేందర్‌ను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యులుగా మండ రాజన్న, సమ్మెట రాజమౌళి, బొమ్మన అశోక్, ఎస్ఎం రెడ్డి, గాడిపెల్లి ప్రమీల, కందునూరి కవిత, దుడ్డేల రామ్మూర్తి, మార్తినేని పాపారావు, భూక్య హరి, బొల్లం అశోక్, మల్లేడి కోటయ్య, బానోతు సీతారాంనాయక్, గునిగంటి మోహన్, అల్లి శ్రీనివాస్ రెడ్డి, అలువాల సత్యవతి, ఎండీ యాకూబ్‌ను ఎన్నుకున్నారు.

ఎంపీల అనర్హతపై కొత్త చట్టానికి కేంద్రం యోచన



న్యూఢిల్లీ : లాభాదాయక పదవిని కలిగి ఉన్న ఎంపీల అనర్హత విషయంలో 65 ఏండ్ల కిందటి చట్టాన్ని రద్దు చేయాలని కేంద్రం చూస్తున్నది. దీని స్థానంలో ప్రస్తుత అవసరాలకు సరిపోయేలా ఒక కొత్త చట్టాన్ని తీసుకురావాలని యత్నిస్తున్నది. ఎంపీలను అనర్హులుగా ప్రకటించటానికి 'లాభాదాయక పదవి (ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్' ఒక కారణంగా ఉండేది. అయితే, ఇప్పుడు కేంద్రం మార్పులకు శ్రీకారం చుట్టినట్టు తెలుస్తున్నది. కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖకు చెందిన లెజిస్లేటివ్ విభాగం ఈ మేరకు 'పార్లమెంటు (ప్రివెన్షన్ ఆఫ్ డిస్క్వాలిఫికేషన్) బిల్లు, 2024' ను రూపొందించింది. 16వ లోక్‌సభలో ఎంపీ కల్రాజ్ మిశ్రా నేతృత్వంలో 'లాభాదాయక పదవులపై జాయింట్ కమిటీ (జేసీఓపీ)' సిఫారసుల మేరకు దీనిని తయారు చేసింది.

బారామతిలో పవార్ లగేజీ తనిఖీ



పూనే : మహారాష్ట్రలోని పూనే జిల్లాలో బారామతి హెలిపాడ్ వద్ద ఆదివారం ఉదయం ఎన్నికల అధికారులు ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ లగేజీని తనిఖీ చేశారు. సోలాపూర్‌లో ఓ ఎన్నికల ర్యాలీకి హాజరయ్యేందుకు శరద్ వెళుతుండగా ఈ ఘటన జరిగింది. 'పవార్ సోలాపూర్‌లోని కర్మాలాలో జరిగే ర్యాలీలో ప్రసంగించడానికి వెళుతున్నారు. ఆయన లగేజీని బారామతి హెలిపాడ్ వద్ద అధికారులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన హెలికాప్టర్ ఎక్కి ర్యాలీకి వెళ్లారు' అని ఆయన పవార్ సన్నిహితుడు తెలిపారు.

మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బ్యాగును కూడా శనివారం అధికారులు తనిఖీ చేశారు. దీనిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే యశోమతి ఠాకూర్ స్పందిస్తూ ఎన్నికల అధికారులు ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే బ్యాగులను ఎందుకు తనిఖీ చేయడం లేదని ప్రశ్నించారు. శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే తన లగేజీని ఇటీవల అధికారులు తనిఖీ చేస్తుండగా దానిని వీడియో తీసి సామాజిక మాధ్యమాలలో షేర్ చేశారు. మోడీ, అమిత్ షా, ఏక్‌నాథ్ షిండే, ఇద్దరు ఉప ముఖ్యమంత్రుల బ్యాగులను అధికారులు తనిఖీ చేస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. కాగా షా, సీఎం షిండే, ఉప ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్‌ల లగేజీలను అధికారులు తనిఖీ చేస్తున్న దృశ్యాలు ఇటీవల వైరల్ అయ్యాయి.

హైపర్‌సోనిక్ క్షిపణి పరీక్ష సక్సెస్

భారత్ అమ్ములపొదిలో మరో మిస్సైల్

- శబ్దం కంటే ఐదు రెట్ల వేగంతో ప్రయాణం
- స్వదేశీ పరిజ్ఞానంతోనే అభివృద్ధి
- అనేక పేలోడ్లను తరలించే సామర్థ్యం

భువనేశ్వర్ : భారత్ తన తొలి దూర శ్రేణి హైపర్‌సోనిక్ క్షిపణిని ఒడిషా తీరం నుండి ఆదివారం విజయవంతంగా పరీక్షించింది. భారత రక్షణ పరిశోధన-అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఈ పరీక్షను నిర్వహించింది. భారత్ పరీక్షించిన తొలి హైపర్‌సోనిక్ క్షిపణి ఇదే కావడం గమనార్హం. బాలిస్టిక్ క్షిపణుల వేగంతో సమానంగా ఇది ప్రయాణిస్తుంది. అదే విధంగా క్రూయిజ్ క్షిపణుల సామర్థ్యం వీటి సొంతం. ప్రయోగంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందిస్తూ 'ఒడిషా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఐలాండ్ నుండి హైపర్‌సోనిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించడం ద్వారా భారత్ ఒక ప్రధాన మైలురాయిని అధిగమించింది. ఇది చారిత్రాత్మక ఘట్టం. ఈ పరీక్ష కీలకమైన, అత్యాధునికమైన సైనిక సాంకేతికతలను కలిగిన కొన్ని దేశాల సరసన భారత్‌ను చేర్చింది' అని కొనియాడారు.



దేశీయ పరిజ్ఞానంతోనే...

సాయుధ దళాల అవసరాల కోసం ఈ క్షిపణి వివిధ పేలోడ్లను తన వెంట తీసుకుపోతుందని, 1,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం చేరుకుంటుందని అధికారిక ప్రకటనలో వివరించారు. ఈ క్షిపణిని పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో హైదరాబాదులోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం క్షిపణి కాంప్లెక్స్ ప్రయోగశాలలలో అభివృద్ధి చేశారు. ఈ ప్రాజెక్టులో ఇతర డీఆర్‌డీఓ ల్యాబ్‌లు, పరిశ్రమ భాగస్వాములు కూడా పాలుపంచుకున్నారు. మన దేశం నాలుగు సంవత్సరాల క్రితమే హైపర్‌సోనిక్ టెక్నాలజీ డిమానిస్ట్రేటర్ వెహికల్ (హెచ్ఎస్‌టీడీవీ)ని విజయవంతంగా పరీక్షించింది. తద్వారా ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగిన అమెరికా, చైనా, రష్యా సరసన చేరింది. కాగా కీలకమైన అనేక సాంకేతికతలను సరిచూసుకున్న తర్వాతే సూపర్‌సోనిక్ క్షిపణిని పరీక్షించారు.

ప్రత్యేకతలు ఇవే

ఈ క్షిపణి గంటకు 6,115 కిలోమీటర్ల వేగంతో... అంటే శబ్దం కంటే ఐదు రెట్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఇతర బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణుల వేగంతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. సంప్రదాయ క్షిపణులతో పోలిస్తే వీటి ఆచూకీని కనిపెట్టడం చాలా కష్టం. ఇవి నిమిషాల వ్యవధిలోనే సంప్రదాయ, అణు పేలోడ్లను సరఫరా చేయగలవు. ఈ క్షిపణులు మధ్యలోనే తమ గమ్యాన్ని మార్చుకుంటాయి. కాబట్టి దానిని అంచనా వేయడం అసంభవం. క్షిపణిలోని స్క్రామ్‌జెట్ ఇంజిన్లు వాతావరణం నుండి ప్రాణవాయువును గ్రహించి హైడ్రోజన్ ఇంధనంతో దానిని కలుపుకొని ప్రయాణిస్తాయి.

మత స్వేచ్ఛకు విఘాతం

- క్షీణిస్తున్న మానవ హక్కులు
- పెచ్చరిల్లిన హిందూ మతోన్మాదం
- దెబ్బతింటున్న సామాజిక సామరస్యం
- భారత్‌పై అమెరికా కాంగ్రెస్ రీసెర్చ్ సర్వీస్ తాజా నివేదిక

న్యూఢిల్లీ : భారత్‌లో మానవ హక్కులు క్షీణిస్తున్నాయని అమెరికా కాంగ్రెస్ రీసెర్చ్ సర్వీస్ తాజా నివేదిక ఎండగట్టింది. కేంద్రంలో పది సంవత్సరాల పాటు సాగిన బీజేపీ పాలన, 2014 తర్వాత వివిధ రాష్ట్రాలలో బీజేపీ తన ప్రభుత్వాలను ఏర్పాటు చేసి ఉనికిని విస్తరించుకోవడం వంటి పరిణామాల కారణంగా దేశంలో హిందూ మతోన్మాదం పెచ్చరిల్లిందని తెలిపింది. ఇటీవలి సంవత్సరాలలో దేశంలో మతపరమైన హింసాకాండ పెరిగిపోయిందని, మత స్వేచ్ఛకు విఘాతం ఏర్పడిందని చెప్పింది. భారత్‌లో నెలకొన్న పరిస్థితులపై అమెరికా శాసనకర్తలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ ఆందోళన వెలిబుచ్చారు.

'భారత్ : మత స్వేచ్ఛ అంశాలు' పేరిట రూపొందించిన ఈ నివేదికను ఈ వారం ప్రారంభంలో విడుదల చేశారు. భారత లౌకిక రాజ్యాంగ ప్రాతిపదికను అందులో వివరించారు. పాలకులు అవలంబించిన రాజకీయ, మతపరమైన తప్పుడు వైఖరుల కారణంగా సామాజిక సామరస్యం దెబ్బతిన్నదని తెలిపారు. అంతర్జాతీయ చర్యలకు సంబంధించి కెనడా, అమెరికా ప్రాసిక్యూటర్లు ఇటీవల భారత ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను నివేదిక ప్రస్తావించింది. 'ఈ పరిణామాలతో భారత్-కెనడా సంబంధాలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. అవి అమెరికా-భారత్ భాగస్వామ్యంపై కూడా ప్రభావం చూపవచ్చు. ఈ పరిణామాలు అమెరికా ప్రతినిధి సభ దృష్టిని కూడా ఆకర్షించాయి' అని వివరించింది.

విశ్వసనీయత కోల్పోతుంది

గత రెండు దశాబ్దాల కాలంలో భారత్, అమెరికా అధికారులు ద్వైపాక్షిక భాగస్వామ్యానికి ప్రాతిపదికగా నిలిచిన కొన్ని విలువలను గుర్తించారని నివేదిక తెలిపింది. 2000వ సంవత్సరం నుండి చేసిన సంయుక్త ప్రకటనలలో రెండు దేశాలు ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, మానవ హక్కులు, బహుళత్వం వంటి అంశాలను ప్రముఖంగా ప్రస్తావించాయని గుర్తు చేసింది. మానవ హక్కులకు సంబంధించి భారత్‌కు ఉన్న పేలవమైన రికార్డు దృష్ట్యా అమెరికా భాగస్వామిగా ఆ దేశ పాత్ర బలహీనపడవచ్చునని తెలిపింది. హిందూ జాతీయతావాద విధానం ద్వారా దేశంలో మతపరమైన మెజారిటీవాదాన్ని ముందుకు తెచ్చేందుకు మోడీ, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని అంటూ ఈ ధోరణి కొనసాగితే భారత్ తన విశ్వసనీయతను కోల్పోతుందని చెప్పింది. దేశంలోని మత సమూహాల విషయంలో ప్రస్తుతం అనుసరిస్తున్న తప్పుడు వైఖరులను కొనసాగించడం లేదా వాటిని శాశ్వతంగా అవలంబించడం ద్వారా ఆ విశ్వసనీయతకు విఘాతం కలుగుతుందని అభిప్రాయపడింది.



నిర్దిష్ట ఆందోళన కలిగించే దేశంగా...

బలమైన శక్తిగా ఆవిర్భవించాలన్న భారత్ ఆశయం నెరవేరాలంటే సామాజిక సామరస్యం సాధించాల్సి ఉంటుందని, అమెరికా కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తోందని నివేదిక నొక్కి చెప్పింది. కాగా ద్వైపాక్షిక సంబంధాల విషయంలో విలువల కంటే విధాన రూపకల్పనలే ప్రధానమని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. భారత్‌ను 'నిర్దిష్ట ఆందోళన కలిగించే దేశం'గా అంతర్జాతీయ మత స్వేచ్ఛకు సంబంధించిన అమెరికా కమిషన్ 2020వ సంవత్సరం నుండి గుర్తిస్తోందని నివేదిక ఎత్తిచూపింది.



ఒత్తిడి తెస్తే...

మానవ హక్కుల విషయంలో అమెరికా బలవంతంగా ఒత్తిడి తెస్తే ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని కొనసాగించేందుకు భారత్ ఆసక్తి చూపకపోవచ్చునని నివేదిక అభిప్రాయపడింది. సీపీసీ హోదా, వ్యక్తులపై ముఖ్యంగా ప్రభుత్వ అధికారులపై విచారణ జరపడం, రక్షణ అమ్మకాలు లేదా సాయంపై ఆంక్షలు విధించడం వంటి చర్యలు భారత్‌ను కలవరపరుస్తాయని తెలిపింది. విలువల ఆధారిత భారత్-అమెరికా భాగస్వామాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలన్న లక్ష్యానికి ఇది సవాలుగా మారుతుందని చెప్పింది.

అమెరికా కాంగ్రెస్‌కు తొమ్మిది సూచనలు

భారత్‌లో స్వేచ్ఛకు సంబంధించిన అంశాల విషయంలో కాంగ్రెస్‌కు ఈ నివేదిక తొమ్మిది సూచనలు ప్రతిపాదించింది. విచారణలు, ప్రతినిధి బృందాల ద్వారా ఆందోళన వ్యక్తం చేయాలని, మానవ హక్కుల పరిస్థితులను మెరుగుపరచేందుకు షరతులతో కూడిన సాయం అందించాలని, యూఏపీఏ, ఎఫ్‌సీఆర్ఏ వంటి చట్టాలలో సంస్కరణలను ప్రోత్సహించాలని, భారత్‌లో యూఎస్‌సీఐఆర్ఎఫ్ పర్యటనలకు వీలు కల్పించి మద్దతు ఇవ్వాలని, దేశీయంగా, అంతర్జాతీయంగా మానవ హక్కులకు సంబంధించిన అంశాలను పరిష్కరించే దిశగా చట్టాలకు పదును పెట్టాలని సూచించింది.

కీలక ప్రాజెక్టులు గుజరాత్‌కు

ఉద్యోగాల కొరత మహారాష్ట్రకు

ఎంవీఏ అధికారంలోకి వస్తే ఉద్యోగాల కల్పనపై దృష్టి

- కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ప్రియాంక గాంధీ

ముంబయి : బీజేపీ అనుసరిస్తున్న విధానాలపై ఆ పార్టీని కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ ప్రియాంక గాంధీ విమర్శించారు. కొన్ని పెద్ద ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలిస్తున్నందునే మహారాష్ట్రకు ఉద్యోగ, ఉపాధి లేకుండా పోయిందని అన్నారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. అధికార కూటమి నాయకులు వాస్తవ సమస్యల నుంచి దృష్టి మరల్చే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని మహాయుతి ప్రభుత్వాన్ని ఆమె టార్గెట్ చేశారు. లడ్కీ బహిన్ స్కీంను ఉటంకిస్తూ నెలకు రూ.1500 కోసం కాకుండా చక్కటి జీవితం కోసం మహిళలు తప్పక ఓటు వేయాలని కోరారు. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి అధికారంలోకి వస్తే, సోయాబీన్ పంటకు క్వింటాల్‌కు రూ.7 వేలు ఇస్తామని రైతులకు ఆమె హామీ ఇచ్చారు. మహారాష్ట్రలో 2.5 లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఫాక్స్‌కాన్, ఏయిర్‌బస్ ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలింటంతో మహారాష్ట్రలో ఉద్యోగాలు లేవని ఆమె ఆరోపించారు. " నూతన నైపుణ్యాలు నేర్చుకొనే ప్రయత్నాలను ప్రజలు చేస్తున్నారు. కానీ, వారికి ఉద్యోగాలు దక్కటం కష్టంగా మారింది. దీనిపై ప్రభుత్వం ప్రాథమికంగా దృష్టి సారించాల్సింది. కానీ, ఈ పోస్టులను నింపటంలో సర్కారు విఫలమైంది" అని ప్రియాంక అన్నారు.

ఉపాధి అవకాశాలు లేకనే యువత ఆత్మహత్యలు

ఉపాధి అవకాశాలు లేని కారణంగానే మహారాష్ట్రలో యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నదని చెప్పారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించటంలో బీజేపీ విఫలమైన కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏక్ హైతో సేఫ్ హై అని బీజేపీ చేస్తున్న నినాదాన్ని ఉటంకిస్తూ.. ఈ దేశంలో వాస్తవానికి అదానీ 'సేఫ్'గా ఉన్నారనీ, సాధారణ పౌరులు మాత్రం కష్టాల్లో ఉన్నారని ఆమె ఆరోపించారు. జాతీయ ఆస్తులను ఒక వ్యక్తికి కట్టబెట్టటంపై కాకుండా.. ఉద్యోగాలు సృష్టించటంపై ప్రభుత్వం దృష్టిని సారించాలని అన్నారు. ప్రభుత్వంలో జవాబుదారీతనం లేకపోవటంపై బీజేపీని ఆమె విమర్శించారు. బీజేపీ పాలనలో ప్రధాని, మంత్రులు, ముఖ్యమంత్రులు ప్రజలకు జవాబుదారీగా లేరని అన్నారు. కాంగ్రెస్ పాలనలో తమ నాయకులు ప్రజలకు జవాబుదారీగా ఉండేవారని చెప్పారు. ఎంవీఏ అధికారంలోకి వస్తే.. జవాబుదారీతనం, ఉద్యోగ కల్పన, ప్రజలకు చేయూతనందించటంపై దృష్టి పెడుతుందన్నారు.



గొరవయ్యల సంస్కృతి అంతరించేనా...

జానపద కళారూపాల్లో సామూహిక నృత్యాల్లో మతపరమైన, కులపరమైన కళారూపం గొరవయ్యల నృత్యం. 12 వ శతాబ్దం నాటి వీరశైవారాధన గొరవయ్యల పుట్టుకకు కారణమని పండితుల అభిప్రాయం. మైలార దేవుడు రాక్షసులను చంపడానికి వేసుకున్న వేషమే గొరవయ్యలు వేసుకుంటారు. కంబళితో చేసిన పెద్ద అంగరఖా. ఇది మెడ నుండి పాదాలదాకా ఉంటుంది. నడుముకు పట్టీ, ఎలుగుబంటి చర్మంతో చేసిన ఎత్తైన టోపీ, మెడలో కంటె, గవ్వల దండ, కుడి చేతిలో దమరుకం, ఎడమ చేతిలో పిల్లంగోవి, నడుముకు జింక చర్మంతో చేసిన బండారు తిత్తి. ఈ వేషంతో వీరు వీధుల్లో తిరుగుతూ ఇల్లిల్లు తిరుగుతూ భిక్షాటన చేస్తారు. జమ్మలమడుగు ప్రాంతంలో దసరా ఉత్సవాల్లో భాగంగా గొరవయ్యలు నృత్య ప్రదర్శనలు ఇస్తారు.

కురవల చరిత్ర- సంస్కృతి గురించి వివరంగా చర్చించిన నవల రాసాని 'కపిరి'. ఇందులో దేవుడిని నమ్ముకున్న కొంతమంది కురవలు శివరాత్రికి ముందు శివదీక్ష తీసుకుంటారని చెబుతున్నా, ఈ గొరవ దీక్షను కుల పెద్ద నిర్ణయించిన ఏ రోజైనా తీసుకోవచ్చు. అదే పలస్తరం (పర స్థలం) గా పిలుచుకునే వలస దీక్ష. ఇది ఒక పవిత్ర దీక్ష. ఈ దీక్ష తీసుకున్న వాళ్లను గొరవయ్యలు అంటారు. వీరు ఆడోళ్ళు వండిన కూడు స్వీకరించకూడదు. ధాన్యం మాత్రమే తీసుకోవాలి. తప్పుడు పనులు చేయకూడదు. తప్పుడు మాటలు మాట్లాడకూడదు.

గొరవయ్య వేషధారణ ఎలా ఉంటుందంటే- గొరవయ్యగా మారిన రాయప్ప ఆరు మూర్ల అడ్డపంచెను తీసి గోసి పోసి నడుముకు బిగించుకుంటాడు. పీటపై ఉన్న గజ్జల్ని తీసి కాళ్లకు కట్టుకుంటాడు. ఆ తర్వాత దండం పైన నుంచి గాడా గుడ్డతో కుట్టి ఉన్న చొక్కా తీసి తొడుక్కుంటాడు. పీట పైనున్న కంబడి గొనుని తీసి దానిపైన తొడుక్కుంటాడు. పొడుగు చేతుల ఆ గొను రెక్కల వైపు ఎర్రటి గుడ్డ పీలికలతో కుట్టిన త్రిశూలం నిగనిగలాడుతుంది. దానిపైన మెడ పట్టీలు, రొమ్ము మీదుగా గవ్వల పట్టీ బిగించుకుంటాడు. నడుముకు వెడల్పాటి బెల్టులా కుట్టిన ఎర్రటి గుడ్డను బిగిస్తాడు. ఎలుగ్గొడ్డు కుళాయిని చేతుల్లోకి తీసుకొని, కళ్ళకు అద్దుకొని" జై మార్తాండ మైలార లింగేశ్వర" అని తల పైన పెట్టుకుంటాడు. అది సరిగ్గా తలకు సరిపోయింది. మెడకు బండారు జోలెను, సంకకు మరో జోలిని తగిలించుకుంటాడు. ఆ తర్వాత ఎడమ చేతికి నిలువు పిల్లంగట్టె ని తీసి పట్టుకొని ఢమరుకాని చేతుల్లోకి ఎత్తుకొని, దానికి శిరస్సును తాకించి "ఓం కాలభైరవ! సిద్దేశ్వరా" అని మనసులో శివుని స్మరించి డబడబక్క్ డబడబక్క్ అంటూ ఢమరుకం ఒకసారి వాయించి "ఇది మన ఆచారం, మన సంప్రదాయం" అంటూ శివరాత్రికి ఐదు ఆరు నెలల ముందు నుంచి గొరవయ్యలు పరస్తలం(వలస) యలబారుతారు. పల్లె పల్లె తిరుగుతా, గింజలు అడుక్కుంటా శివరాత్రి నాటికి తంబళ్లపల్లి మల్లన్న కొండకు పోయి, ఆడ బండ పైన రెడ్డెమ్మ పాడవంలో పాలు తాగి కపిరి కడుక్కొని, మల్లన్న స్వామిని దర్శించుకొని దీక్ష వదిలి రావాలి. ఇందులో కురవ గొరవయ్యలు ఎలుగుబంటి చర్మంతో చేసిన కుళాయిని ధరిస్తే , మాదాసి కురవలలోని గొరవయ్యలు ఉన్నికుళాయి ధరిస్తారని క్షేత్ర పర్యటనల ద్వారా తెలిసిన విషయాన్ని రచయితగా రాసాని నిర్ధారిస్తున్నారు.

గొరవయ్యలు భక్తుల కోరికపై వాళ్ళ ఇండ్లకు వెళ్లి పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఒగ్గు సేవలు జరిపించి, వాళ్ళు ఇచ్చే దక్షిణల్ని తీసుకొని దీవెనలు పలికి పోతుంటారు. పూజా కార్యాలు లేని సమయంలో ఒక్కొక్కరుగా గాని గుంపు గుంపుగా గాని భిక్షాటనకు పోతుంటారు.

గొరవయ్యలు భక్తుల కోరికపై వాళ్ళ ఇండ్లకు వెళ్లి పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఒగ్గు సేవలు జరిపించి, వాళ్ళు ఇచ్చే దక్షిణల్ని తీసుకొని దీవెనలు పలికి పోతుంటారు. పూజా కార్యాలు లేని సమయంలో ఒక్కొక్కరుగా గాని గుంపు గుంపుగా గాని భిక్షాటనకు పోతుంటారు.



తర తరానికి గొరవయ్యల సంఖ్య తగ్గిపోతూ, ఈ కాలానికి కొన్ని పదుల మందే మిగిలారు. వాళ్ళ సంఖ్యను పెంచాల్సిన బాధ్యత గణాచారిది. ఈ సంప్రదాయమే కురవల ఉనికిని చాటుతుంది. ఈ సంప్రదాయమే ఆదికాలం నుంచి వస్తున్న శివ తత్వాన్ని తెలియజేస్తుంది.

వీరి సంప్రదాయాన్ని తద్వారా, వీరి ఐక్యతను దెబ్బతీయడానికి అగ్రవర్ణాల వారు పన్నని కుట్ర లేదు. తమ చెప్పు చేతుల్లో లేని కురవగొల్లల్ని దెబ్బ కొట్టడానికి, వారి ప్రత్యేక సంస్కృతికి చెందిన గొరవ సంప్రదాయాన్ని దెబ్బ కొట్టాలని శ్రీశైలంలోను, తంబళ్లపల్లి మల్లన్న గుడిలోనూ దేవాదాయ శాఖ వారి సహకారంతో ఒక కొత్త జీవో సృష్టించగలిగారు. అదేమిటంటే అరుదైన గొరవ జానపద సాంస్కృతిని రక్షించడం ప్రభుత్వం వంతనీ, అందులో భాగంగా ప్రతి గొరవయ్యకు సంవత్సరానికి ?1000 శివరాత్రి రోజున ఇప్పిస్తామనీ, అయితే అది కేవలం 50 మందికేనని చట్టం. దీనితో కొన్ని వేల మంది ఉన్న



గొరవయ్యల్లో కేవలం 50 మందికిప్పించడం వెనక ఉన్న కుట్ర, సంస్కృతి పేరుతో ఒకటిగా ఉన్న వారి ఆచారాన్ని దెబ్బ కొట్టి వారి ఐక్యతను విచ్ఛిన్నం చేయడం, వాళ్ళ అస్తిత్వాన్ని లేకుండా చేయడం. పైకి జానపద సంస్కృతి సంరక్షణ, లోపల దాని నాశనానికి పథకాలు వేయడం.

రేవణ సిద్దేశ్వరుడి కాలం నుండి ఇప్పటివరకు గొరవయ్యలు అంటే ఎంతో భక్తి గౌరవం ఉండేది. గొరవయ్యలు వీధిలోకి వచ్చి ఆట ఆరంభించినారంటే చాటలు చాటలుగా ధాన్యం వచ్చి పడేది. జనాల నుంచి గొరవయ్యలు పూజలు అందుకునేవాళ్లు. కాలం మారిపోయింది. కరువుల మీద కరువులు వచ్చి పడతున్నాయి. వ్యవసాయం దెబ్బతినిపోయింది. చదువులు ఎక్కువైపోయాయి. కులవృత్తులు, కులాచారాలు జనాలు వదిలేస్తా ఉన్నారు. కులవృత్తుల స్వరూప స్వభావాలే మారిపోయాయి. అన్ని కులాల వాళ్ళు ముందుకెళ్ళిపోతా ఉంటే సంచార జాతులుగానే ఉండిపోయేట్టుగా చేసి ఈ ఆచారాన్ని పట్టుకొని ఇంకా వేలాడడం ఎందుకు? "మన పిల్లలు బాగా చదువుకోవాలి, పైకి ఎదగాలి. అందరి చేత ఇంకా తక్కువగా చూడబడే ఈ గొరవ దీక్షలతో, ఈ వలస జీవనంతో ఏం పని? ఎంత కాలమని ఎక్కడేసిన కంబళి లాగానే బతకాలి. మారాల్సింది, మనము మారాల్సిందే అంతగా కావాలంటే ఆ ఆచారాన్ని కళగా మార్చుకుందాం. పండుగల్లో, పబ్బాలలో, వేడుకల్లో ప్రదర్శిస్తా నిలబెట్టుకుందాం. ఆ కళకు జాతీయస్థాయిలో, ఇంకా కావాలంటే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేట్టుగా చేసుకుందాం" అని తీర్మానించుకోవడంతో ఈ నవల ముగుస్తుంది.

గొల్లలను, కురుమలను కలిపి మొదటి నుండి గొల్ల కురుమలుగానే పిలుస్తుంటారు. వీళ్ల ఒకే కుదురు నుండి వచ్చిన అన్నదమ్ములని కుల పురాణాలు కూడా నొక్కి చెబుతుంటాయి. బర్లు, ఆవులు మేపే వాళ్లను గొల్లలని-.గొర్రెలను మేపే వాళ్లను కురమలని ప్రత్యేకంగా వ్యవహరిస్తుంటారు. ఆవులు బర్లను మేపుకునే గొల్లలు ఆర్థికంగా బలపడటంతో వ్యాపార, రాజకీయ రంగాలలోకి దూసుకు రాగలిగారు. కురుమల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి లాగే ఉండిపోయింది. దాంతో గొల్లలు తాము అధికులమనీ, కురుమలు తమకంటే కింది జాతి వాళ్ళనే వాదనను ముందుకు తెచ్చారు. అందువల్ల గొల్లలు,కురుమల మధ్య కంచం పొత్తు, మంచం పొత్తు లేకుండా పోయింది.

"కపిరి" నవల లో కురుమ కదిరప్ప, గొల్ల పాలేటమ్మ ప్రేమించుకుంటారు. పెళ్లి చేయమని పెద్దలను అడిగితే కులభేదంతో నిరాకరించడంతో పాలేటమ్మ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంటుంది. కదిరప్ప చంపాడని భావించిన గొల్లలు అతడిని కొట్టి చంపేస్తారు. ఈ హత్యను కుల పరంగా సమర్థించుకోవడం ఎంతటి విషాదం!

కురవలు ఒకపక్క జీవాలు మేపుకుంటా, మరో పక్క సేద్యాలు చేసుకుంటా దుడ్లకు ధాన్యాలకు కొదవ లేకుండా సుభిక్షంగా బతుకుతున్నారని ఓర్వలేని ఊరు పెద్దలు గొల్లలు, కురుమల మధ్య- కురవలు,వడ్డెబోయిల మధ్య విభేదాలు సృష్టించి వాళ్లను బద్ధ శత్రువులుగా తయారుచేస్తారు. చివరకు ఎన్నికల సమయంలో తామంతా ఐకమత్యంగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తించి అంతా కలిసి పోతారు.

గొల్ల కురుమల నుండి - కురుమలను బీసీ బీలో చేర్చి, గొల్లలను బీసీ డీలో చేర్చిన ప్రభుత్వం వారు కురవలలో నుండి మాదాసి కురవలను విడదీసి ఎస్సీ జాబితాలో చేర్చడం విచిత్రం. ఎస్సీలలో చేర్చినప్పటికీ వారికి కుల సర్టిఫికెట్లు కానీ, ఇతర బెనిఫిట్ లు కానీ అందజేయకపోవడం మరో విచిత్రం.



కె.పి.అశోక్ కుమార్
9700000948

తోపుడు బండి అంత:స్మరణ



సాధిక్ అలీ లేడు. అంతను తయారు చేసి నడిపిన బండి వుంది. పుస్తకాలతో బిక్కుబిక్కుమంటూ మౌనంగా, బాధగా, దిగాలుగా, వేదనగా చూస్తూ వున్నది. ఎవరైనా ఇంకో 'సాధకు'లు నన్ను తోసుకుంటూ మనుషుల దగ్గరికి తీసుకెళతారని. తోపుడు బండిగా నేనెన్ని నాళ్లుగానో బరువులు మోసానేగాని ఇలా సాహిత్యాన్ని, గుండెలయల్ని, జ్ఞాన పత్రసంపుటులను, మేధోమధనంలో వచ్చిన అమృతాక్షరాలను మోసేపనికి నన్ను ఉపయోగించింది మొదటిసారి సాదిక్ భయ్యానే. నన్ను వినియోగించి నా పేరుతోనే పేరు తెచ్చుకున్న మహానుభావుడూ ఆయనే. ఆయనను 'తోపుడుబండి సాధిక్ అలీ' అనే అంటారు. నా చలనానికి జీవం పోసి, నన్ను మనుషుల్లో నిలబెట్టిన, నా బతుక్కో పరమార్థాన్ని కల్పించిన ఆ మహామనిషి అర్థాంతరంగా నన్ను వొదిలేసి పోయారు. కన్నీళ్లన్నీ ఇంకిపోయాయి. మనుషులు పోతారని తెలుసు. కానీ ఇలాంటి గొప్ప మనుషులు, పరోపకారులు, సంస్కార హృదయులు, సాహితీ ప్రియులు పోవడం బాధకలిగిస్తుంది.

నేను నా కోసమే ఏడ్వడం లేదు. అతనున్నప్పుడు నేనెంత కళకళలాడుతూ ఉండేదాన్నో, నా చుట్టూ జ్ఞాన చక్షువులు ఎన్నో ముసురుకునేవి. నా కోసమే ఎదురు చూసేవి. అదలా వుంచితే, తోపుడు బండి సాధిక్ భాయ్ వుంటే, ఎంతోమంది యువత, తమ భవిత భరోసాతో కొనసాగేదని, చదువులు వెలిగేవని, తోడొకరున్నారనే ధైర్యం ఎంతో మందిలో కలిగేది కదా! పోయిన మనుషులు ఎందుకు గుర్తుంటారంటే, ఇదిగో ఇలాంటి పనులు బతికున్నప్పుడు చేస్తేనే. పోయింతర్వాత కూడా బతికుండటమంటే ఇదేమరి! సాధిక్ భయ్యా లేని చోటు నాకే కాదు, ఇదిగో, ఎంతోమందికి వెలితిని మిగిల్చిపోయాడు. బఠానీలు, పుట్నాలు, పల్లీలు కుప్పలుగా పోసుకుని తిరిగే నేను అక్షరాల కుప్పల్ని తలకెత్తుకున్నందుకు ఈ మాత్రం జ్ఞాపకాల్ని పంచుకోగలుగుతున్నాను. మరచిపోయాను డిసెంబరు రాగానే నాకు సందడే సందడి! సాధిక్ భాయ్‌కు తీరికే ఉండేది కాదు. పుస్తకాల పండుగలో (బుక్‌ఫెయిర్) రికాము లేకుండా కలియదిరిగేవాళ్లం. దోస్తులు బోలెడుమంది కలిసేవాళ్లు. ఇప్పుడెలా! భయ్యా లేడు. నన్ను తోయందే కదలలేను. ఎవరైనా సాధిక్ భాయ్‌లా తిరిగి ప్రారంభిస్తారా? మంచి మనుషులు అందించిన పనులను, వారి అనంతరం ఎవరైనా సాగించాలి కదా! ఎవరున్నారు!



- కె.ఆనందాచారి,
9948787660

కథల పోటీ

అక్షరాల తోవ సాహితీ సంస్థ 7వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో కథల పోటీలు నిర్వహించనుంది. ఏదైనా సామాజిక అంశాన్ని కథా వస్తువుగా తీసుకుని డిటిపిలో 4/5 పేజీలకు మించని కథలను డిసెంబర్ 10 లోపు రాచమళ్ళ ఉపేందర్, స్టార్ ఆఫ్ సెట్ ప్రింటర్స్, శాంతి లాడ్జి ఎదురుగా, స్టేషన్ రోడ్, ఖమ్మం - 507001 చిరునామాకు పంపాలి. వివరాలకు : 98492 77968, 9866645218, 9010972169

- అక్షరాల తోవ సాహితీ సంస్థ, ఖమ్మం

ఖో...ఖో...

సెగలేని పొయ్యిమీద పెనం పెట్టి గుండ్రంగా
అందంగా రొట్టె చేసి సుతారంగా అటూ ఇటూ
చొంగకారుస్తూ కాలుస్తున్నాడు
అటు రాజ్యానికి ఇటు ప్రజలకూ
వివాదం కాని నినాదం ఒకటి
మనిషి ఉద్యోగము సద్యోగం
భూమి గాలి అడవి వనరు ఒనరు
రాజకీయంలో సర్దుబాటు అవుతూనే
చంద్రుని గుట్టుతెలిసిన తర్వాత
వెన్నెల వన్నెలను కీర్తిస్తుంటాడు
ప్రశ్నను పోగొట్టుకొని
ఉత్తుత్తగానే వెతికినట్టు చేస్తుంటాడు
చుట్టు చుట్టూ తిప్పి తీరా అంటుకోని స్టవ్ మంట మీద
పోషకాలు లేని వంట చేసి
అవకాశ అసలైన రాజకీయం
లొట్టలేసుకుంటూ వడ్డిస్తుంటాడు

- జూకంటి జగన్నాథం

ఇది కదా అర్చన



వాకిళ్ళు ఊడుస్తున్న
మెత్తని చప్పుళ్ళు నాకు సుప్రభాతాలు
నేను ముప్పూటలా తింటోన్న అన్నం
రైతు పెట్టిన ప్రసాదం
తాగుతున్న నీళ్ళు
ఒకప్పుడు మా బావి తవ్విన ఉప్పర్ల తీర్థం
తల్లి తన కాళ్ళపై
నన్ను వెల్లకిలా బోర్లా పడుకోబెడుతూ
గోర్వెచ్చని నీళ్ళతో పోసిన స్నానం
గొప్ప అభిషేకం
మా చెల్లె కత్తిరించిన బీడీల ఆకుల
శబ్దాలు మంగళవాయిద్యాలు
నేతన్న నాకు తొడిగిన గుడ్డలు
సమస్త వస్త్రాలంకణలు
దోమల నివారణకై
అమ్మ ముట్టించిన కుంపటి పొగ...ధూపం
గురువులు శిష్యవాత్సల్యంతో
నాలో వెలిగించిన జ్ఞానం... దీపం
చలిని అరికట్టేందుకు
మా అక్క నా తలకు
కట్టిన అరికంట్లం...శఠగోపం
ఉన్నతవిద్యల కోసం
పడరాని పాట్లుపడుతూ
నాన్న నా జేబులో వేసిన పైసలు...
హుండీ డబ్బులు
మేస్త్రీ కట్టిన మా ఇల్లు ...గుడి
నాకు పని- నిజమైన పూజ
చెప్పేదీ, చేసేదీ ఒక్కటే అయిన మనిషి-
నా ఇష్టదైవం, మా ఇంటిదైవం.

- నలిమెల భాస్కర్

చిదిగిన గూడు

ఒకప్పుడు అక్కడ తండా వుండేది
తనువంతా చెట్టయి తిరగాడి
బతుకంతా మట్టి పొదుగుల్తో శ్వాసగా
ప్రకృతితో మెలిగిన మనుషులుండే వాళ్ళు
ఇపుడక్కడ మసకపడిన ఆనవాళ్ల మాత్రమే మిగిలి
తండా జాడలన్నీ చెరిగిపోయాయి
తండా వాసులు లేని అడవి గర్భస్రావమైన తల్లి లాగుంది
దేశపటంలో దేశం లేనంతగా ఇప్పటిది కాదు వాళ్ళ చరిత్ర
నాలుగు తరాలు అక్కడే దుసేరు తీగతో గంపకట్టినట్లు
ఆ నేలతో బట్టకట్టిన బతుకులు వాళ్ళు చెట్లకు చేతులిచ్చారు
కొమ్మమింద పిట్టకు గొంతునిచ్చారు మట్టికి చెమటల్ని అద్దినారు
కాలికి గజ్జె కట్టిన తంగేడు పూలు అనాదిగా నడిసిన అడుగుల్ని
దోసిళ్ళతో ఎత్తి పోసుకుపోవడమంటే మాటలా !
దుఃఖపు నెర్రల మధ్య పోతూ పోతూ
ఆ మట్టికింది ఒక రక్తపుగింజ నాటేవుంటారు
ఎప్పుడో ఒకప్పుడు మొలకెత్తక మానదు
(పి.వి తండా కనుమరుగయిన తడికన్నులతో..)

- ఈ.రాఘవేంద్ర

శ్రీశ్రీ - ఆంగ్లీకవనం సఫల యత్నమేనా?

తెలుగు సాహిత్యంలో 'ఈ శతాబ్దం నాది' అని ప్రకటించుకున్న కవి శ్రీశ్రీ (1910 - 1983). అందుకు ఆయన తెలుగు సాహిత్యంలో చేసిన ప్రయోగాలు, కృషి, ఆయన సృజన ఆయన ఆ మాట అనేందుకు పురికొల్పాయి. తెలుగు కవిత్వాన్ని ఒక సంధి కాలంలో ప్రతిభావంతంగా వెలిగించినవాడు శ్రీశ్రీ. పద్యం నుంచి అనువాదం వరకు ఏది చేసినా ఉన్నత ప్రమాణాలు అందుకునేందుకు ప్రయత్నించాడు. ప్రపంచ సాహిత్యాన్ని విస్తృతంగా చదువుకోవడమే కాకుండా తెలుగు సమాజానికి పరిచయం చేశాడు.

అయితే తన సమకాలీన కవుల కన్నా శ్రీశ్రీ నాలుగడుగులు ముందు ఎందుకున్నాడోనని పరిశీలిస్తే, ఆయన ప్రపంచ సాహిత్యాన్ని చదువుకోవడమే కాకుండా, ఆ సాహిత్యాన్ని వస్తుశైలీ గతంగా తెలుగులోకి అనువదించాడు. అలాగే తన కవిత్వాన్ని విశ్వ వినువీథుల వినిపించాడు. అందుకే శ్రీశ్రీ కవిత్వంలో వస్తు వైవిధ్యమూ, నవ్య వ్యక్తీకరణ, భావ లాలిత్యమూ, ఆర్ద్రత, అభ్యుదయ భావజాలమూ, మహోగ్రమయిన కవితాలయ వుంటాయి. ఇవే శ్రీశ్రీని మిగతా కవులకు భిన్నంగా, అభ్యుదయ కవిత్వానికి ఒక ఐకాన్‌గా నిలబెట్టాయి.

'ఒక కథ గాని, గీతం గాని, నాటకం గాని ఎంతగానో నన్ను ఆకర్షిస్తేనే తప్ప దాన్ని నేను అనువదించను 'అని ప్రకటించుకున్న శ్రీశ్రీ ఆ పనిని నిష్టగా చేశాడు. ప్రపంచ కవిత్వాన్నే కాక, తన తోటి కవుల కవిత్వాన్ని కూడా ఆంగ్లీకరించాడు. ఇట్లా తన తోటి కవుల కవిత్వాన్ని ఆంగ్లీకరించిన తెలుగు కవులు బహు అరుదు. శ్రీశ్రీ కవిత్వం చదువుతున్నప్పుడు ఆ కవిత్వంలోని పదాల ప్రవాహ వేగాన్ని ఆంగ్లంలోకి ఎవరయినా చేశారా అన్నది ఆసక్తికరం. అందులోనూ ఆయన కవిత్వంలో లయాత్మక శాబ్దిక ధ్వనిని ఆంగ్లంలోకి తీసుకువచ్చారా అన్నది ఇంకా ఆసక్తిదాయకం. శ్రీశ్రీ కవిత్వం ఆంగ్లంలోకి అనువాదం చేసినవారు ఎవరైనా వున్నారో లేదో గానీ, శ్రీశ్రీ సాహిత్యనిధి తరపున అశోక్ కుమార్ గారు శ్రీశ్రీ ఆంగ్లం నుండి తెలుగు చేసిన కవితలతో 'ఆంధ్రీ కవనం', తెలుగు నుండి ఆంగ్లంకు చేసిన కవితలతో 'ఆంగ్లీకవనం' పుస్తకాలు వెలువరించారు.



ఆంగ్లీకవనంలో శ్రీశ్రీ మొత్తం 53 కవితలు తెలుగు నుంచి ఆంగ్లంలోకి అనువదించారు. అందులో 40 శ్రీశ్రీ సొంత రచనలు కాగా మిగతా 13 మిగతా తెలుగు కవులవి. అందులో 5 కవితలు దిగంబర కవులవి కాగా, మిగతా వారు పేరు గాంచిన తెలుగు కవులు.

తెలుగు సాహిత్య ప్రపంచంలో ముందు నుంచీ ఇతర భాషల నుంచి తెలుగులోకి వస్తున్న సాహిత్యం ఇబ్బడి ముబ్బడిగా వుంటే, తెలుగు నుంచి ఆంగ్లంలోకి వెళుతున్న సాహిత్యం, అందునా కవిత్వం బహు తక్కువ. తెలుగు కవిత్వంతో , ఆ మాట కొస్తే అసలు కవిత్వ అనువాదంతోనే అనేక సమస్యలు వున్నాయి. పద్యం/ కవితలో వుండే నడక, లయ, సొగసు, ఛందస్సు, శాబ్దిక గాంభీర్యం అనువాదానికి లొంగదు. ఇతర భాషలలోని ప్రక్రియా రూపాలైన అమెరికన్ల సోనెట్, పారసీక గజల్, జపనీయ హైకు పరభాషలలోకి అంతే సారంతో అనువాదం కావు. లక్ష్యభాషను నేర్చుకున్న అనువాదకులు కూడా మూలభాషలో ప్రావీణ్యులైన స్కాలర్స్‌ని సహ అనువాదకులుగా ఏర్పాటు చేసుకొని, అనువాద పుస్తకాలు ప్రచురిస్తున్నదీ ఇందుకే. ఇందువల్ల అనువాదం మూలభాషకు దగ్గరగా వచ్చే అవకాశం వుంది. అనువాదాలు నమ్మదగినవిగా, నాణ్యంగా, రచయిత అంతరాత్మను పట్టి ఇచ్చేవిగా వుండడానికి అవకాశం వుంది.

'అనువదించడం ఎలా?' అనే పుస్తకంలో కవిత్వ అనువాదం గురించి చర్చిస్తూ గోవిందరాజు చక్రధర్ ఇలా అంటున్నారు. పరభాషలో పాండిత్యముండాలే గానీ వేమన కవిత్వం అనువాదానికి చక్కగా ఒదుగుతుంది. బ్రౌన్ కూడా మరీ తేలిగ్గా వీటిని అనువదించలేదు. వేమన పద్యాల అనువాదకర్తృత్వంలో ఎదురైన ఇబ్బందుల్ని గురించి బ్రౌన్ ఇలా వివరించారు.

"These poems have attained very great popularity and parts are found translated into Tamil and Malayalam or Canarese.Their terse closeness of expression sometimes renders them difficult to translate with elegance. బ్రౌన్ elegant గా అనువదించడం కష్టం అన్నారు. వేమన పద్యానికొక అందమైన శైలి వున్నది. ఆ శైలిని అనువాదంలో పునఃసృష్టించడం కష్టమని బ్రౌన్ మహాశయుడు అంగీకరించారన్నమాట.'

శ్రీశ్రీ కూడా దీనికి అతీతుడు కాదు. మిగతా అన్నిచోట్ల అనువాదాన్ని నెగ్గించుకుంటా వచ్చిన శ్రీశ్రీ తన సొంత కవిత్వంలోని ప్రవాహ లయని ఆంగ్లంలో సాధించలేకపోయాడు అధయ'బాటసారి' కవిత ఉదాహరణగా చూడండి:

"జ్వరం కాస్తే,/ భయం వేస్తే,/ ప్రలాపిస్తే-/ మబ్బుపట్టీ, గాలికొట్టీ,/ వానవస్తే, వరద వస్తే,/ చిమ్మచీకటి క్రమ్ముకొస్తే/ దారితప్పిన బాటసారికి/ ఎంతకష్టం!

(A Wayfarer)

Consuming fever vibrant, virulent,

Sends shocking fear through his entire being;

He raves, he roars half a consciously

And the clouds gather, strong winds rage,

A storm, a flood, pitch darkness around

In grief he is drowned.

He lost his way, how sad his plight!

రెంటికీ పోల్చి చూడండి. తెలుగులోని కవితా శైలి ఉత్తుంగ తరంగాల్లా పోటెత్తితే..ఆంగ్లంలో ఆ లయ, పోటెత్తే శైలి,సంక్షిప్తత లుప్తమయి, కేవలం భావార్థాన్ని మాత్రమే కలిగివుంది. కాబట్టి కవిత్వానువాదంలో కూడా భేష్ అనిపించుకున్న శ్రీశ్రీ కూడా తన కవిత్వాన్ని ఆ లయ, నడక,స్వరం, పదాలు, శాబ్దికసౌందర్యంతో, సంక్షిప్తీకరణతో, తీవ్రతతో సహా అనువదించలేక పోయాడని నిరూపితమవుతున్నది. ఇది శ్రీశ్రీ కవిత్వంలో పరవళ్ళుగా ప్రవహించే శైలి గల ప్రతి కవితకు వర్తిస్తుంది. మహాప్రస్థానం (Long March) చూడండి, ప్రతిజ్ఞ (Now I Vow) చూడండి, జయభేరి (Jaya Bheri) చూడండి, దేశ చరిత్రలు (The March of History) ఇలా మరికొన్ని.

ఆయనకు చాలా పేరు తెచ్చిన కవితలు ' కవితా!ఓ కవితా!' (To Posey : A Rhapsody) జగన్నాథుని రథచక్రాలు (Chariot Wheels of Jagannatha) ఆంగ్లీకరణ కూడా తెలుగు కవిత ప్రమాణాలు పూర్తిగా అందుకోలేకపోయిందనే చెప్పాలి.

కానీ స్థితప్రజ్ఞత, దయ, సౌందర్యం, అనుభూతి వంటి విషయాలు వున్న కవితలు మాత్రం ఆంగ్లంలోకి బాగానే తర్జుమా చేసినట్టు కనపడుతోంది.ఆశాదూతలు (Messengers of hope), ఐ (I), అవతలి గట్టు (The Shore beyond), సాహసి (Adventurer), భిక్షువర్షీయసి (An Old Beggar Women), పరాజితులు (The Departed), ఆః (Ah), నిజంగానే (Good News), నీడలు (The Shadows) ఇలాంటి కవితలకు చేసిన ఆంగ్ల అనువాదం చాలా బాగా వచ్చాయి.Tone, mood, syntax అంతా కూడా మూల కవితకు చాలా దగ్గరగా వున్నాయి. నేరుగా ఆంగ్ల కవిత చదివినా గానీ, తెలుగు కవిత చదివినా గానీ అదే రకమైన పఠనానుభవం ఇస్తుంది.



పి. శ్రీనివాస్ గౌడ్,
99494 29449

ఖడ్గసృష్టి (Forging the Sword) లాంటి కవితలో ఆంగ్లానువాదం కొన్ని కవిత్వ పేరాలు పైకీ కిందకీ మారాయి. శరచ్చంద్రిక (Autumn Moonlight) కవితలో ఆంగ్లానువాదం తెలుగు పాద/ పద్య విభజన పాటించలేదు. కొన్ని కవితలలో తెలుగు పదాలకి సరితూగే ఆంగ్ల పదాలు వాడలేదు. ఉదాహరణకు 'బహుళ పంచమి జోత్స్న' అనే పద బంధానికి Moonlight అనే ఆంగ్ల పదంతో సరిపెట్టడం కనిపిస్తుంది.

శ్రీశ్రీ ఆంగ్లం నుండి తెలుగు అనువాదం చేసేప్పుడు మాత్రం మరలా ఆయనలో శైలీవిన్యాసం, పద తీవ్రత, శబ్దలయ అన్నీ వచ్చి చేరతాయి. దీనికి మనం ఎన్నో ఉదాహరణలు చూపవచ్చు. మయకోవ్‌స్కీ రాసిన 'లెనిన్' కావ్యం శ్రీశ్రీ అదే భావతీవ్రతతో, శబ్దసౌందర్యంతో తెనిగించాడు.

మొత్తంగా చూసినప్పుడు శ్రీశ్రీ కి తెలుగు, ఆంగ్ల పదాల మీద వున్న పట్టు తెలిసి వస్తుంది. ఆంగ్ల కవితను నిర్వహించడం ఆయనికి పాశ్చాత్య సాహిత్య అధ్యయనం వల్లనే సాధ్యమయిందనేది నిర్వివాదాంశం.

అనువాదం మీద అభిరుచి, అధ్యయనం మీద ఆసక్తి, తులనాత్మక సాహిత్యం ఆకళింపు వున్నవాళ్ళు తప్పక చదవవలసిన పుస్తకం శ్రీశ్రీ ' ఆంగ్లీకవనం.'

ఈ కష్టతరమైన పనిని ఎంతో ఇష్టంతో చేస్తున్న శ్రీశ్రీ సాహిత్యనిధి అశోక్ కుమార్ గారికి ఎన్ని ధన్యవాదాలు చెప్పినా తక్కువే. ఈ విషయంగా తెలుగు సాహిత్య లోకం ఆయనకు ఋణపడి వుంటుంది.

గ్రూప్ -3 పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు

ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్



నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మంలోని గ్రూప్ -3 ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పరిశీలించారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 87 పరీక్ష కేంద్రాలలో జరుగుతున్న గ్రూప్-3 పరీక్షల నేపథ్యంలో బందోబస్తు పరిశీలించేందుకు నగరంలోని పరీక్ష కేంద్రాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి తగిన సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలులో ఉన్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ అధికారులు పోలీస్ పెట్రోలింగ్, బందోబస్తుతో అప్రమత్తం ఉండాలని ఆదేశించారు.

నేడు ఉభయ జిల్లాల్లో ఎంపీ రఘురాంరెడ్డి పర్యటన



నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి సోమవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పర్యటించనున్నారని ఎంపీ క్యాంప్ కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని ఆరోగ్య హాస్పిటల్‌లో ఆర్థో యాక్సిడెంట్ కేర్ యూనిట్‌ను ప్రారంభిస్తారని, ఆ తర్వాత ఉదయం 11:30 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లికి చేరుకుంటారు. అక్కడ జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తారని, అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు పెనుబల్లి మండలం టేకులపల్లిలో ఓ శుభకార్యానికి హాజరవుతారని, మధ్యాహ్నం 2:30 గంటలకు తల్లాడ మండలం మిట్టపల్లి, మధ్యాహ్నం 3 గంటలకు నూతనకల్ గ్రామాల్లో మృతుల కుటుంబాలను పరామర్శిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఖమ్మం గట్టయ్య సెంటర్‌లో గల క్యాంపు కార్యాలయంలో ఎంపీ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల బాధ్యులు, కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యుద్ఘాతంతో కాలిపోయిన టిప్పర్ ఇంజన్

నవ తెలంగాణ-బోనకల్



ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతంతో టిప్పర్ ఇంజన్ పూర్తిగా కాలిపోయిన సంఘటన మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అమరావతి హైవే నిర్మాణ పనుల నిమిత్తం టిప్పర్ల ద్వారా సదరు కాంట్రాక్టర్ రోడ్డుకు మట్టి తోలకాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు లాగే శనివారం కూడా టిప్పర్ల ద్వారా రోడ్డుకి మట్టితోలుతున్నారు. ఈ క్రమంలో టిప్పర్ నుంచి మట్టిని కిందకు దింపేందుకు టిప్పర్ భాగాన్ని డ్రైవర్ పైకి లేపారు. టిప్పర్ పైన ఉన్న 11 కెవి విద్యుత్ వైరు ఒక్కసారిగా తగిలింది. దీంతో విద్యుత్తు వైరు తెగి ఇంజన్ భాగం పై పడింది. ఆ వెంటనే పెద్ద ఎత్తున మంటల వ్యాపించాయి. డ్రైవర్ అప్రమత్తమై కిందకు దూకి ప్రాణాలను కాపాడుకున్నాడు. కానీ టిప్పర్ ఇంజన్ మాత్రం పూర్తిగా కాలిపోయింది. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు అంటున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సీఎస్ఐ చర్చి ఫర్నీచర్ దగ్ధం

సుమారు రూ.6 లక్షల ఆస్తి నష్టం

నవతెలంగాణ-వైరా



మండలంలోని విప్పలమడక గ్రామంలో గల సిఎస్ఐలో ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు లేచి ఫర్నీచర్ దగ్ధం అయింది. చర్చి ఫాస్టర్ భిషక్, సెక్రటరీ తుమ్మల క్రీస్తు దాసు తెలిపిన వివరాల ప్రకారం డిసెంబర్ 3, 2012న నిర్మించిన చర్చి 12 సంవత్సరాల వేడుకలను ఘనంగా జరుపుకునే కార్యక్రమంలో భాగంగా చర్చి అలంకరించుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిందని చర్చిలో 4 లక్షల విలువైన ఫర్నీచర్ కాలిపోయిందని తెలిపారు. విద్యుత్, మిగిలిన వస్తువుల విలువ మరో రెండు లక్షలు మొత్తం రూ.6 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. అగ్ని ప్రమాద విషయం తెలుసుకున్న ఖమ్మం చర్చి గ్రూప్ చైర్మన్ రమేష్, వైరా సిఎస్ఐ చర్చి ఫాస్టర్, విప్పలమడక మాజీ సర్పంచ్‌లు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్ పాపయ్యలు చర్చికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా పారుపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఇటువంటి ప్రమాదాలు అక్కడక్కడ జరుగుతుంటాయని, అంతమాత్రం చేత పరిపరి విధాలా ఆలోచనలు చేయక వెంటనే చర్చి లోపలి భాగంలో రంగులు వేసుకుని, విద్యుత్ వైరింగ్‌ను మరోసారి చేయించుకుని, ఫర్నీచర్‌ను సమకూర్చుకుని డిసెంబర్ 3వ తేదీన 12వ చర్చి వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని కోరారు.



అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు మంజూరు చేయాలి

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-కల్లూరు

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు మంజూరు చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తాళ్లూరు, వెంకటాపురం రెండు గ్రామా శాఖల సమావేశం నర్వనేని పుల్లయ్య సిపిఎం కార్యాలయంలో రేసు నాగేశ్వరరావు, సాంబెత్తిని కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాదాల వెంకటేశ్వరరావు ధాన్యంను సకాలంలో కొనాలని, పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలు వెంటనే అమలు చేయాలని సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సమావేశంలో నాయకులు చింతలపూడి పురుషోత్తం, ముదిగొండ్ల అంజయ్య ,పారా ప్రకాశం నాయుడు, చంద్రావు, మోదుగు వెంకయ్య రాజులపాటి రాజా రాములు తదితరులు పాల్గొన్నారు.


19న నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణకు హాజరై అభిప్రాయాలు తెలపాలి

జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కె.సత్యనారాయణ

నవతెలంగాణ-ఖమ్మం

ఈనెల 19న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఖమ్మం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ కమిషన్ పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు, ఉమ్మడి ఖమ్మం (భద్రాద్రి కొత్తగూడెం) జిల్లాలకు చెందిన మైనారిటీ మత గురువులు, మేధావులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, ఎన్‌జిఓలు ఇతర సంస్థలు, ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలపాలని జిల్లా ఇంచార్జ్ మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కె.సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విలువైన సలహాలు, సూచనలు, వినతులను ఆరు సెట్లు ధ్రువీకరణ అఫిడవిట్ రూపంలో సమర్పించాలని పేర్కొన్నారు.

గుండెపోటుతో మల్టీ పర్పస్ వర్కర్ మృతి




నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని బీమవరం గ్రామ పంచాయతీ నందు మల్టి పర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న షేక్ సైదాసాహెబ్ (63) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురుఉన్నారు .సైదా సాహెబ్ మృతి పట్ల పలువురు అధికారులు, రాజకీయ నాయకులు, గ్రామస్తులు తమ ప్రగాఢ సంతా పాన్ని తెలిపారు.

24న యాదవ వన సమారాధనను జయప్రదం చేయండి

నవతెలంగాణ- ఖమ్మం



ఈనెల 24 ఆదివారం రోజున యాదవుల వన సమారాధన కార్యక్రమం ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఖమ్మం చెరుకూరి గార్డెన్స్‌లో జరుగుతుందని, ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రతి యాదవ కుటుంబం పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు మచ్చ శ్రీనివాస్ యాదవ్, గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ పిలుపు నిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని రామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా రాష్ట్ర నాయకులు యాదవ వనభోజనాల కరపత్రాలు ఆవిష్కరించారు.

ఖమ్మంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

దేశ విద్యారంగాన్ని కాపాడేందుకు సమరశీల పోరాటాలు

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు



నవతెలంగాణ- ఖమ్మం

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలు ఖమ్మంలో ఫిబ్రవరిలో నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని,, మహాసభల జయప్రదానికై సహకరించాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం ఖమ్మంలోని ఖమ్మం డిపిఆర్సీ భవన్లో జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ అధ్యక్షతన ఆహ్వాన సంఘం ఏర్పాటు సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లడుతూ 22 యేండ్ల తర్వాత ఖమ్మం జిల్లాలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ జిల్లా విద్యార్థి ఉద్యమాలను అక్కున చేర్చుకుందన్నారు. నేడు దేశంలో, రాష్ట్రంలో ఉన్న సమస్యలలో విద్య, ఉద్యోగం అనేది సవాళ్ళతో కూడుకొన్నది అన్నారు. రాష్ట్రంలో 1864 పాఠశాలలో ఒక్క టీచర్ లేదని మూతపడుతున్నాయని, లక్ష పైగా విద్యార్థులు చదువులకు దూరం అయ్యారని తెలిపారు. అందుకే రాష్ట్రంలో యూనివర్శిటీ విద్య నుండి పాఠశాల విద్య వరకు సమస్యలపై ఈ మహాసభ చర్చిస్తుందని తెలిపారు. ప్రముఖ విద్యావేత్తలు ఐ.వి.రమణారావు, రవిమారుత్, కాంతారావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా అనేక ప్రజాఉద్యమాల నెలవు అని, 2002లో కూడా ఎస్ఎఫ్ఐ తన 14వ రాష్ట్ర మహాసభలు ఇక్కడ నిర్వహించుకున్నదని గుర్తు చేశారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం అలాగే దేశంలో ఫాసిస్టు శక్తులను, వారి ఆగడాలను అరికట్టేందుకు సెంట్రల్ యూనివర్శిటీలలో సైతం ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని తెలిపారు. ఈ మహాసభలు విజయవంతానికి తాము కూడా సహకరిస్తామని తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నదని, విద్యారంగం కార్పోరేట్ వర్గాల చేతిలోకి వెళ్ళిందని, మోదీ బడ్జెట్లో ప్రభుత్వ విద్యారంగాన్ని కుదేలు చేసేలా నిధులు కేటాయించలేదని, నూతన విద్యావిధానం పేరుతో మతోన్మాద భావాలను విద్యలోకి తీసుకుని వస్తున్నారని అన్నారు. విద్యార్థులు దీనికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు ఇచ్చారు. ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ దేశంలో యూనివర్శిటీల నుండి పాఠశాల వరకు మహిళలు, విద్యార్థినీలపై దాడులు జరుగుతున్నాయని, చదువులలో అసమానతలు కూడా ఉన్నాయని. తెలిపారు. ఈ అంశాలపై మహాసభ చర్చించాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి ఎం.సుబ్బారావు, యూటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.వి.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యా రంగంలో గత 55యేండ్లుగా ఛాంపియన్ లాగా పోరాడుతున్న సంఘం ఎస్ఎఫ్ఐ అని, అనేక పోరాటాలు నడిపి అనేక త్యాగాలు చేసిందని, అనేక మంది నిర్బంధాలు, జైలు జీవితాలు అనుభవించారని, ఈ మహాసభలు జయప్రదానికై తమ వంతు సహకరిస్తామని తెలిపారు. ప్రభుత్వ గెజిటెడ్ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కొప్పిశెట్టి సురేష్, విజయలక్ష్మి, ట్రస్మా నాయకులు నాయుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మంలో మహాసభలు జరగడం అభినందనీయమన్నారు. మహాసభల జయప్రదానికై ఏర్పడిన ఆహ్వాన సంఘాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ ప్రతిపాదించగా ఆమోదం తెలిపారు. అనంతరం ప్రవీణ్ కమిటీని ప్రకటించారు. ఈ ఆహ్వాన సంఘం సమావేశంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు భూక్యా వీరభద్రం, వై.విక్రమ్, మెరుగు సత్యనారాయణ, ఎర్ర శ్రీనివాసరావు, ఎం.ఎ.జబ్బార్, మడుపల్లి గోపాల్‌రావు, బండారు రమేష్, ప్రశాంతి, బత్తుల లెనిన్, కెవి.నవీన్, వెల్లంపల్లి శ్రీనివాస్, సాధిన్ని రజనీ, చింతల రమేష్, తాళ్ళపల్లి కృష్ణ, సిహెచ్ కుటుంబరావు, యూటిఎఫ్ జిల్లా నాయకులు రంజాన్, ఉద్దండు సాహెబ్, అద్దంకి విప్లవ్, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శి, మెరుగు రమణ, బండిపద్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బెజవాడ సాయికుమార్, ప్రేమ్ కుమార్, వెంకటలక్ష్మీ, రాజు, నితిన్, మనోజ్, వరుణ్, ఉమేష్, రాగిణీ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ అమలుపై ప్రభుత్వానికి నివేదిక

- తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు



నవతెలంగాణ- ఖమ్మం

స్థానిక సంస్థలలో రిజర్వేషన్ అమలు చేసేందుకు వివిధ సంఘాల నుండి వచ్చిన ప్రతిపాదనలను క్రోడీకరిస్తూ నివేదికను ప్రభుత్వానికి నిర్ణీత సమయంలో సమర్పిస్తామని తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల గుర్తింపును పేర్కొనే అంశంపై ఉమ్మడి జిల్లా పరిధిలో నిర్వహించిన బహిరంగ విచారణలో తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేషన్ కమిషన్ చైర్మన్ బూసాని వేంకటేశ్వరరావు, సెక్రటరీ బి.సైదులు, ఖమ్మం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. మొదట కలెక్టరేట్ ఆవరణలో రిజిస్ట్రేషన్ సెంటర్, నమోదు కేంద్రంను కమిషన్ చైర్మన్ పరిశీలించారు. అనంతరం వివిధ సంఘాలు, వ్యక్తుల నుండి విజ్ఞాపణలు స్వీకరించారు. స్థానిక సంస్థలలో రిజర్వేషన్ దామాషా అమలు, తమ వర్గాలకు ఉన్న వివిధ సమస్యలపై అభిప్రాయాలు తెలుపుతూ విజ్ఞాపణలు అందజేశారు.

ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బూసాని వేంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల ప్రజల రిజర్వేషన్ దామాషా ఖరారు చేసేందుకు ప్రభుత్వం డెడికేటెడ్ బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. రిజర్వేషన్ సంబంధిత అంశాలు మాత్రమే తెలియజేయాలని, మిగిలిన అంశాలు బీసీ కమిషన్ పర్యటనలో తెలపాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలో విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ క్రింద వృత్తుల జనాభా వివరాలు విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కింద నమోదు చేసి గుర్తించాలని కోరగా, ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని కమిషన్ చైర్మన్ తెలిపారు. కార్పొరేటివ్ సొసైటీ యాక్ట్ కింద నిర్వహించే ఎన్నికలు రాష్ట్ర ఎన్నికల సంఘం పరిధిలోకి రావని, ఆ అంశం తన పరిధిలో లేదని అన్నారు. స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ దామాషా అమలుపై వివిధ సంఘాల ప్రతినిధుల నుంచి సేకరించిన ప్రతిపాదనలు, అభిప్రాయాలను ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం నెలలో నివేదిక ఇవ్వనున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ ఉప సంచాలకులు వి.రమేష్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల బిసి సంక్షేమాధికారులు జి.జ్యోతి, ఇ.ఇందిర, బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, సహాయ బిసి సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా వ్యతిరేక విధానాలపై....

పోరాటాలు

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ - బోనకల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో పార్టీ మండల కమిటీ సమావేశం బంధం శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుటుంబ సమగ్ర సర్వే పేరుతో నిర్వహిస్తున్న సర్వే కొంత గందరగోళంగా ఉందన్నారు. ప్రజా పాలనను గాలికి వదిలేసి కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతో పరిపాలన చేస్తుందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే కెసిఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. గ్రామ, మండల స్థాయిలో సిపిఎం మహాసభలు పూర్తయ్యాయని, జిల్లా మహాసభల త్వరలోనే సత్తుపల్లిలో జరగనున్నట్లు తెలిపారు. జిల్లా మహాసభల అనంతరం సిపిఎం ప్రజా పోరాటాలపై మరింత దృష్టి పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహాసభలలో సమస్యలను గుర్తించి ఆ సమస్యల పరిష్కారం కోసం ప్రజలను సమీకరించి ప్రజా పోరాటాల నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్, బిజెపి, బీఆర్ఎస్ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు తప్ప ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రాధాన్యత ఇవ్వటం లేదని విమర్శించారు. జిల్లాను సస్యశ్యామలం చేసే ప్రాజెక్టుల గురించి జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్న ఉపయోగం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గళం ఇవ్వాలని అప్పుడే పాలకులు తల ఒగ్గుతారన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు దొండపాడు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారి సురేష్, నాయకులు జొన్నలగడ్డ సునీత, గుడ్డురి ఉమ, కేతినేని నాగేశ్వరరావు, మర్రి తిరుపతిరావు, కోట నాగరాజు, పసుపులేటి నరేష్, తుళ్లూరు రమేష్, కందికొండ శ్రీనివాసరావు, దొప్ప కొరివి వీరభద్రం, తెల్లాకుల శ్రీనివాసరావు, గుడిపూడి వెంకటేశ్వర్లు, కొమ్మినేని నాగేశ్వరరావు, చట్టు వీరబాబు, గుగులోతు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బోడేపూడి వైద్య శిబిరం విజయవంతం

- శీతాకాలం సీజన్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

డాక్టర్ చీకటి భారవి, బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా సిపిఐ(ఎం) కార్యాలయం బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో ప్రతి నెల మూడోవ ఆదివారం జరిగే బోడేపూడి వైద్య శిబిరం 113 నెల క్రమం తప్పకుండా విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు చీకటి భారవి, బోడేపూడి కళానిలయం కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ శీతాకాలంలో షుగర్ పేషంట్స్, గుండె జబ్బు, అస్తమా బాధితులు సీజన్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు ఉదయం పొగమంచు సమయంలో బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తరచూ శుభ్రమైన మంచి నీళ్ళు వేడి చేసుకొని తాగడం, వేడి ఆహారపదార్థాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, చింతనిప్పు చలపతిరావు, బొంతు సమత, గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహన్‌రావు, మాదినేని రజినీ, పాసంగులపాటి చలపతిరావు, కంభంపాటి సత్యనారాయణ, యనమద్ది రామకృష్ణ, మందడపు నాగేశ్వరరావు, పూనాటి సూరయ్య, మల్లెంపాటి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రీటర్మ్ బేబీస్‌పై అవగాహన కల్పించడం మనందరి బాధ్యత

- అంకుర ఆసుపత్రి ఎమ్‌డి డాక్టర్ కృష్ణ ప్రసాద్
- నవజాత శిశువులను కాపాడేందుకే 5కే రన్
- ఐఏపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ప్రదీప్ కుమార్



నవతెలంగాణ- ఖమ్మం

నెలలు నిండక ముందే జన్మించిన నవజాత శిశువులను కాపాడుకునేందుకు ప్రీటర్మ్ బేబీస్ ఎదుర్కొనే సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించడం మనందరి సామాజిక బాధ్యతగా గుర్తించాలని అంకుర ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఉన్నం కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రీ టర్మ్ బేబీస్ పై అవగాహన కల్పిస్తూ... ఆదివారం ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్ బండ్ దగ్గర నుంచి అంకుర హాస్పిటల్ వరకు 5 కే వాక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అమ్మ గర్భంలో నలుసుగా మొదలై ఆపై అపురూప శిల్పంలా పండండి బిడ్డగా ఎదగడానికి మనకు నవ మాసాల గడువు ఉంటుందనీ, ఈ గడువు కంటే ముందుగానే పసిబిడ్డ భూమ్మీదికి వస్తే పలు రకాల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందనీ, నెలలు నిండకుండానే పుట్టినప్పుడు ఆ నవజాత శిశువులో అనేక సమస్యలు కనిపించే అవకాశం ఉందని అన్నారు. ఒకప్పుడు నెలలు నిండని పిల్లలకు చికిత్స అంతంత మాత్రమే ఉండేవి. కానీ ఇప్పుడు ఆధునిక వైద్యంతో అన్ని రకాల రక్షణ ఏర్పాట్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్ (ఐఏపీ) ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఖమ్మంలోని కూరపాటి చిల్డ్రన్స్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ విలక్షణమైన మన ప్రకృతిలో ప్రతీ అంశానికి కాల వ్యవధి ఉంటున్నట్టే అమ్మ గర్భంలో బిడ్డగా ఎదిగి పరిపూర్ణమైన శిశువుగా రూపుదిద్దుకుని ఆపై మన లోకంలోకి రావడానికి నవ మాసాల సమయం పడుతుందని అన్నారు. అలా కాకుండా 9 నెలలకు ముందే ఆ పసిబిడ్డ ఈ లోకంలోకి వస్తే వచ్చే సమస్యలు అనేకం ఉన్నాయని అన్నారు. అందుకే ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గాను ప్రతి సంవత్సరం నవంబర్ 17న ప్రపంచ ప్రీమెచ్యూరిటీ డే జరుపుకుంటారని తెలిపారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ముందస్తు జననం, నెలలు నిండని శిశువులు, వారి కుటుంబాల ఆందోళనల గురించి అవగాహన కల్పించడానికి జరుపుకుంటారని తెలిపారు.

అంకుర హాస్పిటల్స్ బంజారా హిల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా ప్రసాద్ మాట్లాడతూ ప్రతి సంవత్సరం సుమారుగా 15 మిలియన్ల మంది పిల్లలు ముందస్తుగా పుడుతున్నారని లెక్కలు చెపుతున్నాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా జన్మించిన మొత్తం 10 మంది శిశువులలో ఒకరు ప్రీటర్మ్ బేబీ ఉన్నారని తెలిపారు. ప్రముఖ పీడియాట్రిక్ వైద్య నిపుణులు డాక్టర్ యలమంచిలి నాగమణి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల మరణాలకు అకాల పుట్టుక ప్రధాన కారణం నెలలు నిండని జననమే కారణమని తెలిపారు. 2008లో యూరోపియన్ మాతృ సంస్థలచే నవంబర్ 17న ముందస్తు జననం కోసం మొదటి అంతర్జాతీయ అవగాహన దినం రూపొందించబడిందని గుర్తు చేశారు.

కార్యక్రమంలో ఐఏపీ జిల్లా కార్యదర్శి డాక్టర్ భరత్ కుమార్, ఐఏపీ ట్రెజరర్ డాక్టర్ సాయి భార్గవ్, సీనియర్ పీడియాట్రిక్ వైద్య నిపుణులు మోపర్తి సురేష్ బాబు, న్యూయోనటాలజిస్ట్ డాక్టర్ శ్వేత, అనస్థీషియా డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ బాబురావు, డాక్టర్ జాకీర్, డాక్టర్ హుమా, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సింధు, డాక్టర్ కల్పన, డాక్టర్ సాయి ప్రసన్న, డాక్టర్ అపర్ణ, గైనకాలజిస్ట్ డాక్టర్ .జ్యోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

నవతెలంగాణ-తల్లాడ



ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆరోపించారు. సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుపై అవగాహన లోపించింది అన్నారు. రైతులు దళారులను ఆశ్రయించాల్సిన అవసరం ఏర్పడిందని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మిల్లుల యజమానులతో చర్చలు జరపకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం అయిందన్నారు. ఇప్పటికైనా కొనుగోలు వేగవంతం చేయాలని, రైతులకు 500 రూపాయల బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సొసైటీ చైర్మెన్ వీర మోహన్ రెడ్డి, వెంకట్ లాల్, బద్ధం కోటిరెడ్డి ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాసం వన సమారాధన

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా మండలం సోమవ్వా ఉన్నది లోపలరం గ్రామ సమీపంలోని మామిడి తోటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక మాసం వన సమారాధన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడి తోటలోని ఉసిరి చెట్టు వద్ద శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం వాసవి మాతకు మహిళలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు, జిల్లా అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వనమా విశ్వేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ కార్తీక మాసంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కుటుంబ సమేతంగా వన సమారాధన పూజ కార్యక్రమాలు నిర్వహించుకోవడం మంచి శుభ పరిణామం అన్నారు. ఆర్యవైశ్యులు సేవా రంగం, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందాలని, ఆర్యవైశ్య సంఘం పటిష్టతకు కృషి చేయాలని కోరారు. అనంతరం సకుటుంబ సమేతంగా వన భోజనం, ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు, మండల అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్ కుమార్, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, నూకల వాసు, మిట్టపల్లి నాగేశ్వరరావు (నాగి), మిట్టపల్లి సత్యంబాబు, మిట్టపల్లి రమణ, నూకల ప్రసాద్, మిట్టపల్లి శ్రీనివాసరావు, గజ్జల కృష్ణమూర్తి, వజినేపల్లి చక్రవర్తి, కొల్లా రాంబాబు, సముద్రాల మురళీకృష్ణ, కటకం శివకృష్ణ, మిట్టపల్లి విజయ్ కుమార్, జల్లా అవినాష్, చల్లా వెంకటరమణ, కొణతాలపల్లి నగేష్, ధారా వెంకటకృష్ణారావు, బోనాల సాయినిఖిల్, డోకుపర్తి మోహన్ కృష్ణ, మిట్టపల్లి గురు వెంకట సాయి, వెంద్రపూడి శంకర్, నూకల అన్నపూర్ణ, కోడుమూరు భాగ్యలక్ష్మి, కొప్పురావూరి శబరీనాథ్, కొప్పురావూరి ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ పోరాట చరిత్ర తిరుగులేనిది

- జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

నవతెలంగాణ-పెనుబల్లి

భారత కమ్యూనిస్టు పార్టీ పోరాట చరిత్ర తిరుగులేనిదని జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని లింగగూడెం, గట్టుగూడెం గ్రామాల్లో సిపిఐ శతజయంతి సందర్భంగా పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో పురాతన పార్టీ సిపిఐ అని డిసెంబర్ 25 నాటికి 100వ సంవత్సరంలో అడుగుపెట్టనుందని తెలిపారు. ఇంత చరిత్ర కలిగిన పార్టీ దేశంలో మరొకటి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగు నరసింహారావు, మండల కార్యదర్శి కొమ్మినేని సుధాకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఇటికాల రామకృష్ణ, పెనుబల్లి సొసైటీ డైరెక్టర్ పద్దం జోగయ్య, పద్దం పుల్లయ్య, వట్టం శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం పథకాలు పెరిక కులస్తులకు అందించాలి

- జిల్లా అధ్యక్షులు గజవెల్లి సత్యనారాయణ

నవతెలంగాణ-చింతకాని



ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు అన్ని కూడా పెరిక కులస్తుల వారికి అందేలా చూడాలని పెరిక కులం జిల్లా అధ్యక్షులు గజవెల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలో పందిళ్ళపల్లి గ్రామంలో కార్తీక మాసం సందర్భంగా పెరిక వారి వన సమారాధన కార్యక్రమం మామిడి తోటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిక కులం బీసీ కులాలలో 037 క్యాటగిరీలో ఉందని, ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి పథకాన్ని మనకు వర్తించాలి అంటే మనమందరం ఐకమత్యంగా పోరాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల లింగేశ్వరరావు, కోశాధికారి పత్తిపాటి వెంకటేశ్వర్లు, ఖమ్మం నగర అధ్యక్షులు గజ్జల వెంకన్న, మండే వీర హనుమంతరావు, బెడద సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం పందిళ్ళపల్లి గ్రామ పెరిక కులస్తుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మండే వెంకటేశ్వర్లు, మండే రామకోటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారితోపాటు 21 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పెరిక కులస్తులందరూ పాల్గొన్నారు.

విధివంచిత కుటుంబానికి ఎన్ఆర్ఐ చేయూత

నవతెలంగాణ-కొణిజర్ల



విధివంచిత కుటుంబానికి ఎన్ఆర్ఐ చేయూతనందించారు. మండల పరిధిలోని పెద్దమునగాల గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, స్వాతి దంపతులకు మనీష్, మనోజ్‌లు ఇద్దరు కుమారులున్నారు. ఆ ఇద్దరికి మెదడు సంబంధిత వ్యాధి సోకడంతో నడవలేరు, మాట్లాడలేరు. కుమారుల పరిస్థితి చూసి తట్టుకోలేక నాగేశ్వరరావుకి గుండెపోటు రావడంతో ఇటివలే బైపాస్ సర్జరీ చేశారు. దీంతో ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత దారుణంగా మారి కుటుంబం గడవడం కష్టంగా మారింది. ప్రతి నెల మందులకు ఐదు వేలు ఖర్చుఅవుతుండటంతో ఏమి చేయాలో పాలుపోక దిగాలుగా సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఖమ్మం పట్టణానికి చెందిన ఎన్ఆర్ఐ మామునూరి సందీప్ అమెరికాలో స్థిరపడ్డారు. ఇటీవలే తన తండ్రి రిటైర్డ్ ప్రిన్సిపాల్ మామునూరి కొమరెల్లి చనిపోవడంతో సందీప్ ఖమ్మం వచ్చాడు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల పరిస్థితి తెలుసుకొని చలించిపోయారు. తన తండ్రి కొమరెల్లి జ్ఞాపకర్థంగా ఆదివారం పెద్దమునగాల గ్రామానికి వచ్చి నాగేశ్వరరావుకి మందుల ఖర్చుల నిమిత్తం 25 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు దంపతులు సందీప్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

ఉషాకిరణ్ విజయలక్ష్మి దంపతుల కుమార్తె రిసెప్షన్ వేడుక

నవతెలంగాణ-కొణిజర్ల



అత్యంత వైభవోపేతంగా శ్రీకవిత విద్యాసంస్థల అధినేత పారుపల్లి ఉషాకిరణ్ విజయలక్ష్మి దంపతుల కుమార్తె శ్రీకవిత మోనిష్‌ల వివాహ రిసెప్షన్ వేడుక మండల పరిధిలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈనెల 13 వీరి ఇరువురి వివాహం హైదరాబాద్ లో అంగరంగవైభవంగా కుటుంబ సభ్యులు బంధువులు మధ్య జరిగింది. ఈ రిసెప్షన్ కు జిల్లాలో ప్రజాప్రతినిధులు వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు వ్యాపారవేత్తలు వైద్యులు మేధావులు ఉద్యోగులు హజరై నూతన వధువరూలను ఆశీర్వదించారు.కన్నుల పండుగ ఏర్పాటు చేసిన ఈ రిసెప్షన్ లో ఏర్పాటు చేసిన లైవ్ మ్యూజిక్ యువతుల డ్యాన్స్ షో అందరిని ఆకట్టుకుంది. హైదరాబాద్ లో జరిగిన శ్రీకవిత మోనీష్ వివాహ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి హజరైయ్యారు.

కమ్మ సామాజిక వర్గం అన్ని వర్గాలతో గౌరవంగా మెలగాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-పెనుబల్లి



కమ్మ సామాజిక వర్గం వారు అన్ని సామాజిక వర్గాలతో గౌరవప్రదంగా కలిసిమెలిసి జీవించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. ఆదివారం పెనుబల్లి మండలంలో కమ్మ సామాజిక వర్గం ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ జిల్లాలో సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని, నా రాజకీయ జీవిత చరిత్ర ప్రస్థానం సత్తుపల్లి నుండి ప్రారంభమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రిని కమ్మ సామాజిక వర్గ సంఘం నాయకులు శాలువా కప్పి మెమొంటోని అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చింతనిప్పు సత్యనారాయణ, నున్న రామకృష్ణ, చీకటి రామారావు, తాళ్లూరి రవి, తాళ్లూరి శేఖర్‌రావు, చింతనిపు శ్రీనివాసరావు, సూర్య దేవర రవికుమార్, బెల్లంకొండ చలపతి పాల్గొన్నారు.

నిషేధాలపై చూపే శ్రద్ధ ఆలయాభివృద్ధిపై చూపండి

- సౌకర్యాలు కల్పించటంలో విఫలం
- ఆలయ భూముల వివరాలు
- తెలపాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-కారేపల్లి



ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ ఆలయంలో హలాల్ నిషేధం అంటూ ఆలయం వద్ద దేవదాయశాఖ బోర్డులు పెట్టటం కాదని ఆలయ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సీపీఐ(ఎం) జిల్లాకమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం కారేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ కోటమైసమ్మ ఆలయంకు అన్ని మతాల వారువచ్చి మొక్కులు తీర్చుకుంటారన్నారు. అమ్మవారికి నైవేద్యంగా కేవలం పాలపొంగలి, పులిహోర, దద్దోజనం, పండ్లు, కొబ్బరికాయలు సమర్పిస్తారన్నారు. మానవులు తమ సంతృప్తి కొరకు జంతు బలి చేస్తుంటారని దానికి రకరకాల పద్దతులు అచారిస్తారన్నారు. కొందరు హలాల్, ముర్దాల్ పద్దతి వాడతారన్నారు. భక్తుల పూజా విధానంలో ఎవరి జోక్యం వద్దన్నారు. ఆలయం వద్ద జంతు బలులు నిషేధం అని చెప్పాల్సిన దేవదాయశాఖ ఒక వర్గానికి చెందిన నియమంపై నిషేధం అంటూ బోర్డులు పెట్టటం ఎవరి మెప్పుకోసమని ప్రశ్నించారు. ఆలయ అభివృద్ధిపై అధికారులు దృష్టి పెట్టాలని, వసతులు లేక భక్తులు అవస్థలు పడుతున్నారని వాటిపై దృష్టి సారించాలి తప్ప లేనిపోని వివాదాలు సృష్టించవద్దని సూచించారు.



ఆలయ భూములపై ఈ ప్రాంత వాసులు అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఆలయ భూమి ఎంత, ఆలయానికి వస్తున్న ఆదాయం ఎంత, ఆలయ నిర్వాహణ చేయాల్సింది ఎవరు, చేస్తుంది ఎవరు అనేది దేవదాయశాఖ అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కోటమైసమ్మ జాతర సందర్భంగా రూ.లక్షలు ఆదాయం వస్తున్నా దానికి అనుగుణంగా మరుగుదొడ్లు, నీరు, నీడ సౌకర్యాలు లేక భక్తులు అవస్థలు అధికారులకు కనపడుతున్నా పట్టింపు లేకుండా పోయిందన్నారు. కోటమైసమ్మ తల్లి ఆలయ భూములు, ఆదాయం, అభివృద్ధి పై దేవదాయశాఖ ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు చేయాల్సి పనులు చేయకుండా ప్రజలను గందరగోళం, ఉద్రిక్తలు పెంచే పనులు చేస్తే సహించేది లేదన్నారు.

భావగీతాలతో మహాసభలను అలరించేందుకు...
సిద్ధమవుతున్న ప్రజా నాట్యమండలి కళాకారుల బృందం

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లిలో డిసెంబరు 18, 19 తేదీల్లో జరుగనున్న ఖమ్మం జిల్లా సీపీఐ(ఎం) 22వ జిల్లా మహాసభలను భావగీతాలతో సభికులను అలరించేందుకు ప్రజా నాట్యమండలి కళాకారుల బృందం సమాయత్తమవుతోంది. మహాసభలను విజయవంతం చేసే కార్యక్రమంలో భాగంగా ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి వేముల సదానందం నేతృత్వంలో ఆయా గీతాలాపనలపై స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో సత్తుపల్లి ప్రాంతీయ ప్రజా నాట్యమండలి కళాకారుల బృంద సభ్యులు పాల్గొన్నారు. కార్మిక, కర్షక, సంఘటిత, అసంఘటితరంగ కార్మికుల వెతలు, ఆయా వర్గాలపై పాలకులు అనుసరిస్తున్న నిరంకుశత్వ పోకడలు, వారి హక్కులను హరిస్తున్న ప్రభుత్వాల వైఖరిని ఎప్పటికప్పుడు ఎండగడుతూ ఉద్యమిస్తూ బాసటగా నిలిచే ఎర్రజెండాల కదలికలపై వామపక్ష భావజాలంతో అభ్యుదయ రచయితలు తమ కలాలకు పదునుపెట్టి రచించిన భావగీతాలను సభల్లో పాడుతూ రంజింపజేయడానికి కళాకారులు సిద్ధమవుతున్నారు. మహాసభల ప్రారంభం లోపు పలు దఫాలుగా కళాకారులకు గీతాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు సదానందం తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి కళాకారుల బృంద సభ్యులు ఐనంపూడి సదానందనరావు, కండే సత్యం, మిట్టపల్లి నాగమణి, పార్వతి, మర్రి రజిని, నాట్యమండలి సీనియర్ కళాకారులు రావుల



రాజబాబు, సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, ఐద్వా జిల్లా నాయకురాలు పాకలపాటి ఝాన్సీ, చావ రమేశ్, తేళ్లూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

అందిన కాడికి దోచుకుంటున్న దళారీలు

నవతెలంగాణ-పెనుబల్లి

తరచూ తుఫానుల కారణంగా ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల కు ధాన్యం అమ్మేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. 40% తేమ ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఆంక్షలు ఉండటంతో నూర్పిడి చేసిన వరి ధాన్యాన్ని ఆరబెట్టడం తూరుపాల పోయడం వాతావరణం అనుకూలించకపోవడంతో రైతులు తమ పొలాల్లో నూర్పిడి చేసినపచ్చిధాన్యాన్ని మధ్య దళారీలకు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడింది. సన్న రకాలు. 1600లకు ముదుగు రకాల ధాన్యం 1400కు పొలాల నుండి నూర్పిడి చేసిన ధాన్యాన్ని కాట వేస్తున్నారు. రైస్ మిల్లుల లో బాయిల్డ్ రైస్ తయారు చేసే సౌకర్యం ఉండటంతో ధాన్యాన్ని ఆరబెట్టి అవసరం లేకుండా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించి దళారీలు అందిన కాడికి దోచుకుంటున్నాడు. మండలంలో అన్ని గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువ ఉంచేందుకు తగిన సౌకర్యాలు లేకపోవడం వర్షం వస్తే తమ ధాన్యం పరిస్థితి అంచనా వేసుకుంటూ విధిలేక దళారీలకు ధాన్యాన్ని అప్పగిస్తున్నారు.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM, KHAMMAM DISTRICT
ARB.NO. 444 OF 2024
Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED.,
KOTHAGUDEM- Branch
Represented by its Foreman,
...Disputant
Versus
Kadali Nagaraju & Others
...Opponent
1. Mr. Kadali Nagaraju, S/o. Venkata Ramana, Aged About: 46years, Occ:Private Employee, R/o. H.No: 19-1-107, Lambody Colony, Bhadrachalam, Dist: Bhadradri Kothagudem.
2. Mr. Mypa Venkateswarlu, S/o. Ramulu, Aged About 53 Years, Occ: Jr. Asst, O/o. Govt High School Bhadrachalam, R/o. H.No: 10-26, Lingapuram, Khammam.
Whereas the disputant file the above Arbitration/Dispute for the recovery of the money of **Rs.59,202/-** againist you and others and where as the above Arbitration/Dispute is posted for your appearance.
Take Notice that in default of your appearance in person before The Registrar of Chits/Arbitrator, Khammam on the above said date on **10-12-2024** at 11.00 A.M. The matter will be determined setting you expartee.
CHIT ARBITRATOR
DEPUTY REGISTRAR OF CHITS, KHAMMAM.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM, KHAMMAM DISTRICT
ARB.NO. 445 OF 2024
Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED.,
KOTHAGUDEM- Branch
Represented by its Foreman,
... Disputant
Versus
Dandugula Raju & Others
... Opponent
3. Mr.Bathula Vijay kummar, S/o. Kondala Rao, Aged About 52 Years, Occ: Business, R/O.H.No.1-68, Chinnavallaballi, Dummugudem, Bhadrachalam, Dist: Bhadradri Kothagudem.
Whereas the disputant file the above Arbitration/Dispute for the recovery of the money of **Rs.57,278/-** againist you and others and where as the above Arbitration/Dispute is posted for your appearance.
Take Notice that in default of your appearance in person before The Registrar of Chits/Arbitrator, Khammam on the above said date on **10-12-2024** at 11.00 A.M. The matter will be determined setting you expartee.
CHIT ARBITRATOR
DEPUTY REGISTRAR OF CHITS, KHAMMAM.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM, KHAMMAM DISTRICT
ARB.NO. 448 OF 2024
Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED.,
KOTHAGUDEM- Branch
Represented by its Foreman,
... Disputant
Versus
Bhukya Dhange & Others
... Opponent
2. Mr. Bhattu Munya, S/O. Lingya, Age: 41 Years, Occ: S.G.T, O/O. M.P.P.S Kotha Suraram Paloncha Khammam, R/O.H.No:1-57, Bhattu Thanda, Seetharam puram, Kothagudem.
Whereas the disputant file the above Arbitration/Dispute for the recovery of the money of **Rs.75,046/-** againist you and others and where as the above Arbitration/Dispute is posted for your appearance.
Take Notice that in default of your appearance in person before The Registrar of Chits/Arbitrator, Khammam on the above said date on **10-12-2024** at 11.00 A.M. The matter will be determined setting you expartee.
CHIT ARBITRATOR
DEPUTY REGISTRAR OF CHITS, KHAMMAM.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM, KHAMMAM DISTRICT
ARB.NO. 449 OF 2024
Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED.,
KOTHAGUDEM- Branch
Represented by its Foreman,
...Disputant
Versus
Kapula Srinu & Others
... Opponent
2. Mr.Basiboina Prabhu Raj, S/o. Veerabhadram Swamy, Aged About 43 Years, Occ: Ward Attender At Medical, O/o.Dummugudem, R/o. H.No:73-4-71, Ashok Nagar Colony, Bhadrachalam, Bhadradri Kothagudem.
3. Mr. Vadde Krishna, S/o. Rama Krishnaiah, Aged About 59 Years, Occ:Daily Labour, R/o.H.No:13-4-100/A, A M C Colony, Bhadrachalam, Bhadradri Kothagudem.
Whereas the disputant file the above Arbitration/Dispute for the recovery of the money of **Rs.61,721/-** againist you and others and where as the above Arbitration/Dispute is posted for your appearance.
Take Notice that in default of your appearance in person before The Registrar of Chits/Arbitrator, Khammam on the above said date on **10-12-2024** at 11.00 A.M. The matter will be determined setting you expartee.
CHIT ARBITRATOR
DEPUTY REGISTRAR OF CHITS, KHAMMAM.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని ఎర్ర బోయినపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులుకు సిఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణలక్ష్మి షాదిముబారక్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఏఎంసీ డైరెక్టర్ దొడ్డపునేని శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ బండి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు పొట్రు సత్యం, పోట్రు అర్జున్‌రావు, కాంగ్రెస్ యువజన నాయకులు నల్లగట్ల పుల్లయ్య చేతుల మీదగా ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కిలారి రామారావు, తాళ్ళ రాములు, కోపిల ఏసు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM, KHAMMAM DISTRICT
ARB.NO. 450 OF 2024
Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED.,
KOTHAGUDEM- Branch
Represented by its Foreman,
... Disputant
Versus
Bade Sai Venkata Gurunadha Rao & Others
...Opponent
1. Mr.Bade Sai Venkata Gurunadha Rao, S/o.Venkata Rama Rao, Aged About: 27 years, Occ: Private Employee, R/o.H.No: 1-43, Pothunuru, Chintalapudi, West Godavari, Andhra pradesh.
2. Mr.Kaleti Maheswar Rao, S/o. Sammaiah, Aged About 50 Years, Occ:Home Gaurd Police, O/o Bhadrachalam, R/o.H.No: 19-2-104, Jagadeesh Colony, Bhadrachalam, Bhadradri Kothagudem.
3.Mr.Gorsa Srinivas, S/o. Rambabu, Aged About 35 Years, Occ:Private Employee, R/O. H.No:18-1-121, Ashok Nagar Colony, Bhadrachalam, Bhadradri Kothagudem.
5. Mr. Bade Venkatarama rao, S/o. Gurumurthy, Aged About 48 Years, Occ: Agriculture,R/o.H.No.1-43, Pothunuru, Chinthalapudi, West godavari, Andhra Pradesh.
Whereas the disputant file the above Arbitration/Dispute for the recovery of the money of **Rs.79,970/-** againist you and others and where as the above Arbitration/Dispute is posted for your appearance.
Take Notice that in default of your appearance in person before The Registrar of Chits/Arbitrator, Khammam on the above said date on **10-12-2024** at 11.00 A.M. The matter will be determined setting you expartee.
CHIT ARBITRATOR
DEPUTY REGISTRAR OF CHITS, KHAMMAM.

డిసెంబర్ 1న గిరిజన జాతీయ సదస్సు

- భూక్యా వీరభద్రం

నవతెలంగాణ-వైరాటౌన్



దేశంలో రోజురోజుకీ పెరిగిపోతున్నా నిరుద్యోగ సమస్య, గిరిజన ఉద్యోగులు ఏదురుక్కుంటున్నా సమస్యలపై ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఏఏఆర్‌యం) ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సదస్సు డిసెంబర్ 1న జరుగుతుందని, గిరిజన సంఘం జాతీయ కమిటీ సభ్యులు తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత కోట్ల సంఖ్యలో నిరుద్యోగం పెరిగిందని, గిరిజన ఉద్యోగుల సమస్యల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. దేశంలో గిరిజన ఉద్యోగస్తులకు ప్రమోషన్లు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం వివక్షతకు గురి చేస్తుందని విమర్శించారు. ఢిల్లీలో జరుగు జాతీయ సదస్సుకు జిల్లా, రాష్ట్రానికి చెందిన నిరుద్యోగులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భూక్యా వీరభద్రం కోరారు.

బడి తండా గిరిజనుల వన సమారాధన

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోనే రావినూతల గ్రామంలోని బడి తండా గిరిజన ప్రజలు ఆదివారం వత్సవాయి రోడ్డులోనే కాలవ సమీపంలో గల మామిడి తోటలో వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు గిరిజన సాంప్రదాయ పద్ధతులు నృత్యం చేసి అలరించారు. ఈ సందర్భంగా గిరిజనులు ఆనందోత్సవాలతో వన సమారాధన నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుగులోత్ పంతు నాయక్, బడి తండావాసులు భానోత్ సాదు నాయక్, మాన్య నాయక్, శ్రీరాములు నాయక్, కృష్ణ, గూగులోతు సైదులు, భానోత్ శ్రీను, కిరణ్, భానోత్ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలానాకు 'ఉపాధ్యాయ స్ఫూర్తి పురస్కార్'

నవతెలంగాణ-కల్లూరు



నిరంతరం పేద విద్యార్థుల విద్యను ప్రోత్సహిస్తూ వారికి సేవలు అందిస్తున్న ఉపాధ్యాయుడు మౌలానాకు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం, అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవల, సందర్భంగా హైదరాబాదులో ఉపాధ్యాయ స్ఫూర్తి పురస్కార్ అవార్డును ఆదివారం ప్రదానం చేశారు. మండల పరిధిలోని పేరవంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఎండి.మౌలానా సమాజంలోని పేద విద్యార్థులందరూ విద్యను అందించడమే లక్ష్యంగా పెట్టుకొని హాస్టల్ విద్యార్థులకు, ప్రభుత్వపాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు, సాంఘిక దురాచారాలు, బాల్యవివాహాలు వల్ల కలిగే నష్టాలు గురించి అవగాహన కల్పించారు. ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ప్రేరణ అవగాహన తరగతులు నిర్వహిస్తున్నందుకుగాను స్ఫూర్తి పురస్కారాన్ని శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ యు.ఉమేష్‌కుమార్, శారద ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మెన్ డాక్టర్ స్వప్న, కమల మనోహర్, స్కిల్ డెవలప్మెంట్ సీఈవో మనీష్, జిందాల్ లాంటి ప్రముఖులు చేతుల మీదగా అవార్డు అనుకున్నారు. అవార్డు అందుకున్న సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మౌలానాకు అభినందనలు తెలిపారు.

రిక్రియేషన్ క్లబ్ సేవలను సద్వినియోగించుకోండి

నవతెలంగాణ-మధిర



పట్టణ కేంద్రంలో నగరం నడిబొడ్డున సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కేవలం 15 వేల రూపాయలకే శుభకార్యాలకు కళ్యాణ మండపం అందించేందుకు మధిర రిక్రియేషన్ క్లబ్ కళ్యాణ మండపం అందుబాటులోకి వచ్చిందని ఈ సదా అవకాశాన్ని ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రిక్రియేషన్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి వెంకటేశ్వరరావు, కట్టా గాంధీ పేర్కొన్నారు. ఆదివారం డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత జయాకర్, సీనియర్ నాయకులు పుతుంభకా శ్రీకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో రిక్రియేషన్ క్లబ్ కళ్యాణ మండపం ప్రారంభించబడింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దొండపాటి వెంకటేశ్వరరావు నాయకత్వంలో మధిర రిక్రియేషన్ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు.
ఈ సమావేశంలో సీనియర్ నాయకులు మొండితోక జయాకర్, కళ్యాణం పుల్లారావు, కరివేద సుధాకర్, ములకలపల్లి మోహన్‌రావు, గడ్డం రమేష్, కొంకా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రహదారి నిర్మాణం చేయాలి

నవతెలంగాణ-ముదిగొండ



మండల కేంద్రమైన ముదిగొండ నుండి న్యూలక్ష్మీపురం, సువర్ణాపురం వరకు బిటి రహదారిని నిర్మాణం చేయాలని కోరుతూ ఆదివారం ముదిగొండ వాసులు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. గత ఆరు నెలల క్రితం ముదిగొండ, న్యూలక్ష్మీపురం ప్రధాన మార్గంలో దెబ్బతిన్న రోడ్డుని పునర్నిర్మాణంలో భాగంగా మరమ్మతులు చేసి కాంట్రాక్టర్ కంకర పోసి వదిలేయడం, వాటర్ క్యూరింగ్ కూడా చేయకపోవడంతో అసంపూర్తిగా ఉన్న రహదారిపై వాహనాలు రాకపోకలకు కంకర దుబ్బ, దుమ్ము విపరీతంగా లేచి ఇండ్లలోకి రావటంతో ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దుమ్ము లేచి, గాల్లో కలిసి, కాలుష్యమై ద్విచక్ర వాహనదారులు, వ్యవసాయ పనులకు రోడ్డుపై వెళ్లే రైతులు, ప్రజల కండ్లల్లో, నోట్లో పడి అనారోగ్యానికి గురవుతున్నామని అగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు రోడ్డు గురించి పట్టించుకోవటం లేదని వారు వాపోయారు. అసంపూర్తిగా నిర్మాణం చేసిన రోడ్డును కాంట్రాక్టర్ వెంటనే పూర్తిచేయాలని ఈనెల 8న "అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం, తారు రోడ్డు నిర్మాణం ఎప్పుడు"...! అనే ఆర్టికల్‌ను, నవతెలంగాణ దినపత్రికలో ప్రచురించిన విషయము విధితమే. అసంపూర్తిగా నిర్మాణం చేసి వదిలేసిన రోడ్డును కాంట్రాక్టర్ పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను మండల ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయకపోతే భారీ ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని పలు గ్రామాల ప్రజలు హెచ్చరించారు.

రాజేష్, రామోజీకి మాజీ ఎమ్మెల్యే కందాళ పరామర్శ

నవతెలంగాణ-కూసుమంచి



మండలంలోని కోక్యతండా గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు రాజేష్ ఇటీవల ప్రమాదానికి గురైయాడు. మాజీ సర్పంచ్ మోహన్ కొడుకును తేజావత్ రామోజీని మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వేముల వీరయ్య, ఆసిఫ్ పాషా మాజీ డిసిసి డైరెక్టర్ ఇంటూరి శేఖర్, మాజీ జెడ్పిటిసి వడ్త్యా రామచంద్రనాయక్, జిల్లా నాయకులు మాలేడివెంకన్న, సోషల్ మీడియా అధ్యక్షుడు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తొలి కమ్యూనిటీ హాల్‌కు వైభవం

- ఏసీ కమ్యూనిటీ హాల్‌గా పునర్నిర్మాణం
- అన్ని వర్గాలవారు వినియోగించుకోవచ్చు
- ప్రారంభ కార్యక్రమంలో జీఎం ఆనంద్



నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి సంస్థ ఇల్లందు 24 ఏరియాలో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను ఏసీ హాల్‌గా పునర్నిర్మించారు. జీఎం జాన్ ఆనంద్ ఆదివారం ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి ఏరియా జియం జాన్ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఈ హాల్ సింగరేణి వ్యాప్తంగా నిర్మించిన మొట్ట మొదటి కమ్యూనిటీ హాల్ అన్నారు. ఈ కమ్యూనిటీ ఏసీ హాల్‌ను అందరూ చక్కగా వినియోగించు కోవచ్చు అన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసిన సంభందిత అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఏరియా జీఎంను ఏరియా అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యస్వోటు బొల్లం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, డీజీఎం పర్సనల్ జీవి మోహన్ రావు, డీజీఎం(సివిల్) రవి కుమార్, ఇతర అధికారులు మధుబాబు, దిలీప్ కుమార్, సాయి స్వరూప్ గుర్తింపు సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సారయ్య, ప్రతినిధ్య సంఘం ఉపా అధ్యక్షులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి లక్ష్మణ్ సింగ్‌కు సీపీఐ(ఎం) నివాళి



నవతెలంగాణ-ఇల్లందు

స్థానిక సుందరయ్య నగర్‌లో సీపీఐ(ఎం) పార్టీ పూర్వ డివిజన్ ఆఫీసు కార్యదర్శిగా పనిచేసి హైదారాబాద్ రైలు ప్రమాదంలో మరణించిన లక్ష్మణ్ సింగ్ 13వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణం కోసం పార్టీ సభ్యులు కార్యకర్తలు పనిచేయాలని, కార్మిక, కర్షక, మైత్రితో సమాజ మార్పు తేవాలని దానికోసం పని చేసిన లక్ష్మణ్ సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. డిసెంబర్ 20, 21 తేదీలలో సీపీఐ(ఎం) జిల్లా తృతీయ మహాసభలు ఇల్లందు గడ్డపై జరుగుతున్న నేపథ్యంలో వాటి జయప్రదం కోసం పార్టీ శ్రేణులు శ్రమించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలేటి కిరణ్ కుమార్, తాళ్లూరి కృష్ణ, జైబున్నిస, కోడెమ్ బోస్, విజయ్ మోహన్ సింగ్, అబ్బాస్, సోమ సుజాతా కృష్ణ, బోయిన రాజ శేఖర్, వజ్జా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలోపం జరిగితే కఠిన చర్యలు

- సందర్శనలో సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్



నవతెలంగాణ-ఇల్లందు

అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చే వారితో ఆప్యాయంగా మాట్లాడాలని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, అందించే వైద్య సేవలలో ఎటువంటి సేవలోపం జరిగినా సంబందిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సింగరేణి సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ పి.సుజాత హెచ్చరించారు. ఆదివారం ఆసుపత్రిని సందర్శించారు. ముందుగా ఏరియా జీఎం జాన్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో రోజువారీ ఓపీ వివరాలను, వార్డ్ రూమ్‌లను, ఆక్సిజన్ మిషన్‌ల పనితీరు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రి పరిసరాలు ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ నరసింహరావు, క్లర్క్ అరుణ, సిస్టర్స్ గ్రేస్, సౌభాగ్య వేణి, వార్డ్ బాయ్ సలీం తదితరులు పాల్గొన్నారు.

సకల సమస్యలకు పరిష్కారం మార్క్సిజం ఒక్కటే

- మాజీ ఎంపీ మిడియం బాబూరావు
- ఎర్రజెండా ఉన్నంతకాలం దోపిడీపై పోరాడుతూనే ఉంటాం
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్



నవతెలంగాణ-టేకులపల్లి

ప్రతి పేదవాడికి భూమి దక్కాలంటే భూ పోరాటాలను ఉధృతం చేయాలని, సకల సమస్యలకు పరిష్కారం మార్క్సిజం ఒక్కటే అని సీపీఐ(ఎం) జాతీయ నాయకులు, మాజీ ఎంపీ మీడియం బాబురావు అన్నారు. ఆదివారం టేకులపల్లి సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయం వద్ద 7వ మండల మహాసభ భట్టు పాపయ్య నగర్, దేవులపల్లి యాకయ్య గుగులోత్ ధర్మా ప్రాంగణంలో మహాసభ ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల కేంద్రం బోడురోడ్డు సెంటర్‌లో పార్టీ జెండాను మాజీ ఎంపీ మీడియం బాబూరావు ఆవిష్కరణ చేశారు. అనంతరం మండల కేంద్రం నుండి పార్టీ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. మహాసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమరవీరులకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండల మహాసభలో బాబురావు పాల్గొని మాట్లాడారు. భూమిపై ఉన్న సకల సమస్యలకు పరిష్కరించబడాలంటే మార్క్సిజమే ఎర్రజెండా సిద్ధాంతమే ఒకటే మార్గమన్నారు. పార్టీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్యం, అనంతరం నుండి జరిగిన అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ, కేంద్ర, రాష్ట్ర పాలకవర్గాల విధానాలపై ఎప్పటికప్పుడు విశ్లేషణ చేస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు నిర్మిహిస్తున్న చరిత్ర సీపీఐ(ఎం) పార్టీదే అన్నారు. దోపిడీకి అనుకూల విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వారి చరిత్ర అంతా ప్రజల్ని మోసం చేయడమేనని తెలిపారు. వీటిని ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రజలను చైతన్యం చేసి పోరాట రూపంలో రావడానికి పార్టీ ఆధ్వర్యంలో అనేక రకాల ఉద్యమాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తూ నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తూ ప్రజలందరికీ ఆర్థిక సమస్యలను సృష్టిస్తున్న విధానాలపై ప్రజా పోరాటాలకు పదును పెట్టాలన్నారు. ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, సింగరేణి బొగ్గు సంస్థలు, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటు శక్తులకు అప్పజెప్పే పద్ధతికి వ్యతిరేకంగా ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుట కోసం నేటికీ కొనసాగుతున్న ఉద్యమ నేపథ్యంలో సీపీఐ(ఎం) పార్టీ, వామపక్ష పార్టీలు కొనసాగిస్తున్న పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం తీరు పై ఉద్యమాలు నిర్మిస్తాం

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజె రమేష్

భూ నిర్వాసితుల పోరాటం దశల వారీగా చేస్తున్న ఉద్యమాలు, కోర్టుకు వెళ్లి న్యాయ పోరాటం ఫలితంగా హై కోర్టు స్పందించిన తీరు అభినందనీయం. ప్రజలు ఎదుర్కొంటున్న విద్యా, వైద్యం, నిరుద్యోగం సమస్యలు పై ఆందోళన పోరాటాలు నిర్మాణం చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచి సంవత్సరం గడిచిందని, ఉచితాల పేరుతో ప్రజల్ని మభ్యపెట్టి కాలయాపన చేస్తుంది. భూ సమస్యలకు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అధ్యయనం చేస్తూ, పోరాటాలకు పదును పెట్టాలి. మహాసభలో గత రెండు సంవత్సరాల కాలంలో చేసిన కృషి, విజయాలు, అపజయాలు, గుణపాఠాలు తీసుకొని భవిష్యత్తులో మరింత పదును పెట్టే విధంగా ఉద్యమాలు ఉధృతం చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఈ మహాసభలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, భూక్యా రమేష్, మండల నాయకులు ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, పూనెం స్వామి, పూనెం చంద్రశేఖర్, దొడ్డ సంపత్, పాయం వెంకన్న, జోగ రాంబాబు, పూనెం రాంబాబు, జోగ దశరథ్, దొడ్డ సావిత్రి, చుక్కమ్మ, కడుదుల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



పత్తి రైతులను దగా చేస్తున్న దళారులు

సీజన్లో పెట్టుబళ్లు...అధిక వడ్డీలతో వసూళ్లు

- ఊళ్ళల్లోనే పత్తిలోడ్లు
- సీసీఐలో అమ్ముకుంటున్న దళారులు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



ఓ మినీ వ్యాన్‌లో దళారులు లోడ్ చేస్తున్న పత్తి

నవతెలంగాణ-అశ్వాపురం

మండలంలోని పత్తి సాగు చేస్తున్న రైతులను దళారులు దగా చేస్తున్నారు. సీజన్లో పత్తి విత్తనాలతో పాటు పురుగుమందులు అప్పులుగా ఇస్తూ తీరా పత్తి పండిన తర్వాత అధిక వడ్డీలు వేసుకుని రైతుల వద్ద ముక్కు పిండి మరీ పండించిన పత్తి పంటను ఉళ్ళల్లోనే కాటాలు పెట్టుకుని లోడ్లకు లోడులు లారీలు, మినీ వ్యాన్లకు లోడ్ చేసుకొని దొడ్డిదారిన సీసీఐకి తరలించి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. పత్తి సాగు చేస్తున్నా సీజన్లో రైతుల వద్ద పెట్టుబడులకు ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తడంతో ఆయా గ్రామాలలో ఉన్న దళారులను ఆశ్రయించక తప్పడం లేదు. దీన్ని ఆసరాగా తీసుకున్న దళారులు రైతులకు అన్ని విధాలుగా పెట్టుబడులు పెట్టి అధిక మొత్తంలో వడ్డీ వేసుకొని పంటలు పండిన తర్వాత వారిచ్చిన సొమ్మును వడ్డీతో సహా జమ చేసుకొని మిగిలిన పైకాన్ని రైతులకు ముట్ట చెబుతున్నారు. సీసీఐ కేంద్రాల్లో రైతులు పత్తిని అమ్ముకుంటే ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్ముకోవచ్చు. కానీ దళారులు పెట్టుబడి సాయం పెట్టడంతో వారు పండించిన పత్తిని సీసీఐ కేంద్రాలకు తరలించలేక వారికే ఇవ్వడంతో ప్రతి ఏటా పత్తి రైతు లాభాల కంటే నష్టాలనే చవిచూస్తున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

దళారుల చేతులు తీవ్రంగా నష్టపోతున్న ఏజెన్సీ రైతులు

మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన ఏజెన్సీ ప్రాంతాల్లోని రైతులను దళారులు తీవ్రంగా మోసం చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్లో గిరిజన రైతులకు పెట్టుబడులను ఎరగా చూపి రైతుల శ్రమను దోసుకుంటున్నారంటంలో ఎటువంటి సందేహం లేదు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు ఎవరూ గ్రామాల్లో పర్యటించి రైతులను మోసం చేస్తున్న దళారులను కట్టడి చేయడంలో ఘోరంగా విఫలమవుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు గిరిజన గ్రామాలలోని రైతులు పండించిన పత్తిని సీసీఐ కేంద్రాలకే తరలించే విధంగా చర్యలు చేపట్టి దళారుల ఆటలు కట్టించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



హలో శుభోదయం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-దమ్మపేట

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మండలంలో హలో శుభోదయం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మల్కారం, రాచూరుపల్లి పంచాయతీలలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించి ప్రతివీధి తిరుగుతూ స్థానికంగా ఉన్న సమస్యలు స్వయంగా గమనించారు. పరిష్కారం అయ్యే సమస్యలు గుర్తించి సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కరించాలని చరవాణిలో ఆదేశించారు. అలాగే గ్రామస్తులను ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. రాచూరుపల్లి గ్రామంలో గతంలో ప్రమాదవశాత్తు క్రీడాకారుడు కోర్స నాగరాజు కాలు కోల్పోగా రూ.4లక్షలు విలువైన రోబోటిక్ కృత్రిమకాలు ఏర్పాటు చేపించి గతవారం హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్లో అమర్చేలా కృషి చేసారు. పర్యటనలో ఉన్న జారే నాగరాజు ఇంటికి వెళ్లిన సందర్భంలో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగరాజుకు భవిష్యత్‌లో అండగా నిలబడతానన్నారు. ఈ కార్యక్రమంలో మండలం కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం... అధైర్య పడకండి

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తూము చౌదరి, టీపీసీసీ మెంబర్ నాగ సీతారాములు
- రేగళ్ల పెద్ద తండాలో ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

ఎలాంటి కష్టం వచ్చినా కన్నీటి చుక్కలవుతామని, మీ సంతోషాలకు నిత్యం భాగస్వామ్యం అవుతామని, ఆపద సమయంలో మేమున్నామంటూ అధైర్య పడవద్దు అని, కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే అండ, దండ అని అలాంటి కార్యకర్తలను నిత్యం కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు తూము చౌదరి, టీపీసీసీ మెంబర్ నాగ సీతారాములు పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని రేగళ్ల పెద్ద తండా గ్రామంలో తూము చౌదరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న వారు మాట్లాడారు. రాష్ట్రంలో గతంలో కొనసాగిన నియంత పాలనకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు ఉద్యమించడం ప్రజలకు సుస్థిర పాలన అందించేందుకు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రావడానికి కార్యకర్తలే అత్యంత కీలకమని.. అలాంటి నికార్సేన కార్యకర్తలకు నిత్యం అండగా ఉంటామని స్పష్టం చేశారు. రేగళ్ల ఉమ్మడి పంచాయతీలో ఎంతోకాలంగా సాగు చేసుకుంటున్న భూములకు కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున పట్టాలు మంజూరు చేస్తామని ఇచ్చిన ఎన్నికల హామీలను తప్పకుండా నెరవేరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దబాబు, పూనమ్ శ్రీనివాస్, ఏనుగుల అర్జున్ రావు, మైనార్టీ జిల్లా సెక్రెటరీ ఎండి గౌస్, అప్సర్ ఖాన్ మోహన్ దుబ్లో, సీతారాం రమేష్, మంజీ లచ్చిరాం రమేష్, బలరాం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'రవి' అస్తమించని అక్రమ వ్యాపారం..!

వినియోగదారులను నిలువునా ముంచుతున్న భద్రాద్రి 'వాసు'డు

- నవతెలంగాణ కథనాలపై విస్తృతంగా చర్చించుకుంటున్న వ్యాపార వర్గాలు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

తోటి వ్యాపారి గోధాం నుండి రూ.5 లక్షల సరుకుని దొంగిలిచ్చి దర్జాగా తప్పించుకుని తిరుగుతున్న చోర్ తెల్ల కాలర్ వ్యాపార జీవితం మొత్తం అక్రమాలు మోసాలు తోనే నిండిపోయి ఉందని తెలుస్తుంది. వినియోగదారులైన రైతులకు వ్యవసాయ మోటర్లు విక్రయించే సందర్భంలో అధిక రేట్లకు విక్రయించడమే కాక నాసిరక రెండో క్వాలిటీ మోటార్లను వ్యవసాయ పనిముట్లను అంటగట్టారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఒకసారి ఈ ప్రబుద్ధుడి దగ్గర కొనుగోలు చేసిన ఏ ఒక్క వినియోగదారుడు కూడా పూర్తిగా సంతృప్తి చెందలేదు అంటే ఈయన అక్రమ వ్యాపారం ఏ స్థాయిలో నడుస్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కంపెనీల పేరుతో ద్వితీయ క్వాలిటీ వస్తువులను అంటకట్టడమే కాక రేట్ల మాయజాలం చూపుతూ వినియోగదారులను నిట్ట నిలువున ముంచే ఈ ఘనుడు వ్యాపార అభివృద్ధి కోసం చివరికి తోటి వ్యాపారి గోదాం పైనే దొంగతనానికి బరితెగించారని పట్టణంలో విస్తృతంగా చర్చ జరుగుతుంది. గతంలో భద్రాచలం మండలానికి చెందిన ప్రముఖ రైస్ మిల్లు వ్యాపారికి సైతం ద్వితీయ క్వాలిటీ మోటర్‌ని అంటగట్టడమే కాకుండా అధిక డబ్బులు వసూలు చేసి పైగా అహంకార వైఖరిని ప్రదర్శిస్తే సదరు రైస్ మిల్లు వ్యాపారి తనకున్న సామర్థ్యంతో సంబంధిత కంపెనీలకు ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టిన ప్రముఖ కంపెనీ ఈ ప్రబుద్రుడుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతోపాటు బాధితుడైన రైస్ మిల్ యాజమానికి నష్టపరిహారం చెల్లించడం అంతేకాకుండా ఇతని వల్ల మోసపోయిన పది మంది పైచిలుకు రైతులకు సైతం తిరిగి డబ్బులు ఇప్పిచ్చినప్పటికీ ఈ విషయం గుటు చప్పుడు కాకుండా బయట ప్రపంచానికి తెలియకుండా కొంతమంది ప్రముఖులు దాచిపెట్టినట్టు తెలుస్తుంది.

డీలర్ షిప్ రద్దు చేసుకునే ఆలోచనలలో పలు కంపెనీలు

గతంలో వ్యాపారంలో అనేక అక్రమాలకు పాల్పడటం కాకుండా వినియోగదారుల నుండి అనేక ఫిర్యాదులు అందినప్పటికీ చూసి చూడనట్టు వ్యవహరించిన ప్రముఖ కంపెనీలు ఇప్పుడు సాక్షాత్తు దొంగతనానికే ఒడిగట్టిన భద్రాద్రి "వాసు"డితో వ్యాపారం అంత శ్రేయస్సు కాదని పలు కంపెనీలు పురాలోచనలో పడ్డట్టుగా తెలుస్తుంది. ఇప్పటికే ప్రముఖ మోటార్ కంపెనీకి అన్ని తానే అని చెప్పుకునే ప్రబుద్ధుడు వ్యాపారంలో మోసాలే కాక దొంగతనానికి సైతం తెగించడంతో కంపెనీల బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ఇప్పటికే పట్టణంలో ప్రముఖులు ఆయా కంపెనీలకు జరుగుతున్నతంగాని మొత్తం సమాచారాన్ని అందిస్తున్నారని అందించిన నేపథ్యంలో కంపెనీల బ్రాండ్ ఇమేజ్ నిలబడాలంటే ఇటువంటి వారి నుండి డీలర్షిప్ రద్దు చేసుకోవటమే ఉత్తమం అని ఆయా కంపెనీలు నిర్ణయానికి వస్తున్నట్టుగా భద్రాచలం జోరుగా ప్రచారం సాగుతుంది.

ప్రముఖులు పారాహుషార్

తెల్ల చొక్కా ధరించి దర్జాగా తిరుగుతున్న ఘన "వాసు"డితో ఇంత కాలం తెలియక స్నేహం చేసిన ప్రముఖులు తల దించుకునే పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. కల్తీ పాలలో కలిస్తే శుభ్రమైన నీరు సైతం తన నిజాయితీని కోల్పోతుందన్న విషయాన్ని గుర్తించి పాలు, నీళ్లు లాగా కలిసి స్నేహం చేసిన స్నేహితులు సైతం ప్రబుద్ధుడిని దూరంగా పెట్టగా నాడీ పట్టే నారాయణలు సైతం వీలైనంతవరకు ఇటువంటి స్వార్థపరులకు దూరంగా ఉంటేనే సమాజంలో వారికి ఉన్న గౌరవ మర్యాదలు నిలబడతాయి అన్న విషయాన్ని గుర్తించి ఈ ప్రబుద్ధుని దూరం పెట్టారని తెలుస్తుంది.

నవతెలంగాణ కథనంపై విస్తృత చర్చ

సుదీర్ఘకాలంగా వ్యాపారులకు అండగా కార్మిక, కర్షకతో పాటు నిజాయితీ వ్యాపారులకు అండగా నిలుస్తూ వారి సమస్యలను వెలికితీస్తూ నిబద్ధత కలిగిన నవతెలంగాణ పత్రికలో ఒకసారిగా అక్రమ వ్యాపారుడిపై కథనాలు వెలుబడడంతో వ్యాపార వర్గంలో విస్తృతంగా చర్చ జరుగుతుంది. గతంలో నాణ్యమైన వ్యాపారులను స్నేహపూర్వక పోటీదారులుగా ప్రోత్సహిస్తూ ఈ ప్రాంత వ్యాపారులకు అండదండగా నిలిచిన పత్రికలో భద్రాచలం చరిత్రలో గతంలో ఎన్నడు లేని విధంగా తోటి వ్యాపారి గోదాం పై దొంగతనానికి పాల్పడిన అక్రమార్కుడిపై వాస్తవ కథనాలను ప్రచురించడంతో నవతెలంగాణ పత్రిక పై వ్యాపారుల ఆసక్తి మరింతగా పెరిగిందని పలువురు పాఠకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆళ్ళపల్లికి డబుల్ రోడ్డు కల నెరవేరేనా..?

రోడ్డు పై మొరాయిస్తున్న లోడ్ లారీలు

- రహదారిపైనే ఆగడంతో రాకపోకలకు ఇబ్బందులు
- 15 రోజుల్లోనే రెండో దఫా సమస్య పునరావృతం
- తుమ్మలపై ఆశలు పెట్టుకున్న అభిమానులు
- డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే, అధికారులకు వేడుకోలు





నవతెలంగాణ-ఆళ్ళపల్లి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అనిశెట్టిపల్లి నుండి ఆళ్ళపల్లికి గత పాలకులు కొన్నేళ్ల క్రితం సింగిల్ బీటీ రోడ్డు వేశారు. దానిలో జిల్లా కేంద్రం నుండి అనిశెట్టిపల్లి వరకు 10 కి.మీ రహదారి ఉండగా.. అక్కడి నుండి ఆళ్ళపల్లికి రమారమి 35 కి.మీ.మేర సింగిల్ బీటీ రోడ్డు వేశారు. కానీ, ఆ రోడ్డు వాహనాలకు ముఖ్యంగా ద్విచక్ర వాహన దారులకు మృత్యు కుహరంగా మారింది. సింగిల్ బీటీ రోడ్డు కావడం, ఆ పై మూల మలుపులు ఎక్కువగా ఉండటం, వీటికి తోడు రోడ్డుకిరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి, ప్రయాణికులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనపడకుండా రోడ్డును కమ్మేసి ఉన్నాయి. ఆ పిచ్చి మొక్కల్లోనే కనబడకుండా రోడ్డు కోసం తీసిన గ్రావెల్ గోతులు దారి పొడువునా నివురు కప్పిన నిప్పులా ఉండటం ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా పరిణమించాయి. ఈ మార్గాన బస్సు, లారీ వంటి వాహనాలు ఒకదానికొకటి ఎదురుపడితే రోడ్డు దిగి సైడ్ ఇవ్వలేని పరిస్థితి తరచూ జరుగుతూనే ఉంది. ఇక ఈ రోడ్డుపై పెద్ద వాహనాలు ఎదురుగా వస్తే పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటం అన్న విధంగా ద్విచక్ర వాహనదారుల అవస్థలు వర్ణణాతీతం. నిత్యం వివిధ అవసరాల దృష్ట్యా ప్రమాదాలను దాటుకుని రాకపోకలు సాగించే ప్రయాణికుల ప్రాణాలు గాలిలో దీపాలుగా మారుతున్నాయి. వీటికి తోడు వాహనదారులు వేగంగా, నిర్లక్ష్యంగా, మద్యం సేవించి వాహనాలను నడిపినా.. వచ్చినా.. ఊహకందని రీతిలో పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. దీనికి అక్టోబర్ 2వ తేదీన మండలంలోని లక్ష్మిపురం గ్రామానికి చెందిన కుంజ ప్రవీణ్ (19), యెట్టి ప్రణయ్ తేజ్ (17) ఆర్టీసీ బస్సు ఢీకొని దుర్మరణం పాలైన ఘటన తాజా రుజువుగా చెప్పవచ్చు. అదేవిధంగా వాహనదారులు రోడ్డు ప్రమాదంలో వికలాంగులుగా మారిన, ఆసుపత్రి పాలై ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడిన వారి జాబితా చాంతాడంత ఉంది.

కాగా, ఈ సింగిల్ రోడ్డుపై బస్సులు, లారీలు నడిపే కొంతమంది డ్రైవర్లలో.. వెనుక, ఎదురుగా వచ్చే వాహనాలకు కి.మీ మేర సైడ్ ఇవ్వలేని రోడ్డు పరిస్థితి కొందరికుంటే, మరికొందరికి అవకాశం ఉన్నా కానీ, కావాలని కి.మీ మేర సైడ్ ఇవ్వకుండా దురుసుగా నడిపే డ్రైవర్లు సైతం ఉన్నారు. ములిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా అసలే సింగిల్ రోడ్డుపై స్థానికులు రాకపోకలు సాగించేందుకు అవస్థ పడుతుంటే, మండలానికి వచ్చి, వెళ్తున్న లోడ్ లారీలు, టిప్పర్లు తరచూ దయ్యాలొద్ది ప్రాంతంలో మొరాయించి, రోడ్డుపైనే ఆగిపోవడంతో బస్సు, వేరే వాహనాల రాకపోకలకు గంటలతరబడి లేదా రోజంతా ఇబ్బంది తలెత్తుతుంది. అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులను సకాలంలో వైద్యానికి జిల్లా కేంద్రానికి తీసుకెళ్లాలన్నా ఈ మార్గంలో జరిగే 'జాగు' వారికి ప్రాణసంకటంగా మారుతుంది. ఈ నెల 3వ తేదీన గుండాల మీదుగా వచ్చిన బొగ్గు లోడ్ లారీ వయా మండలంలోని అనంతోగు నుంచి వెళ్తుండగా దయ్యాలొద్ది ప్రాంతంలో రిపేరుకు గుర్రై, రోడ్డుపై ఆగిపోయింది. దాంతో ఆ రోజు దాదాపు పగలంతా ఆర్టీసీ బస్సు, ఇతర పెద్ద వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు వ్యయప్రయాసలకు గురయ్యారు. ఆ ఘటన జరిగి పట్టుమని పక్షం రోజులు కాకముందే అచ్చు అలాంటి ఘటనే శుక్రవారం పునరావృతమైంది.

ఒక గ్రామం లేదా మండలం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే ముందుగా ఆ ప్రాంతానికి రవాణా సౌకర్యం బాగుండాలన్న విషయం తెలిసిందే. కానీ, సరైన రవాణా సౌకర్యం లేకనే మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన ఆళ్ళపల్లి మండలం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని పలువురు స్థానికులు వాపోతున్నారు. గత బీఆర్ఎస్ పాలకులు పది సంవత్సరాల కాలం కేవలం రోడ్డుపై మరమ్మతులు చేపట్టడంతోనే సరిపెట్టుకుంది. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనైనా డబుల్ రోడ్డు కల సాకారం అవుతుందని స్థానిక ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. దానికి కారణం గతంలో ఉమ్మడి ఆళ్ళపల్లి, గుండాల మండలాల్లో రోడ్లు, వంతెనలు, భవనాలు, చెరువులు, తదితర కొన్ని అభివృద్ధి పనులు చేసిన ప్రదాత 'తుమ్మల' మంత్రిగా ఉండటం ఒకటైతే, స్థానిక ఎమ్మెల్యేగా పాయం వెంకటేశ్వర్లు అధికారంలో ఉండటంతో ఆళ్ళపల్లి వాసుల డబుల్ రోడ్డు ఆశలు తిరిగి చిగురిస్తున్నాయి.

రెవెన్యూ భూమి పక్క రోడ్డును విస్తరించాలి..

ఆళ్ళపల్లి నుంచి కొత్తగూడెం వెళ్లే రోడ్డుకి ఓ పక్క ఫారెస్ట్ శాఖ భూమి, మరోపక్క రెవెన్యూ శాఖ భూమి ఉన్న నేపథ్యంలో.. పాలకులు, అధికారులు డబుల్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూమిని రెవెన్యూ భూమి వైపు నుంచి తీసుకుని డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టవచ్చని, ఆ దిశగా ప్రభుత్వం, అధికారులు యోచించాలని స్థానిక మేధావులు సూచిస్తున్నారు. ఇలాగైనా అనిశెట్టిపల్లి గ్రామం నుండి మండలానికి డబుల్ రోడ్డు కావాలనే ఆళ్ళపల్లి మండల ప్రజల కల నెరవేర్చాలని, డబుల్ రోడ్డు లేక అన్ని విధాలా అభివృద్ధికి దూరంగా ఉన్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లాలోని ముగ్గురు (మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు) మంత్రులు ప్రత్యేక చొరవ చూపి డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, వెంటనే నిర్మాణ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

గిరిజనులకు రగ్గులు పంపిణీ





నవతెలంగాణ-చర్ల

బీర్సా ముండా 150వ జయంతి వేడుకలను సుబ్బంపేట గ్రామపంచాయతీ పరిధిలోని రాజయ్య నగర్ నందు వనవాసి కళ్యాణ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి కోరం సూర్యనారాయణ నేతృత్వంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేద ఆదివాసీలకు రంగుల పంపిణీ చేపట్టారు. తొలుత బీర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సూర్యనారాయణ మాట్లాడుతూ బీర్సా ముండా జార్ఖండ్‌లోని ఖుంటీ జిల్లా ఉలిహయ గ్రామంలో జన్మించారని ఆయన అన్నారు. బీర్సా ముండా గిరిజన నాయకుడే కాకుండా స్వాతంత్ర సమరయోధుడు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఉల్గులన్ ఉద్యమానికి నాయకత్వం వహించాడని గిరిజన సంస్కృతి, సాంప్రదాయాల పట్ల విరోచితంగా పోరాటం కొనసాగించాడని ఆయన అన్నారు. అనంతరం సుమారు 50 గిరిజన కుటుంబాలకు రగ్గులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రఖండ ప్రముఖ గొంది శోభన్ బాబు, సహకారదర్శి గోగికార్ రామలక్ష్మణ్, గ్రామ పెద్ద రేగ అంద్రయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐర్లాండ్ అబ్బాయి...ఆదివాసీ అమ్మాయి

భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలతో వివాహ మహోత్సవం

- ఖండాంతరాలు విస్తరించిన పగిడేరు ఖ్యాతి

నవతెలంగాణ-మణుగూరు






రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యం యునైటెడ్ కింగ్ డంలో అంతర్భాగమైన నార్త్ రన్ ఐర్లాండ్ దేశానికి చెందిన అబ్బాయి మార్క్ ఫ్రిడ్జ్ ర్లాండ్ మారుమూల ప్రాంతమైన పగిడేరు గ్రామానికి చెందిన అమ్మాయి ఆదివారం పీవీ కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భారతీయ సంస్కృతి, సాంప్రదాయ పద్ధతిలో వివాహం జరిగింది. ఈ వివాహానికి పెండ్లి కుమారుని తరఫున తల్లిదండ్రులు హాజరయ్యారు. వారు తమ కుమారుని వివాహ వేడుకను స్వాగతించారు. ఎంతో ఆనందంగా సంతోషం వ్యక్తం చేశారు. భారతీయ సంస్కృతిలో జరుగుతున్న వివాహాల గొప్పతనాన్ని కొనియాడారు. దేశాల సరిహద్దులు చెరిపేస్తూ సప్త సముద్రాల ఆవాల ఉన్న అట్లాంటిక్ సముద్రంలోని ఐలాండ్‌లలో ఒక దేశం నార్త్ రన్ ఐర్లాండ్. పగిడేరు గ్రామానికి ఊరి పెద్ద మనిషిగా అనేక సంవత్సరాలు వ్యవహరించిన కుంజ బక్కయ్య దొర-సాయమ్మల పెద్ద కుమారుడు కుంజా శంకర్ (లేటు), ప్రముఖ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మేజర్ గ్రామపంచాయతీ సమితి సింగారం మొదటి సర్పంచ్‌గా ప్రజా సేవ చేశారు. కుంజా శంకర్-విజయలక్ష్మి దంపతుల కూతురు శోభారాణి హోటల్ మేనేజ్మెంట్‌లో ఎంటెక్ చదువుకున్నది. శోభారాణి మొదటగా ఇండియాలో ఇండిగో కంపెనీలో ఉద్యోగం చేస్తున్న క్రమంలో కంపెనీ ఐర్లాండ్‌కి ఉద్యోగరీత్యా కంపెనీ పంపించింది.

ఐర్లాండ్ అబ్బాయి, ఆదివాసీ బిడ్డ శోభ రాణి వివాహం జరగడం పట్ల పగిడేరు గ్రామమే కాకుండా ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న మణుగూరు మండలంలో ప్రజలు తమ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖులు వారికి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇప్పటికే పగిడేరు గ్రామంలో ప్రపంచంలో రెండవ జియో థర్మల్ ప్లాంట్ ఉన్నదని, దీని కారణంగా ప్రపంచ దేశాలన్నీ కూడా పగిడేరు గుర్తించాయి. మొదటి జియో థర్మల్ ప్లాంట్ ఇటలీలో కలదు. పగిడేరు గ్రామంలో అనేక మంది అమ్మాయిలు రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో విద్యలో రాణిస్తు న్నారు. పీజీ పూర్తిచేసిన ఆదివాసీ అమ్మాయిలు అనేకమంది ఉన్నారు. ఉన్నత చదువుల కారణంగా ప్రపంచంలో ఎక్కడైనా రాణించవచ్చని పలువురికి ఆదర్శంగా ఈ వివాహం జరిగిందని యువతీ, యువకులకు ఒక రోల్ మోడల్ అని పలువురు కొనియాడారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సీనియర్ సైంటిస్ట్‌గా పని చేసిన స్థానంలో పగిడేరు శాంతినగర్ గ్రామానికి చెందిన వేర్పుల వెంకటేశ్వర్లు అమెరికా, ఇజ్రాయిల్, భారతదేశాల మధ్య నిత్యం ప్రయాణం చేస్తున్నారు. సీనియర్ సైంటిస్ట్‌గా ప్రముఖ పాత్ర వహిస్తున్నారు. ఇలా అనేకమంది విద్యావేత్తలు, మేధావులు తయారవుతున్నారు. పగిడేరు ప్రపంచ స్థాయిలో ఐర్లాండ్ అబ్బాయి, పగిడేరు అమ్మాయి వివాహం కారణంగా వలన మరొకసారి వెలుగులోకి వచ్చింది.

అంతర్జాతీయ వర్చ్యువల్ బుక్ ఫెయిర్ భద్రాచలం కవికి దక్కిన అరుదైన అవకాశం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



పెరూ దేశంలోని అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక వేదిక వర్చ్యువల్ బుక్ ఫెయిర్ 2024 అంతర్జాల వేదికలో పాల్గొని పరిచయాన్ని, సాహిత్య ప్రస్థానాన్ని ప్రదర్శించే అరుదైన అవకాశం భద్రాచలం కవి, ఆర్టీసీ కంట్రోలర్ తాతోలు దుర్గాచారికి దక్కింది. వర్చ్యువల్ బుక్ ఫెయిర్ సంస్థ అధినేత సీజార్ భారత దేశ సాంస్కృతిక రాయబారి, ప్రముఖ కవయిత్రి ప్రభావతి జోశ్యుల ద్వారా ఈ చక్కని అవకాశం లభించింది. మన దేశ ఔన్నత్యాన్ని చాటేలా కవితా గానాలను ఆలపించి తెలంగాణ సాహితి ద్వారా ప్రమీలా సాహిత్య సాంస్కృతిక సేవా సమితి తెలుగు లోగిలి భద్రాచలం ద్వారా సాహిత్య సేవలను పురం ప్రముఖుల సహకారంతో గీతం రెండు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న సాహితీవేడుకలను పరిచయాన్ని కూడా సంక్షిప్తంగా వివరించారు. సాహిత్యం సామాజిక మార్పుకోసమని కవిత్వం ద్వారా ఎందరో చైతన్యవంతులయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ సాహితి నిర్వాహక పెద్దలు, కవి మిత్రులు, ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుపతి, పురప్రములు, కార్మిక సోదరులు, సాహిత్యాభిమానులు, తాతోలు దుర్గాచారిని అభినందించారు.

ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్షలు

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరీక్ష కేంద్రంలో 13478 అభ్యర్థుల కోసం 39 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పరీక్షలు నిర్వహించారు. గ్రూప్-3 పరీక్షలు సోమవారం కూడా జరిగే అవకాశం ఉంది. ఈ రోజు పరీక్షలు రాసిన అభ్యర్థులే పరీక్షలకు హాజరు కానున్నారు. కొత్తగూడెం పట్టణంలో 26 పరీక్ష కేంద్రాలు, పాల్వంచలో 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు జరిగిన పరీక్షలకు 13478 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 6244 మంది మాత్రమే పరీక్షలు రాశారు. సుమారు 5367 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 53.67 శాతం నామోదు అయింది.

- 13478 మందికి గాను, 6244 హాజరు
- 5367 మంది గైర్హాజరు... 53.67 శాతం నమోదు
- పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- ఒక్క నిముషం ఆలస్యంతో వెనుతిరిగిన అభ్యర్థులు

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాల నుండి పెద్ద ఎత్తున గ్రూప్-3 అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. కొంతమంది అభ్యర్థులు నిర్దీత సమయంలో పరీక్ష కేంద్రానికి రాక పోవడం, ఒక్క నిమిషం నిబంధన ఆలస్యం అవడంతో వెను తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎక్కువగా మహిళలు వెనుతిరిగి వెళ్లాల్సిన పరిస్థితి కనిపించింది. జిల్లాకు చెందిన అభ్యర్థులు ఎక్కువ మంది మారుమూల సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారే ఎక్కువగా ఉన్నారు. ఒక్క నిముషం ఆలస్యంగా వచ్చి ఎంత వేడుకున్నప్పటికీ పరీక్ష నిర్వాహకులకు నిబంధనల ప్రకారం అభ్యర్థులను అనుమతించలేదు. ప్రభుత్వం ఒక్క నిమిషం ఆలస్యం నిబంధన ఉన్నదని, గత కొంతకాలంగా మీడియా ద్వారా తెలియజేస్తున్నప్పటికీ అభ్యర్థులు కొంత మంది నిర్లక్ష్యంగా వ్యవహరించి పరీక్షలు రాలేకపోయారని నిర్వాహక అధికారులు అంటున్నారు. ఉదయం 8 గంటల నుంచి పరీక్ష కేంద్రానికి అభ్యర్థులను అనుమతించడం జరిగింది.

నిబంధనలు : ప్రభుత్వ పరీక్షల నిబంధనల ప్రకారం అలాంటి సెల్ ఫోన్స్, వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, మహిళలు ధరించే ఆభరణాలను సైతం అనుమతించలేదు. దీంతో కొంతమంది మహిళలు పరీక్షా కేంద్రాల వద్ద వారి ఉన్నటువంటి ఆభరణాలు వారితో వచ్చిన కుటుంబ సభ్యులకు పరీక్ష కేంద్రాల ముందే వారికి అప్పగించడం కనిపించింది. ఉదయం 9.30 నిమిషాలకే పరీక్ష కేంద్రాల గేట్లను మూసివేశారు. ప్రభుత్వం నిబంధన ప్రకారమే పోలీసులు, పరీక్షల నిర్వాహకులు అనుసరించారు. ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు మొదటి పరీక్ష నిర్వహించగా, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 నిమిషాల వరకు పరీక్ష జరిగింది. సోమవారం ఉదయం 10 గంటల నుండి 12.30 గంటల వరకు పరీక్ష జరిగే అవకాశం ఉంది. ఆదివారం రాసిన అభ్యర్థులే రేపు పరీక్ష రాసే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే కొంతమంది దూర ప్రాంతాల నుంచి పరీక్ష రావడం జరిగింది. వారు తలదాచుకునేందుకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో తిరిగి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి కూడా ఉండే అవకాశం ఉంది. మారుమూల ఆదివాసి గిరిజన ప్రాంతాల నుంచి ఎక్కువగా గ్రూప్-3 పరీక్షలు రాసిన అభ్యర్థులు కనిపించారు.






పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఒక్క నిమిషం నిబంధన

గ్రూప్-3 పరీక్షలు ఒక్క నిమిషం నిబంధన అనేకమంది అభ్యర్థులను వెను తిరిగేలా చేస్తుంది. ఉదయం 9:30 పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని నిబంధన ఉండడంతో అభ్యర్థు లు ఒక నిమిషం ఆలస్యంగా వచ్చినవారు వెనుక తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి కనిపిం చింది. ముఖ్యంగా ఉద్యోగ ప్రయత్నం కోసం ఎదురుచూస్తున్న అనేకమంది నిరుద్యోగులు ఒక్క నిమిషం నిబంధనను అధిగమించారు. కొంత మంది నిర్లక్ష్యంగా వ్యవహరించి ఒక నిమిషం ఆలస్యంగా రావడంతో పరీక్ష రాయలేని పరిస్థితి కనిపించింది. పరీక్ష కేంద్రానికి నిర్దీత సమయంలో వెళ్లాలి, పరీక్ష రాసేందుకు కావాల్సిన వాటిని సమకూర్చుకోవాలి అనే ప్రణాళిక లేకపోవడంతో వెనుతిరిగి వెళ్లాల్సి వచ్చిందని తెలుస్తుంది. కొంత మంది ఐడి కార్డులు, పెన్నులు లేకుండానే పరీక్షా కేంద్రాలకు రావడం విస్మయానికి గురిచేసింది.



ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన అభ్యర్థి



గట్టి బందోబస్తు : గ్రూప్-3పరీక్షలను సక్రమంగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు గట్టి ఏర్పాట్లు చేశారు. 350 మంది పోలీసు అధికారులను పరీ పరీక్షల నిర్వహణకు బందో బస్తుగా ఏర్పాటు చేయడం జరిగింది. పరీక్షా కేంద్రాల చుట్టు పక్కల ఉన్న షాపులు, జరాక్స్ సెంటర్స్, 100 మీటర్ల దూరం వరకు ఎలాంటి బైక్‌ల పార్కింగ్ లేకుండా గట్టి బందో బస్తు నిర్వహించారు.

కలెక్టర్, ఎస్పీ పరిశీలన :

కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్ ఆదివారం పర్యవేక్షించారు. పరీక్షలు జరుగుతున్న కేంద్రాలకు ఆకస్మికంగా వెళ్లి పరిశీలించారు. లక్ష్మీదేవిపల్లిలోని శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ, పీజి కళాశాల, కొత్తగూడెంలోని సింగరేణి ఉమెన్స్ డిగ్రీ, పీజి కళాశాల, చుంచుపల్లి మండలంలోని రుద్రంపూర్‌లోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో, సుజాత నగర్ మండలం లోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కాలేజి, పాల్వంచలోని డిఏవి మోడల్ స్కూల్, ఇంటర్మీడియట్ కాలనీ కేటీపీఎస్‌లో జరిగిన గ్రూప్-3 పరీక్షల నిర్వహణను, మరికొన్ని పరీక్ష కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేసి, నిర్వహణ సిబ్బందిని విషయాలు అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు.

భావితరాల శాస్త్రవేత్తలకు బాటలు వేస్తున్న జారే

- అద్భుతాలుకు అవకాశ వేదికగా వైజ్ఞానిక్ ప్రదర్శన

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



అద్భుతాలు సృష్టించేందుకు ఒక వేదికగా అన్నపురెడ్డిపల్లి సాంఘీక సంక్షేమ గురుకుల బాలురు పాఠశాల, కళాశాల ప్రాంగాణ స్థలానికి విక్రమ్ అంబాలా సారాబాయి వేధికగా నామకరణం చేసి ఆ వేదిక నందు సర్వం సిద్ధం చేశారు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ. సోమ, మంగళ, బుధవారం మూడు రోజులు పాటు జిల్లా నలుమూలలు నుండి అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఐటీడీఏ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు భావితరాల శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఒక అద్భుతమైన అవకాశాన్ని జారే ఆదినారాయణ కల్పించడంతో మండల ప్రజలు, విద్యావేత్తలు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయన చేసిన కృషికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జారే మాట్లాడుతూ మండల కేంద్రంలో గల గురుకుల పాఠశాలలో జరిగే వైజ్ఞానిక్ ప్రదర్శనకి మంత్రులు, ఎమ్మెల్సీలు, ఉన్నత అధికారులు అంతా హాజరు అవుతున్నారని, 3 రోజులు పాటు అధికారులు అందుబాటులో ఉండి వచ్చే అతిథులుకు మర్యాదలు చేయాలని అదేవిధంగా ప్రదర్శన చేసే విద్యార్థులకు వసతితి పాటు భోజన సౌకర్యాలు ఎక్కడ కూడా లోతుపాటులు జరగకుండా చూడాలని అన్నారు. 20వ తేదీన విజేతలకు బహుమతులు ఇవ్వడం జరుగుతుందని, మండలంలో స్వచ్ఛంధ సేవ సంస్థలు ఎవరైనా ఈ కార్యక్రమానికి వచ్చి వారి సేవలు అందించవచ్చు అన్నారు. పార్టీలకు అతీతంగా మండలంలో వున్న రాజకీయ పార్టీ నాయకులు కూడా పాల్గొనవచ్చు అని అన్నారు. వైజ్ఞానిక్ ప్రదర్శనకు ఆదివారం దూర ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులకు జారే ఆదినారాయణ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారి, సైన్స్ ఫెయిర్ జిల్లా అధికారి చాలపతిరాజు, మండల విద్యాశాఖ అధికారి ఆనంద్ కుమార్, పర్స వెంకట్, వనమా గాంధీ, పేరెంట్స్ కమిటీ చైర్మెన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ గుడికి భక్తుల తాకిడి

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

కేపీ జగన్నాధపురం శ్రీ కనకదుర్గ (పెద్దమ్మ తల్లి) దేవాలయాన్ని పెద్ద మొత్తంలో భక్తులు సందర్శించారు. ఆదివారం సెలవు దినం కావడంతో పరిసర ప్రాంత ప్రజలతోపాటు ఉమ్మడి ఖమ్మం సరిహద్దుల నుండి ఆలయానికి చేరుకున్నారు. తమను చల్లగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు సమర్పించారు. విశిష్ట పూజలు చేశారు. కార్తీకమాసంలో పురస్కరించుకొని అర్చకులు, వేద పండితులు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పూజల అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రజనీకుమారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులపై దాడిని ఖండిస్తున్నాం

- దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- టీజీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై జరుగుతున్న దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీజీవోస్ జిల్లా అధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య, కార్యదర్శి వి.మహేష్ ప్రభుత్వాన్ని కోరారు. బూర్గంపాడులో శనివారం రాత్రి సుమారు 12 గంటల సమయంలో జరిగిన దాడిని వివరించారు. బూర్గంపాడు మండలం డిప్యూటీ తహసీల్దార్ రాంనరేష్, ఆర్ఐ ముత్తయ్యలు సారపాక దగ్గర ఇసుకను అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో లోడింగ్ చేస్తున్నట్లు సమాచారం రావడంతో డిటి, ఆర్ఐలు తోటి సిబ్బందితో లోడింగ్ చేస్తున్న ప్రదేశానికి వెళ్లరని తెలిపారు. అక్రమ ఇసుక దందా చేస్తున్న ముఠా సుమారు 40 మంది కర్రలు, పారలతో రెవిన్యూ ఉద్యోగులపై విచక్షణ రహితంగా దాడి చేసి, హత్యా ప్రయత్నం చేశారని, ఇది దారుణమైన విషయమన్నారు.

దాడి జరుగుతున్న సమయంలో సంఘటనా స్థలానికి పోలీసులు, మీడియా వారు రావడంతో దాడికి పాల్పడి వాళ్ళు పారిపోయారని, ఒక వ్యక్తిని పోలీసులు పట్టుకొని, పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు. డిటి రాంనరేష్‌కు ఫోన్ చేసి, సంఘటన వివరాలు తెసుకున్నామని, గాయపడిన వారికి ధైర్యాని చెప్పామని, ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని వారు తెలిపారు. ఈ విధంగా విధి నిర్వహణలో ఉన్న అధికారులు, ఉద్యోగులపైన కొన్ని దుష్ట శక్తులు దాడులు, హత్య ప్రయత్నం చేయడం పరిపాటి అయ్యిందని, ఈ సంఘటనల పట్ల తీవ్రంగా ఖండిస్తూ ఇలాంటి దోషులను అరెస్ట్ చేసి, పిడి యాక్ట్ పెట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

జిల్లా అభివృద్ధికి తమ వంతు కృషి

- దిశ...రైల్వే కమిటీ సభ్యుల నియామకం
- విలేకర్ల సమావేశంలో వై.శ్రీనివాసరెడ్డి, అందెల ఆనంద్ రావు, డాక్టర్ వందనపు స్వప్న

నవతెలంగాణ-కొత్తగూడెం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెంకు చెందిన పలువురు నాయకులకు కేంద్ర ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులు దక్కాయి. కొత్తగూడెం మున్సిపల్ 26 వార్డు కౌన్సిలర్ వై.శ్రీనివాసరెడ్డి, సింగరేణి మాజీ జిఎం అందెల ఆనందరావు, అద్యపకురాలు డాక్టర్ వందనపు స్వప్నలకు నామినేటెడ్ పోస్టులు దక్కాయి. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. దిశ కమిటీ సభ్యులుగా అందెల ఆనందరావు, డాక్టర్ వందనపు స్వప్న, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యులుగా యరమల శ్రీనివాస్ రెడ్డి నియామకం జరిగిందని చెప్పారు. అనంతరం వారు మాట్లాడారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షించే దిశా కమిటీలో సభ్యులుగా వందనపు స్వప్న, అందెల ఆనంద్ రావు, జిల్లాలో రైల్వే అభివృద్ధి కార్యకలాపాలను సమన్వయం చేసే కమిటీలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యులుగా యరమల శ్రీనివాస్ రెడ్డి స్థానం దక్కినందుకు ఖమ్మం ఎంపి రామసహాయం రఘు రాంరెడ్డికి, రాష్ట్ర రెవిన్యూ శాఖ మంతి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సికింద్రబాద్ డివిజన్ పరిధిలో గల రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆసుపత్రులలో మౌళిక సదుపాయాల కల్పన, మారు మూల ప్రాంతంలో విద్యా అభివృద్ధికి దిశ కమిటీ నుండి చర్యలు తసుకుంటామని అందెల ఆనందరావు, డాక్టర్ వందనపు స్వప్న తెలిపారు. ఈనేక కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువయ్యే విధంగా తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కొత్తగూడెం

నల్గొండలో ఈ నెల 23వ తేదీన జరుగు మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం సమావేశం విజయవంతం చేయాలని రాష్ట్ర మాల మహానాడు సెక్రెటరీ జనరల్, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, జిల్లా కన్వీనర్ ఎస్.మధుసూదన్ రావు (చిన్ని) అన్నారు. ఆదివారం ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు కార్యదర్శి కూరపాటి రవీందర్, జిల్లా మాల మహానాడు మహిళా అధ్యక్షురాలు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మహిళా కన్వీనర్ మేరుగు అనసూర్య, పట్టణ మాల మహానాడు అధ్యక్షులు శనగ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉండేది కమ్యూనిస్టులే...



పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలి

- ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి
- సీపీఐ(ఎం) మండల మహాసభలో జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-అశ్వాపురం

ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉండేది కమ్యూనిస్టులేనని సీపీఐ(ఎం) పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో గద్దల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన తొమ్మిదవ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోరాటాల పురిటిగడ్డ రామచంద్రా పురం గ్రామంలో మహాసభలు నిర్వహించుకోవడం సంతోష దాయకంగా ఉందన్నారు. మండలంలో పార్టీ ఒకానొక దశలో అనేక ఉద్యమాలు చేస్తూ ఎన్నో పదవులను చేపట్టిన ఘనత పార్టీ ఉందన్నారు. మల్లెల మడుగు మొండికుంట గ్రామాలలో పార్టీ బలంగా ఉండేదని మరల కార్యకర్తలు ప్రజలలో విశ్వాసం కలిగించి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని ఆయన కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తూ ప్రజలపై అధిక భారాలను మోపుతుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. దేశ సంపదను ఆదాని లాంటి కుబేరులకు అంటగడుతూ నిరుపేదలపై పెనుభారాలను వేస్తోందని ఆయన అన్నారు. త్వరలో జరగనున్న జిల్లా, రాష్ట్ర, జాతీయ మహాసభలో పార్టీ కార్యాచరణ పై మరిన్ని నిర్ణయాలు తీసుకునేందుకు మేధోమదం జరుగుతుందన్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి పరిపాలనను గాడి తప్పిస్తుందని ఆయన అన్నారు. ఎన్నికల హామీలలో భాగంగా ఒక ఉచిత బస్సు తప్ప వారిచ్చిన ఏ హామీలను నెరవేర్చలేదన్నారు. మండలంలో గోదావరి నదిపై నిర్మాణం చేపట్టిన సీతారామ ప్రాజెక్టు ద్వారా తొలుత మొదట ఉన్న సాగు భూములకు నీళ్లు ఇవ్వాల్సి ఉండగా అలాకాకుండా భద్రాద్రి జిల్లాకు అన్యాయం చేస్తూ ఇతర జిల్లాలోని చివర ప్రాంతాలకు నీళ్లు తీసుకుపోయేందుకు ప్రభుత్వం చేస్తున్న ఆలోచనలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న ఒరిగిందేమీ లేదని, ఉభయ జిల్లాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని ఆయన కోరారు.

మండల కార్యదర్శిగా పాయం నరసింహారావు



మండల కార్యదర్శిగా కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన పాయం నరసింహారావును మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఆయనతోపాటు మరో 11 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి మాట్లాడుతూ మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన శక్తి వంచన మేరకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఈ మహాసభల కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బ్రహ్మాచారి, స్వర్ణం బాల నరసయ్య, కొప్పుల పద్మ, నాగభూషణం, పోతురాజు శ్రీనివాసరావు, పినికేసు సుధాకర్ రెడ్డి, బొడ్డు రాములు, మండేపూడి సాంబశివరావు, దండి రాములు, అశోక్ రెడ్డి, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేసేది కమ్యూనిస్టులే



ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసేది కమ్యూనిస్టులే. ఓట్లు, సీట్ల గురించి ఇతర పార్టీలు మాత్రమే ఆలోచి స్తాయి. కమ్యూనిస్టులు మాత్రం పేదవారి సమస్యలు వారి బాగోగులపై ఉద్యమిస్తారు. మండలంలో పార్టీని మరింత దిశగా ఎదిగేలా చేసేది ప్రజా సంఘాలని అటువంటి వాటిని బలోపేతం చేసేందుకు నూతన కార్యవర్గం కృషి చేయాలి. ఎప్పటికప్పుడు గ్రామాల్లో తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం పోరాటాలను ఉధృతం చేయాలి. కేంద్ర, రాష్ట్రాల్లో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుంది. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకూ పోరాటాలు చేయాలి. ఈ మండల మహాసభలో ఎన్నికైన నూతన కార్యవర్గం పార్టీ ఎదుగుదల కోసం అంకితభావంతో పనిచేస్తూ కృషి చేయాలి.

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు

మొదటి అర్ధ భాగంలో సింగరేణి ముందడుగు

- గతేడాదితో పోల్చితే వెయ్యి కోట్ల కన్నా ఎక్కువ స్థూల లాభం...36 శాతం వృద్ధి
- అన్ని శాఖల పనితీరును సమీక్షిస్తున్న సింగరేణి సీఎండీ శ్రీ ఎన్.బలరామ్
- మంచి స్ఫూర్తినిచ్చిన అవగాహనా సదస్సులు
- వార్షిక లక్ష్య సాధన దిశగా వడివడిగా పరుగులు

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో తీవ్ర వర్ష ప్రభావాన్ని అధిగమిస్తూ, తన వినియోగదారులకు నిర్దీత సమయానికి బొగ్గును సరఫరా చేస్తూ సింగరేణి సంస్థ గడచిన ఏడు నెలల కాలంలో గతేడాదితో పోల్చితే వెయ్యి కోట్ల కన్నా ఎక్కువ లాభాలు గడించి ముందుకు దూసుకుపోతోంది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధ భాగంలో భారీ వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి కొన్ని అవాంతరాలు ఏర్పడినప్పటికీ.. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఇప్పుడు మళ్లీ ఉత్పత్తి వేగవంతం చేసింది. సంస్థ చైర్మెన్, ఎండీ ఎన్.బలరామ్ ప్రతిరోజు అన్ని ఏరియాల అధికారులతో ఉత్పత్తి పై ప్రత్యేకంగా సమీక్షిస్తున్నారు. ఫలితంగా బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపులో గణనీయమైన వృద్ధి కనిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు బొగ్గు అమ్మకం ద్వారా రూ.17151 కోట్లు, విద్యుత్ అమ్మకాల ద్వారా రూ.2286 కోట్ల టర్నోవర్‌ను నమోదు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు బొగ్గు, థర్మల్ విద్యుత్ అమ్మకాల ద్వారా పన్ను చెల్లింపునకు ముందు రూ.4 వేల కోట్ల స్థూల లాభాన్ని కంపెనీ ఆర్జించింది. గతేడాది ఇదే సమయానికి ఆర్జించిన రూ.2932 కోట్ల మీద ఇది రూ.1072 కోట్లు అదనం కావడం విశేషం. మొత్తంమీద గతేడాదితో పోల్చితే స్థూల లాభంపై 36 శాతం వృద్ధి నమోదైంది.

ఆత్మ విశ్వాసం, ఉత్సాహం నింపిన ప్రభుత్వ ప్రోత్సాహం

సింగరేణి చరిత్రలోనే అత్యధిక లాభాల వాటా రూ.796 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి చెల్లించేలా ఆదేశాలివ్వడం జరిగింది. దీపావళి బోనస్ రూ.358 కోట్ల చెల్లింపుతో పాటు కార్మికుల రక్షణకు సింగరేణి ప్రత్యేక చొరవ చూపడంతో కార్మిక శ్రేణుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది. కార్మికులకు కంపెనీ కల్పించిన కోటి రూపాయల ప్రమాద బీమా వారిలో ధీమాను పెంచుతోంది. కొత్తగూడెం ఏరియాలోని వీకే ఓసీ, ఇల్లందు ఏరియాలోని జేకే ఓసీలకు అటవీ అనుమతులు లభించడం సంస్థ భవిష్యత్‌కు భరోసానిచ్చాయి.

కార్మికులతో సమావేశాలు...

ఏక కాలంలో 40 గనులకు సంబంధించిన 1500 మంది సూపర్వైజరీ సిబ్బందిని ఉద్దేశిస్తూ, ఉత్పత్తి కన్నా రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంతో కార్మికుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపి, మంచి ఫలితాలు వస్తున్నాయి. కంపెనీ తీసుకుంటున్న ఆర్థిక క్రమశిక్షణ చర్యలు, భూ గర్భ గనుల్లో నష్టాలపై ఉద్యోగులకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. సంస్థలో రెండు ఉద్యోగ నోటిఫికేషన్లతో మొత్తం 599 మంది కొత్త ఉద్యోగులను ఈ నెలలో నియమించబోతున్నారు. తద్వారా ప్రతి గనిలో ఖాళీగా ఉన్న సూపర్వైజర్లు, అధికారులు, క్లర్కులు వంటి పోస్టుల్లో కొత్త ఉద్యోగులు చేరనున్నారు.

యంత్రాల వినియోగం...

బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడంపై, యంత్రాల వినియోగాన్ని పెంచడంపై పూర్తి అవగాహన కలిగించారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లోనూ కంపెనీ యంత్రాల వినియోగాన్ని 14 గంటల నుంచి 20 గంటల వరకు పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. మణుగూరు, రామగుండం-1, ఇల్లందు, కొత్తగూడెం, ఆర్జీ-3,తదితర ఏరియాల్లో ప్రొడక్షన్ డే నిర్వహిస్తూ యంత్రాల వినియోగాన్ని 20 గంటల వరకు పెంచగలిగారు. వర్షాకాలంలో రోజుకు లక్ష టన్నులకు పడిపోయిన ఉత్పత్తి పుంజుకుని ఇప్పుడు 2.2 లక్షల టన్నులకు చేరుకుంటోంది. రానున్న రోజుల్లో ఇది మరింత పెరగనుంది.

విశ్వాసం : మొత్తంమీద కష్టించి పని చేస్తేనే కంపెనీ మనుగడ ఉంటుందని, కంపెనీ ఉంటేనే తమకు మనుగడ ఉంటుందన్న విషయాన్ని కార్మికుల్లోకి తీసుకెళ్లగలిగారు. దీంతో ఉత్పత్తి ప్రక్రియలో ఉద్యోగులు అంకితభావంతో పని చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 5 నెలల కాలంలో నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా ముందుకు సాగుతున్నారు. ఫలితంగా కంపెనీ గతేడాది కన్నా ఎక్కువ అత్యధిక ఉత్పత్తి, లాభాల దిశగా దూసుకెళ్తోంది.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | నవంబర్ 18, 2024 | www.navatelangana.com

నూతన దంపతులను ఆశీర్వదించిన సీపీఐ(ఎం) నాయకులు

నవ తెలంగాణ - బోనకల్



మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు దుగ్గి వెంకటేశ్వర్లు, శోభారాణి దంపతుల కుమారుడు నాగభూషణం, కావ్య దంపతులను పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారి సురేష్, మండల కమిటీ సభ్యులు బంధం శ్రీనివాసరావు, కందికొండ శ్రీనివాసరావు, దొప్ప కొరివి వీరభద్రం, బొడ్డుపల్లి బ్రహ్మం, పిల్లల మరి వెంకట అప్పారావు, దుగ్గి వెంకటేశ్వర్లు, అక్కినపల్లి శేషగిరి తదితరులు ఆశీర్వదించారు. నూతన దంపతులకు శుభాకాంక్షలు అందజేశారు.

మొదటి రోజు ప్రశాంతంగా గ్రూపు-3 పరీక్ష

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రూపు-3 పరీక్ష మొదటి రోజు ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. గ్రూపు-3 పరీక్ష కోసం ఖమ్మంరూరల్ మండలంలో సాయిప్రభాత్‌నగర్‌లోని ప్రియదర్శినిమహిళా కళాశాల, వరంగల్ క్రాస్ రోడ్‌లోని సెయింట్ జోసెఫ్ స్కూల్, మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల, పొన్నెకల్లులోని అనిబీసెంట్ బీఈడీ కళాశాల, పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల, సత్యనారాయణపురంలోని డేర్ కళాశాల, పెద్దతండాలోని కేజీబీవీ విద్యాలయం, కరుణగిరి సమీపంలోని హార్వెస్టు..స్ప్రింగ్స్ పాఠశాల, కరుణగిరిలోని కారుణ్య విద్యాభవన్, ఆరెంపులలోని సెయింట్ లారెన్స్ బీఈడీ కళాశాల మొత్తం పది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలలో ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

కుల గణన జరగకపోవడం వల్ల బీసీలకు నష్టం

బీసీ కమిషన్ చైర్మెన్‌కు వినతి

నవతెలంగాణ- కల్లూరు

కులగణన జరగకపోవడం వల్ల బీసీలు రాజ్యాధికారంలో వాటాను నష్టపోతున్నారని ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన బీసీ కులాల ప్రజాభిప్రాయ సేకరణలో కార్యక్రమంలో భాగంగా బీసీ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా తరఫున ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగనబోయిన పుల్లారావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాల్సిన అవసరం ఎంత ఉందని, అది జరగపోవటం వల్లే బీసీ సమాజంలో రాజ్యాధికారంలో వాటా రాకుండా పోతుందన్నారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు వారి జనాభా ప్రకారం అందిననాడే సమ సమాజం స్థాపన జరుగుతుందని, స్వాతంత్ర ఫలాలు అందరికీ అందుతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నల్లమాస సుగుణ, ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్ గద్దె వెంకటరామయ్య, కేతనబోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన దయాకర్ రెడ్డి

నవతెలంగాణ-ముదిగొండ



మండల పరిధిలోని పమ్మి గ్రామంలో ఆదివారం జరిగిన సురగాని గోపి, మంజుల వివాహానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయం ఇన్చార్జ్ తంబూరి దయాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులు గోపి, మంజులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కోట రాంబాబు, మండల నాయకులు చిన్నపంగు రంజిత్, పంజాల రాజేష్, కందుల రంగారావు, బెజవాడ వంశీ, జూలకంటి సంజీవరెడ్డి, ఏలూరి హనుమంతరావు, దేవరపల్లి అనంతరెడ్డి, వధూవరుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

జలగంనగర్ పాఠశాల విద్యార్థిని ప్రతిభ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గణితంలో ప్రతిభను పరీక్షించేందుకు సదిశ ఫౌండేషన్ వారు ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో మండల పరిధిలోని జలగంనగర్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినీ పి.వెన్నెల ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంసన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.సదిశ ఫౌండేషన్ వారు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచి అర్హత సాధించిన వారికి ఇంటర్మీడియట్ విద్యార్థులు కోరుకున్న కార్పొరేట్ కళాశాలలో ప్రవేశాలు కల్పించి వారికి విద్యతో పాటుగా వసతి సౌకర్యాలకు కూడా ఫౌండేషన్ ఖర్చును భరిస్తుందని వివరించారు. దీంతో విద్యార్థులకు రెండేళ్లపాటు ఉచిత విద్య ఉచిత వసతి సౌకర్యం ఉంటుందన్నారు. సదిశ ఫౌండేషన్ వారు నిర్వహించిన పరీక్షలో ప్రతిభ చూసిన విద్యార్థిని వెన్నెలను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా అభివృద్ధి చెందాలి

నవతెలంగాణ-కొణిజర్ల

ఆర్యవైశ్యులు రాజకీయంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని బొట్లకుంట గ్రామ సమీపంలో ఆర్యవైశ్య మన సమారాధన కార్యక్రమం ఆదివారం ఘనంగా మండల ఆర్యవైశ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యతిదిగా హజరైన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు మంచి తనానికి మారుపేరన్నారు. అనంతరం ఎమ్మెల్యేని ఆర్యవైశ్యులు సన్మానించారు. ఆర్యవైశ్యులంతా కుటుంబ సమేతంగా సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వనసమారాధన సందర్భంగా మహిళలకు ఆటలు, మ్యాజిక్ షో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు , వడ్డే నారాయణరావు, సూరంపల్లి రామారావు, ఆర్యవైశ్య మండల అధ్యక్ష కార్యదర్శి జిల్లా నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్, కొనతం శ్రీనివాస్, అనుమోలు కృష్ణప్రసాద్, జవ్వాజి నాగేశ్వరరావు, చోడవరపు నరసింహారావు, పసుమర్తి సత్యం పాల్గొన్నారు.



19న కొత్తగూడెం డిపో ఎదుట ధర్నా

నవతెలంగాణ-కొత్తగూడెం

టిజి ఆర్టీసీలో నెల కొన్న సమస్యలు, కార్మికుల సమస్యలు పరిష్క రించాలని, ఇరత సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న కొత్తగూడెం డిపో ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటియూ నాయకులు కొత్తగూడెం డిపో ముందు ఆదివారం ఉదయం కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఆర్టీసీలో, కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని, ఆర్టీసీ సంస్థలో తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న కొత్తగూడెం డిపో ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కార్మికులను కోరారు. కొత్తగూడెం డిపో ఎదుట కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, జిల్లా నాయకులు లిక్కి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



నూతన రియాన్ చికెన్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు మండలం సమితి సింగారం పంచాయతీ పరిధిలోని రైల్వే గేట్ సమీపంలో ఎండి.సెలవుదిన్ స్థాపించిన నూతన రియాన్ చికెన్ సెంటర్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం ప్రారంభించారు. అనంతరం రియాన్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే పాయంని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రియాన్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మణుగూరు మండల అధ్యక్షులు పిరినకి నవీన్, పార్టీ మండల నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక ఆర్థో సేవలతో...

నేడు టీఆర్‌ఆర్ హాస్పిటల్ ప్రారంభం

- పాత ఆరోగ్య హాస్పిటల్‌లో డాక్టర్ తోట లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు ఆరోగ్యశ్రీ సౌకర్యంతో ఆర్థో, యాక్సిడెంట్ కేర్ యూనిట్
- ప్రారంభించనున్న మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి
- తమ కుమారుడు, అల్లున్ని దీవించాలని కోరిన మాజీ కార్పొరేటర్లు, కార్పొరేటర్లు తోట రామారావు- గోవిందమ్మ, శీలంశెట్టి వీరభద్రం- రమ

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



అత్యాధునిక ఆర్థో సౌకర్యాలతో ఖమ్మంలోని వైరారోడ్డు పాత ఆరోగ్య హాస్పిటల్ భవనంలో టీఆర్‌ఆర్ ఆర్థో, యాక్సిడెంట్ కేర్ యూనిట్ సోమవారం ప్రారంభం కానున్నట్లు హాస్పిటల్ వైద్యులు డాక్టర్ తోట లక్ష్మణ్‌కుమార్, ఆయన తల్లిదండ్రులు, అత్తమామలు(ప్రస్తుత/ మాజీ కార్పొరేటర్లు) తోట గోవిందమ్మ- రామారావు, శీలంశెట్టి రమ-వీరభద్రం తెలిపారు. స్థానిక 48వ డివిజన్ మినీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో లక్ష్మణ్‌కుమార్ నాలుగైదేళ్లకు పైగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రింగ్ రీ కన్‌స్ట్రక్షన్ సర్జరీలో తన ప్రత్యేకతను చాటుతున్నారని అన్నారు. ఖమ్మంలోని ఓ ప్రఖ్యాత ఆర్థోపెడిక్ క్రిటికల్ కేర్ హాస్పిటల్‌తో పాటు ప్రభుత్వ వైద్యశాలలో లక్ష్మణ్ 4వేలకు పైగా సర్జరీలను విజయవంతంగా నిర్వహించినట్లు వివరించారు. ఇప్పటికే ఆర్థో విభాగంలో తనకంటూ ఓ ప్రత్యేక పేరు సాధించుకున్న లక్ష్మణ్‌కుమార్‌ను దీవించాల్సిందిగా తల్లిదండ్రులు, అత్తమామలు కోరారు. తమలాగే సామాజిక స్పృహ, నిరుపేదలకు సహాయం చేయాలనే తలంపుతో ముందుకెళ్తున్న తమ పిల్లవాడు లక్ష్మణ్ ఇప్పటికే అనేక మందికి ఉచితంగా వైద్య సేవలు అందించారని, మొన్నటి వరదల్లోనూ తనవంతు సహాయ సహకారాలు అందించినట్లు చెప్పారు. టీఆర్‌ఆర్ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ సేవలు సైతం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రజల కోసం సేవా భావంతో పనిచేస్తానని, తమ ప్రాంత ప్రజానీకానికి తక్కువ ఫీజుతో ఆధునిక వైద్యసేవలు అందించేందుకు సిద్ధమని లక్ష్మణ్‌కుమార్ ప్రకటించారు.

నేడు హాస్పిటల్ ప్రారంభం

పాత ఆరోగ్య హాస్పిటల్ భవనంలో ఏర్పాటు చేసిన టీఆర్‌ఆర్ ఆర్థో, యాక్సిడెంట్ కేర్ యూనిట్‌ను ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు రేణుకాచౌదరి, రామసహాయం రఘురాంరెడ్డి, బీఆర్‌ఎస్ రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు హాజరుకానున్నట్లు వివరించారు.

నూర్ భాషా దూదేకులకి మైనార్టీ స్టేటస్ కల్పించాలని వినతి

నవతెలంగాణ- ఖమ్మం

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వచ్చిన తెలంగాణ వెనుకబడిన తరగతుల చైర్మన్ భూసాని వెంకటేశ్వర్లకు నూర్ భాషా దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ బాషా ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూర్ భాషా దూదేకులకి మైనార్టీ స్టేటస్ కల్పించాలని, ఆర్థికంగా, సామాజికపరంగా, సాంస్కృతపరంగా అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని, బీసీ-ఈకి చట్టబద్ధత కల్పిస్తూ తమకు కూడ బిసి-ఈ స్థానం కలిపించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ రహీం, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ లాలు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జానీ బేగం, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ షకీనా బి, ఖమ్మం జిల్లా అధ్యక్షులు షేక్ రహీం భాష, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సిద్దు బాషా, ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు షేక్ సాయిబు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ- ఖమ్మం కార్పొరేషన్

రాష్ట్రంలోని బీసీ కులస్తుల సమస్యలు పరిష్కరించాలని ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ కోరారు. ఈ మేరకు ఆదివారం జిల్లాలో పర్యటించిన బీసీ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర రావుకు వినతి పత్రం అందజేశారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొత్తా సీతారాములు, మాటేటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాములేరులో విహరించిన 'విశ్వశాంతి' విద్యార్థులు

- ఆటాపాటలతో సందడితో ఖుషీచేస్తూ విహారం

నవతెలంగాణ-సత్తుపల్లి



నిత్యం పాఠశాలలో అవే పుస్తకాలు, వాటితో కుస్తీపడుతూ... నీరసించే ఆ విద్యార్థులకు ఒకరోజైనా ఆటవిడుపుగా అలా బయట ప్రపంచానికి తీసికెళ్లి తిప్పితీసుకొస్తే ఆ సంతోషం, ఆ ఉల్లాసం, ఆ ఉత్సాహం వేరేలా ఉంటుంది. ఆ ఒక్కరోజు ఆ చిన్నారులు దారం తెగిన గాలిపటంలా మారి ప్రకృతి అందాలను చూసి పరవసిస్తూ, జలపాతాల్లో మునుగుతూ, తేలుతూ అనుభవించిన ఆ సంతోషం కొన్నాళ్లపాటు అలా మదిలో గుర్తిండి పోతుంది. ఆ సంతోషంలోనే మాస్టార్లు ఏది చెప్పినా బుద్ధిగా చదివి తిరిగి అప్పజెబుతూ హుషారుగా ఉంటారు. అందుకేనేమో పాఠశాలల యాజమాన్యాలు ఏడాదిలో ఓసారి అలా పిల్లలను విహారయాత్ర (పిక్‌నిక్) పేరుతో సుందర ప్రదేశాలకు తీసుకెళ్లి ఆ రోజంతా వారు ఏం చేసినా తిట్టక, కొట్టక వారిని ఆ ఒక్కరోజు స్వేచ్ఛాజీవులుగా విహరింపజేస్తారు. ఈ నేపథ్యంలోనే సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యార్థులను ఆ పాఠశాల యాజమాన్యం భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ సమీపంలోని సురక్షిత ప్రాంతమైన పాములేరుకు విహారయాత్రకు తీసుకెళ్లింది. ఇరువైపులా చెట్లతో వెడల్పైన ఆ వాగులో రెండు అడుగుల లోతున్న స్వచ్ఛమైన నీటిలో విశాలంగా ఉన్న ఆ పాములేరులో విద్యార్థులు సందడి చేశారు. నీళ్లలో మునుగుతూ, తేలుతూ, ఇసుకలో పిచ్చుకగూళ్లు కడుతూ, చెట్ల చెంతన ఆటాపాటలతో ఉత్సాహంగా విహరించారు. పారుతున్న వాగునీటిలో వాలీబాల్, కబడ్డీ, పరుగుపందేలు, కుప్పిగంతులాట, ఒంగుదూకుళ్ల ఆటలాడుతూ జలపాతంలో విహరించారు. ఈ విహారయాత్ర పాఠశాల యాజమాన్య బాధ్యులు పసుపులేటి నాగేశ్వరరావు, నరుకుళ్ల సత్యనారాయణ, పసుపులేటి అవినాశ్ ఆధ్వర్యంలో విజయవంతంగా ముగించుకొని పిల్లలను సురక్షితంగా తీసుకొచ్చారు.

శిథిలావస్థకు చేరిన కల్వర్టు

- విరిగిపోయిన సైడ్ వాల్స్
- ప్రమాదకరమైన కల్వర్టుపై ప్రయాణాలు
- పట్టించుకోని అధికారులు
- డబల్ రోడ్డుగా విస్తరణ చేయాలని డిమాండ్

నవతెలంగాణ-ఎర్రుపాలెం



నాగార్జున సాగర్ కాలువపై దశాబ్ద కాలం నాడు నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరి ఎప్పుడు పడిపోతుందానని బిక్కుబిక్కుమంటూ వందలాది వాహనాలు ప్రమా దకరమైన కల్వర్టుపైన ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని నరసింహాపురం గ్రామ సమీపంలో మైలవరం మేజర్ నుండి సాగర్ జలాలు ప్రవహించే కాలువ పైన గత దశాబ్ద కాలం నాడు నిర్మించిన కల్వర్టు పడిపోవడానికి సిద్ధంగా ఉందని ప్రాణాలు అరి చేతులలో పెట్టుకుని ప్రయాణాలు కొనసాగిస్తున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి ప్రవేశించేందుకు అతి ప్రాధాన్యత కలిగిన రోడ్డు మార్గమైన కల్వర్టుకు ఇరువైపులా గల సైడ్ వాల్సు విరిగిపోయి ప్రమాదం ఎప్పుడు సంభవిస్తుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటున్నట్లు తెలిపారు. మధిర వయా బనిగండ్లపాడు బుచ్చిరెడ్డిపాలెం నరసింహపురం గ్రామాల ద్వారా మైలవరం వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి ప్రవేశించే ప్రధానమైన రోడ్డు మార్గం ఇది కావడంతో ఈ రోడ్డు మార్గంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మదిర డిపోకి సంబంధించిన పల్లె వెలుగు బస్సులు ప్రయాణికులతో కిటకిట లాడుతూ నిత్యం ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. లారీలు, ఆటోలు, వందలాది టూ వీలర్స్ వాహనాలు ప్రయాణం కొనసాగిస్తుంటారు. కల్వర్టుకు ఇరువైపులా గల సైడ్ వాల్స్ విరిగి పోవడంతో కొత్త వారు ఈ రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించే సమయంలో తెలియక నాగార్జున సాగర్ కాలువలో పడి పోవడానికి ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రోడ్డు మార్గంలో పడిపోవడానికి సిద్ధంగా ఉన్న కల్వర్టును తొలగించి నూతన కల్వర్టును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కోట్ల రూపాయల నిధులతో ఎర్రుపాలెం మండలంలో గల రోడ్లు విస్తరణ పనులు చేపట్టారు. బనిగండ్లపాడు నుండి బుచ్చిరెడ్డిపాలెం వయా నరసింహపురం తెలంగాణ సరిహద్దు వరకు సింగల్ రోడ్డును డబల్ రోడ్డుగా విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు. కల్వర్టు కూలిపోయి భారీ ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు చేసి విస్తరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తుపాకులతో బెదిరిస్తున్న ఇద్దరు అరెస్టు

మావోయిస్టుల పేరుతో బెదిరింపులు
మూడు పిస్టల్స్, 17 బుల్లెట్లు, 4 మాగ్జిన్లు, ఓ బైక్ స్వాధీనం
పట్టుకున్న ఖమ్మం త్రీటౌన్ పోలీసులు...
విలేకరుల సమావేశంలో సీపీ సునీల్‌దత్

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో నష్టపోయిన ఇరువురు నకిలీ మావోయిస్టుల అవతారం ఎత్తారు..ఆ ఇద్దరూ తుపాకులతో పలువురిని బెదిరిస్తూ దాడులకు పాల్పడుతున్నారు. ఖమ్మం త్రీటౌన్ పోలీసులకు ప్రకాశ్‌నగర్ వద్ద వాహన తనిఖీలో భాగంగా ఆదివారం చిక్కారని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ వివరించారు. ఈ మేరకు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. ఖమ్మం కస్బాబజార్‌కు చెందిన రియల్‌ఎస్టేట్/ ఎలక్ట్రానిక్ గూడ్స్ వ్యాపారి మహమ్మద్ అఫ్సర్ (50), మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన గుండమళ్ల వెంకటేశ్వర్లు (జీవీ) కొన్ని సంవత్సరాల క్రితం వరకు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసి నష్టపోయారు. అప్పులపాలైన వీరిద్దరూ వాటిని తీర్చేందుకు నకిలీ మావోయిస్టులుగా అవతారం ఎత్తారు. ల్యాండ్ సెటిల్మెంట్లు చేస్తూ బెదిరింపులకు దిగుతున్నారు. ఈ క్రమంలో వీరిద్దరిపై మహబూబాబాద్, గార్ల, మరిపెడ, కేసముద్రం స్టేషన్‌లలోనూ కేసులు నమోదయ్యాయి. 11 నెలల క్రితం ఎండీ రియాజ్ అనే వ్యక్తిని సంప్రదించి ఆయన ద్వారా బీహార్ నుంచి మూడు పిస్టల్స్, నాలుగు మ్యాగ్జిన్లు, 17 బుల్లెట్లు తెప్పించారు. వాటి సహాయంతో బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీనిలో భాగంగా ఆదివారం ముదిగొండ మండలంలోని గ్రానైట్ వ్యాపారులను బెదిరించేందుకు బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో ప్రకాశ్‌నగర్ వద్ద ఖమ్మం త్రీటౌన్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీసులను చూసి బైక్‌ను వదిలివేసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి సంబంధిత మారుణాయుధాలు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. వీరికి ఆయుధాలు సరఫరా చేసిన ఎండీ రియాజ్ పైనా ఇప్పటికే ఖమ్మం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఆర్మ్స్ యాక్ట్‌తో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదై ఉంది. ప్రస్తుతం రియాజ్ పరారీలో ఉన్నాడని సీపీ వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఖమ్మం ఏసీపీ రమణమూర్తితో పాటు త్రీటౌన్ సీఐ రమేష్, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా మావోయిస్టులతో సహా ఐదుగురు మృతి

- ధృవీకరించిన కాంకేర్ జిల్లా ఎస్పీ ఐకె ఎలిసెలా

నవతెలంగాణ-చర్ల



ఛత్తీస్‌గఢ్‌లోని కంకేర్, నారాయణపూర్ సరిహద్దుల్లో శనివారం ఉదయం నుంచి భద్రతా బలగాలకు మావోయిస్టులకు మధ్య భీకర ఎన్‌కౌంటర్ ఉదయం 8 గంటల నుంచి ఆగాగి జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా మావోయిస్టులతో సహా ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టుల శిబిరం నుంచి భారీ మొత్తంలో ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. జవాన్ల దాడితో భయాందోళనకు గురైన మావోయిస్టులు చెల్లాచెదురయ్యారు. వారి ఆచూకీ కోసం ఇంకా ఆపరేషన్ కొనసాగుతోంది. దాదాపు 2 గంటల వరకు కొనసాగిన కాల్పుల అనంతరం సైనికులు మావోయిస్టుల కోసం అడవిని జల్లెడ పట్టగా ఐదు మృతదేహాలతో పాటు ఒక ఎస్ఎల్ఆర్, ఒక ఐఎన్ఎస్ ఏఎస్ తుప్పకులతోపాటు 12 బోర్ మూడు తుపాకులు ఒక బిజిఎల్ పోలీసులు ఘటనా స్థలం నుంచి స్వాధీనపరుచుకున్నారు. కంకేర్ డి ఆర్‌జి నారాయణపూర్ డిఆర్‌జిబి ఎస్ఎఫ్ఎస్‌టిఎఫ్ సంయుక్త బృందం మావోయిస్టులను నిర్మూలనలో నిమగ్నమై నిర్వహిస్తుండగా ఉదయం 8 గంటలకు మావోయిస్టులు కంకేర్ డిఆర్‌జి బృందాన్ని ఎదుర్కొన్నారు. ఇందులో ఐదుగురు నక్సలైట్లను సైనికులు హతమార్చారు. ఈ ఎన్‌కౌంటర్‌లో డిఆర్‌జి, బస్తర్ బెటాలియన్‌కు చెందిన ఇద్దరు సైనికులు గాయపడ్డారు. వారిని విమానంలో రాయ్‌పూర్‌కు తరలించారు. శనివారం రాత్రంతా ఆపరేషన్ కొనసాగింది. అన్ని వైపుల నుండి బలగాలు ముట్టడి చేసినట్లు చెబుతున్నారు. తద్వారా మావోయిస్టులు ఎటువైపు నుంచి తప్పించుకోలేక పోయారు. ఈ కారణంగానే ఫోర్స్ సిబ్బంది ఆదివారం రాత్రి కూడా అడవిలో గడపనున్నారు. రాత్రంతా మావోయిస్టుల కోసం వెతకడానికి ఆపరేషన్ కొనసాగుతుంది. మావోయిస్టుల అత్యంత సురక్షితమైన ప్రాంతం ఇప్పుడు వారికి డేంజర్ జోన్‌గా మారిందని మాడ్ ప్రాంతంలో సైనికుల నిరంతర విజయాన్ని బట్టి స్పష్టమవుతోందని ఎస్పీ ఐకె ఎలిసెలా తెలిపారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-పినపాక




చినపాక మండల పరిధిలోని వెంకటేశ్వరపురం గ్రామంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాలతో శరవేగంగా రహదారి పనులు ప్రారంభమయ్యాయి. జగ్గారం గ్రామపంచాయతీ వెంకటేశ్వరపురంలో ప్రధాన రహదారి నుంచి ప్రభుత్వ ధాన్యం కొనుగోలు గౌడమ్ వరకు రహదారి సరిగా లేక ఎన్నో ఏండ్లుగా రైతులు, స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక గిరిజన సంఘం నాయకులు గొగ్గల రామకృష్ణ దొర, స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లారు. ఇటీవల పంచాయతీలో పర్యటించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు స్థానిక ప్రజలు తమ సమస్యను తెలపడంతో వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు ఆదివారం రోడ్డు పనులను ప్రారంభించారు. సరైన రహదారి లేక ఇబ్బంది పడ్డ తమ సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యేకు పాయంకు స్థానిక ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు గొగ్గల రామకృష్ణ దొర, కాయం జగపతిరావు, వేముల శ్రీనివాసరావు, గుండారపు నారాయణ, చిన్ని కృష్ణ, గుంటుపల్లి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థులకు హాస్టల్ భవనాలు నిర్మించాలి

- ఎమ్మెల్యే పాయంకి ఓయూ విద్యార్థులు వినతి

నవతెలంగాణ-మణుగూరు



హైదరాబాదు నగరంలో చదువుతున్న ఆదివాసీ విద్యార్థులకు హాస్టల్ భవనాలు నిర్మించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం ఏఎస్ యు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాగబోయిన పాపారావు డిమాండ్ చేశారు. ఆదివారం ఓయూ విద్యార్థుల నాయకుల ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించేందుకు హైదరాబాదు నగరానికి వెళ్లిన ఆదివాసీ విద్యార్థులు నివాస గృహాలు లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని, నాగోల్ లో ఉన్న బాలుర హాస్టల్ అద్దె భవనం ఇరుకు గదులతో ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. అడిక్మెట్‌లో ఉన్న బాలికల హాస్టల్ విద్యార్థుల సంఖ్య పెరిగిపోవడంతో తక్షణమే ఖాళీగా ఉన్న స్థలంలో నూతన భవనాన్ని నిర్మాణానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పాయంని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హైదరాబాదులో పోటీ పరీక్షల తోపాటు ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ఆదివాసి విద్యార్థుల వసతి గృహాల ఏర్పాటు విషయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరేం అరుణ్ కుమార్, ఉపాధ్యక్షులు గౌరీ వేణి ప్రవీణ్, సోడే నవీన్‌కుమార్, నాయకులు కొమరం ప్రకాష్, వంశీ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ

- మాయగాళ్ల మాటలు నమ్మి మోసపోకండి : నిరుద్యోగులకు మంత్రి దామోదర రాజనర్సింహ సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వారి మాటలు నమ్మి మోసపోవద్దని ఆ శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ నిరుద్యోగులకు సూచించారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతున్నదని స్పష్టం చేశారు. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 11 నెలల్లోనే 7 వేల పైచిలుకు పోస్టులను భర్తీ చేశామని మంత్రి గుర్తు చేశారు. మరో 2,322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు, 732 ఫార్మాసిస్ట్ (గ్రేడ్ 2) పోస్టులు, 1,284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు, 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, 156 ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు, 45 అసిస్టెంట్ ప్రొఫెసర్(ఎంఎన్‌జె) పోస్టులు, 24 ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భవిష్యత్తులో మరిన్ని పోస్టులకు నోటిఫికేషన్లు వస్తాయని తెలిపారు. విద్యార్హతలు, రాతపరీక్షలు ఇతర నిబంధన ప్రకారం పారదర్శకంగా ఈ పోస్టుల భర్తీ జరుగుతున్నదని చెప్పారు. ఉద్యోగాలు ఇప్పిస్తామనే దళారులుంటే మోసపోకుండా అలాంటి వారి సమాచారాన్ని పోలీసులకు ఇచ్చి, వారిపై ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు మోసగాళ్ల సమాచారాన్ని అందజేయాలని కోరారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసేవారిపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి హెచ్చరించారు.

కాలం చెల్లిన మందులు

- తప్పుడు ప్రకటనలతో మోసం
- డీసీఏ దాడుల్లో బయటపడుతున్న మోసాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డ్రగ్ కంట్రోల్ అధికారులు రాష్ట్రంలో ఏదో ఒక చోట ప్రతి రోజు దాడులు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిర్వహిస్తున్న దాడుల్లో పలు రకాల మోసాలు బయటపడుతున్నాయి. తాజాగా సికింద్రాబాద్ సీతాఫల్ మండిలోని గాయత్రి మెడికల్, జనరల్ స్టోర్స్‌పై నిర్వహించిన దాడుల్లో కాలం చెల్లిన మందులను నిల్వ ఉంచినట్టు కనుగొన్నారు. వీటితో పాటు అనుమతి లేకుండా అబార్షన్ కిట్లు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. రూ. 1.25 లక్షల విలువైన నిల్వలను సీజ్ చేశారు. నమూనాలను పరీక్షలు పంపించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉప్పల్ రామాంతపూర్‌లోని మెడికల్ స్టోర్‌లో కంటి వైద్యానికి పని చేస్తుందంటే అమ్మకానికి పెట్టిన క్లోరోమ్ ఫెనికోల్ పి.డి.కోల్ ఐ ఆయింట్‌మెట్ (మధ్యప్రదేశ్ లోని ఇండర్ కు చెందిన ప్యాక్ సుల్స్ దీన్ని తయారు చేస్తున్నది) సీజ్ చేశారు. ఒక రోగాన్ని నయం చేస్తుందని తప్పుడు ప్రకటనలు ఇస్తే డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (ఆబ్జెక్షనబుల్ అడ్వర్టైజ్మెంట్) యాక్ట్, 1954, ప్రకారం శిక్షార్హులని డీసీఏ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

హెజ్‌బొల్లాకు కీలక ప్రతినిధి హతం


(ఫైల్)

లెబనాన్ : లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో హెజ్‌బొల్లా ప్రధాన ప్రతినిధి మహమ్మద్ అఫీఫ్ మృతి చెందినట్టు సంబంధిత వర్గాలు ఒక వార్తాసంస్థకు వెల్లడించాయి. ఇటీవలి కాలంలో సెంట్రల్ బీరుట్‌పై టెల్‌అవీవ్ సేనలు దాడి చేయటం ఇదే మొదటిసారి. మరోవైపు.. గాజాలో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 12 మంది మరణించినట్టు పాలస్తీనా వైద్యాధికారులు తెలిపారు. మహమ్మద్ అఫీఫ్ అనేక ఏండ్లుగా హెజ్‌బొల్లా మీడియా వ్యవహారాల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవలి కాలంలో హెజ్‌బొల్లాపై ఇజ్రాయెల్ తన దాడులను తీవ్రతరం చేయడం, సంస్థ అధిపతి హసన్ నస్రల్లాను హతమార్చడం వంటి పరిణామాల అనంతరం బాహ్యప్రపంచంలో ఎక్కువగా కనిపించారు. మిలిటెంట్లకు బలమైన స్థావరంగా ఉన్న బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలపైనా ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు విరుచుకుపడ్డాయి. లెబనాన్ అధికారులు అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ప్రతిపాదనను పరిశీలిస్తున్న వేళ ఈ దాడులు చోటుచేసుకున్నాయి.

ఆప్ మంత్రి కైలాశ్ గెహ్లాట్ రాజీనామా

న్యూఢిల్లీ : ఆప్ మంత్రి, సీనియర్ నేత కైలాశ్ గెహ్లాట్ ఆదివారం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. కైలాష్ గెహ్లాట్ ప్రస్తుతం ఆప్ ప్రభుత్వంలో హోం, రవాణా, ఐటీ, మహిళలు, శిశుసంక్షేమ శాఖలతో పాటు కీలకమైన మంత్రిత్వ శాఖల బాధ్యతలను నిర్వహిస్తున్నారు. బీజేపీలో చేరే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్‌కు తన రాజీనామా లేఖను పంపారు. ఆప్ పార్టీ తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోందని, హామీలను నెరవేర్చడంలో విఫలమైందని లేఖలో ఆరోపించారు.

మాది సెక్యులర్ పార్టీ

- ఫడ్నవీస్ వ్యాఖ్యలపై ఖర్గే కౌంటర్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ అని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వ్యాఖ్యానించారు. సిద్ధాంతాలు, సమస్యలు, రాజ్యాంగం ఆధారంగానే తమ పార్టీ ఓట్ల కోసం విజ్ఞప్తి చేస్తుందని అన్నారు. ప్రతిపక్షాలు 'ఓటు జిహాద్' సృష్టిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై ఖర్గే ఆదివారం ఘాటుగా స్పందించారు.

తమ పార్టీ రాజ్యాంగాన్ని విశ్వసిస్తుందని అన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్నట్లుగా కులం, విద్య, మతం, వర్ణం, వర్గం మరియు ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా 18సంవత్సరాల వయస్సు నుండి మరణించే వరకు ప్రతి ఒక్కరికీ ఓటు వేసే హక్కు ఉందని అన్నారు. తమ పార్టీ సిద్ధాంతం లౌకికవాదమని, తాము వారిలా (బీజేపీ) గొడవలు సృష్టించమని, దుష్ప్రచారాలు చేయమని, రాజ్యాంగం ప్రకారం ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నామని ఖర్గే పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) నోటీసుపై స్పందిస్తూ.. నోటీసును స్వాగతిస్తున్నామని అన్నారు. నవంబర్ 18లోగా సమాధానం పంపిస్తామని అన్నారు.

దేవేంద్ర ఫడ్నవీస్ వ్యాఖ్యలపై ఎన్‌సీపీ చీఫ్ శరద్ పవార్ కూడా స్పందించారు. " రైతుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సోయాబీన్, పత్తిధరలు పడిపోతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.విద్యాసంస్థలు పెరుగుతున్నాయి, యువత చదువుకుంటున్నారు కానీ ఉద్యోగాలు లేవు. మహారాష్ట్రలో ఇటువంటి సమస్యలు చాలా ఉన్నాయి. వాటన్నింటినీ పక్కదోవ పట్టిస్తూ.. ఫడ్నవీస్ ఓటు జీహాద్ అనే పదాన్ని ఉపయోగించి మతపరమైన విభేదాలు సృష్టించేందుకు యత్నిస్తున్నారు" అని పవార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

288 స్థానాలు కలిగిన మహారాష్ట్ర అసెంబ్లీకి నవంబర్ 20 ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 23న కౌంటింగ్ జరగనుంది.

ఢిల్లీలో స్టేజ్-4ఆంక్షలు..

పాఠశాలలన్నీ మూసివేత.. ట్రక్కులకు నో ఎంట్రీ



న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరం ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకీ క్షీణిస్తోంది. వాయు కాలుష్యం స్థాయిలు పెరగడంపై ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ (సీఏక్యూఎం) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే పలు ఆంక్షలు విధించగా.. తాజాగా మరిన్ని కఠిన ఆంక్షలు అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ)-4' కింద మరిన్ని నిబంధనలను సోమవారం ఉదయం 8గంటల నుంచి అమలు చేయనున్నట్టు తెలిపింది. ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ రాత్రి 7గంటల సమయానికి 457కి పెరగడం గమనార్హం. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఢిల్లీలోని పాఠశాలల్లో కేవలం ఆన్‌లైన్ తరగతులే నిర్వహించనున్నట్టు సీఎం ఆతిశీ ప్రకటించారు.

ఢిల్లీలోకి ట్రక్కుల (నిత్యావసర వస్తువులు, సర్వీసులు అందించే ట్రక్కులు మినహా)కు ప్రవేశాన్ని నిలిపివేయాలని సీఏక్యూఎం ఆదేశించింది. ఎల్ఎన్‌జీ, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్, బీఎస్-4 డీజిల్ ట్రక్కులు మాత్రమే అనుమతించింది.

ఎలక్ట్రిక్, సీఎన్‌జీ, బీఎస్-4 వాహనాలు మినహా ఢిల్లీ వెలుపల రిజిస్ట్రేషన్‌తో ఉన్న తేలికపాటి కమర్షియల్ వెహికల్స్ ప్రవేశంపై నిషేధం. ఢిల్లీ రిజిస్ట్రేషన్‌తో ఉన్నప్పటికీ బీఎస్-4 అంతకన్నా పాత డీజిల్ రవాణా వాహనాల ప్రవేశంపై నిషేధిస్తున్నట్టు ప్రకటించింది.

అన్ని నిర్మాణ సంబంధిత కార్యకలాపాలను తాత్కాలికంగా నిలుపుదలపై ఆదేశాలు. హైవేలు, రోడ్లు, ఫ్లైఓవర్ వంతెనలు, పవర్ లైన్‌లు, పైపులైన్‌లు.. ఇలా నిర్మాణ సంబంధిత ప్రాజెక్టులను నిలిపివేయాలని సూచించింది.

ఇప్పటికే 1 నుంచి ఐదో తరగతి వరకు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించాలని సూచించగా.. తాజాగా 6 నుంచి 9, 11 తరగతుల విద్యార్థులకు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని కమిషన్ సూచించింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ సీఎం ఆతిశీ కీలక నిర్ణయం తీసుకున్నారు. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు అన్ని పాఠశాలలకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. జీఆర్‌ఏపీ-4 ఆంక్షల ప్రకారం 11-12 తరగతులు మినహా మిగతా విద్యార్థులందరికీ వ్యక్తిగత తరగతులు నిలిపివేయనున్నట్టు తెలిపారు. దీంతో స్కూళ్లన్నీ తాత్కాలికంగా మూతపడనున్నాయి.



ఎన్‌సీఆర్ ప్రాంతంలో కార్యాలయాలన్నీ 50శాతం సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని, మిగతా వారికి వర్క్‌ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని సిఫారసు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సైతం వర్క్ ఫ్రమ్ హోమ్ ఆప్షన్ ఇవ్వొచ్చని సూచన చేసింది.

రాష్ట్ర ప్రభుత్వాలు కళాశాలలను మూసివేయడంతో పాటు సరి-బేసి వాహన నిబంధనలు అమలు చేయడంపై నిర్ణయం తీసుకోవాలని ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ (సీఏక్యూఎం) సూచన.

డెంగ్యూతో 400 మందికి పైగా మృతి ..



ధాకా : గత కొంతకాలంగా డెంగ్యూని నియంత్రించేందుకు బంగ్లాదేశ్ పోరాడుతోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, సుదీర్ఘకాలం కొనసాగుతున్న వర్షాకాలం అంటువ్యాధుల పెరుగుదలకు కారణమౌతోంది. ఇప్పటివరకు 400 మందికి పైగా మరణించారు. ముఖ్యంగా పట్టణప్రాంతాల్లోని ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ ఏడాది సంబంధిత సమస్యలతో 407 మరణించగా, దేశవ్యాప్తంగా 78,595 మంది ఆస్పత్రుల్లో చేరినట్టు అధికారిక నివేదిక పేర్కొంది. నవంబర్ మధ్యనాటికి 4.173 మంది రోగులు చికిత్స పొందుతుండగా, వారిలో

- పరిస్థితి ఆందోళనకరం

1,835 మంది రాజధాని ఢాకాలోని ఆస్పత్రుల్లోనే ఉన్నారు. 2,338 మంది ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో ఉన్నారు.

"అక్టోబర్‌లో కూడా రుతుపవనాల తరహా వర్షపాతాన్ని చూస్తున్నాము. ఇది అసాధారణమైన పరిస్థితి" అని జహంగీర్‌నగర్ యూనివర్సిటీలోని జువాలజీ ప్రొఫెసర్ కబీరుల్ బషర్ పేర్కొన్నారు. వాతావరణ మార్పుల కారణంగా దోమల ఉధృతి అధికమైందని, వ్యాధి వ్యాప్తికి కారణమౌతున్నాయని అన్నారు. దేశవ్యాప్తంగా వ్యాధి పర్యవేక్షణకు, నియంత్రణకు తగిన చర్యలుచేపట్టాలని చెప్పారు. వ్యాధిని ముందుగానే గుర్తించగలిగితే డెంగ్యూ మరణాలను 1శాతం కంటే తక్కువకు తగ్గించవచ్చని సీనియర్ వైద్యులు పేర్కొన్నారు.డెంగ్యూ నియంత్రణకు ముందస్తు రోగ నిర్ధారణ, నివారణ కీలకమని అన్నారు. గతేడాది 1,705 మరణాలు నమోదుకాగా, 3,21,000 కంటే ఎక్కువ వ్యాధి కేసులు నమోదయ్యాయని అన్నారు. ఇప్పటికే వేలాది మంది బాధితులకు చికిత్స చేస్తున్నందున, వ్యాధివ్యాప్తి, పెరుగుదల తీవ్ర సంక్షోభంలో ఉన్న దేశ ఆరోగ్య వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని అన్నారు.

రహస్యంగా..

- మోజ్తాబాను తన వారసుడిగా ప్రకటించిన ఇరాన్ సుప్రీంలీడర్



టెహ్రాన్ : ఇరాన్‌లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఆ దేశ సుప్రీం లీడర్ ఆయాతుల్లా అలీ ఖమేనీ ఆరోగ్య పరిస్థితి విషమించినట్టు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఖమేనీ వారసుడిగా తన రెండో కుమారుడు మోజ్తాబా ఖమేనీని నియమించిన్నట్టు సమాచారం. అయితే, ఈ విషయాన్ని అత్యంత రహస్యంగా ఉంచాలని అక్కడి అధికారులకు హెచ్చరించినట్టు తెలిసింది. ఇజ్రాయెల్ మీడియాల్లో వచ్చిన వార్తల ప్రకారం.. 60 మంది అసెంబ్లీ సభ్యులతో సెప్టంబరు 26న ఖమేనీ సమావేశం నిర్వహించారు. ఆ సమయంలో మోజ్తాబాను తన వారసుడిగా నియమిస్తున్నట్టు చెప్పారు. ఆయన నిర్ణయంపై మొదట వ్యతిరేకత వ్యక్తమయినప్పటికీ ఆ తర్వాత ఏకగ్రీవంగా అంగీకరించినట్టు సమాచారం. మరోవైపు ఈ విషయాన్ని అత్యంత గోప్యంగా ఉంచాలని, లీక్‌లకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని అసెంబ్లీ సభ్యులను హెచ్చరించిన్నట్టు తెలిసింది. ఆ దేశంలో నెలకొన్న ఆందోళనకర పరిస్థితుల కారణంగా ప్రస్తుత ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ కారణంగానే మోజ్తాబా నియామకాన్ని రహస్యంగా ఉంచినట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. 1989లో రుహొల్లా ఖొమేనీ మృతి తర్వాత ఆ దేశ సుప్రీం లీడర్‌గా అలీ ఖమేనీ(85) బాధ్యతలు స్వీకరించారు. వాస్తవానికి ఆయన వారసుడిగా భావించిన ఇబ్రహీం రైసీ ఇటీవల హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన విషయం విదితమే.

ఉక్రెయిన్‌లో 'అంతర్గత పతనం' సంభావ్యం

- విదేశాంగ మాజీ మంత్రి



అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ కీవ్‌కు బేషరతుగా మద్దతునిచ్చే అవుట్‌గోయింగ్ అడ్మినిస్ట్రేషన్ విధానాన్ని మార్చటం జరిగితే ఉక్రెయిన్ లో పౌర అశాంతి, పూర్తి స్థాయి "పతనం" కూడా సంభవించే సంభావ్యత ఉంటుందని ఉక్రెయిన్ విదేశాంగ మాజీ మంత్రి డిమిత్రి కులేబా హెచ్చరించారు. నవంబర్ 5న ఎన్నికైన ట్రంప్ వాషింగ్టన్ ఆర్థిక, సైనిక సహాయాన్ని నిలిపివేస్తాడని, రష్యాతో అనుకూలమైన పరిష్కారాన్ని ఉక్రెయిన్ పై రుద్దుతాడనే భయాలను కీవ్‌లో ప్రేరేపించింది.

"డబ్బు అందకపోతే కొత్త డైనమిక్ అమలులోకి వస్తుంది. నిధులు లేకుంటే, ఉక్రెయిన్ పూర్తిగా భూమిని కోల్పోతుంది, "అని కులేబా బుధవారం ది ఎకనామిస్ట్ లో ప్రచురించిన ఆప్-ఎడ్‌లో రాశాడు. ఒక అననుకూల శాంతి ఒప్పందంపై సంతకం చేయమని అమెరికా బలవంతం చేస్తే ఉక్రెయిన్ అంతర్యుద్ధంలోకి కూరుకుపోతుందని ఆయన వాదించారు. "ట్రంప్ పరిపాలన ఉక్రెయిన్‌పై అసహ్యకరమైన శాంతి నిబంధనలను విధించినట్లయితే, అటువంటి శాంతిని మిస్టర్ జెలెన్స్కీ అంగీకరించినట్లయితే (అసంభవనీయమైన దృశ్యం), ఉక్రెనియన్ సమాజంలో కొంత భాగం ప్రతిఘటిస్తుంది. ఉక్రెయిన్ లో అంతర్గత అశాంతి దేశం అంతర్గత పతనానికి దారి తీస్తుంది, "అని కులేబా రాశారు.

"ఉక్రెయిన్‌ను విఫల రాజ్యంగా చిత్రీకరిస్తూ అతను చాలా కాలంగా కోరుకునే విజయాన్ని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు అందజేస్తుంది" అని కులేబా సూచించారు. ట్రంప్ "ఉక్రెయిన్ తన ఆఫ్ఘనిస్తాన్ లా మారడాన్ని భరించలేడు" అని హెచ్చరించారు. తన ఎన్నికల ప్రచారమంతా, నిబంధనలను పేర్కొనకుండా కీవ్, మాస్కో మధ్య శాంతి ఒప్పందానికి త్వరగా మధ్యవర్తిత్వం వహిస్తానని ట్రంప్ పేర్కొన్నారు. వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్‌తో టెలివిజన్ చర్చ సందర్భంగా, అతను ఉక్రెయిన్ గెలవాలని కోరుకుంటున్నారా? అనే ప్రశ్నకు నేరుగా సమాధానం ఇవ్వడానికి నిరాకరించారు. "యుద్ధం ఆగిపోవాలని నేను కోరుకుంటున్నాను" అని అతను ఆ సమయంలో చెప్పారు.

జూన్‌లో, ట్రంప్ సలహాదారులలో ఇద్దరు ప్రస్తుతమున్న పరిస్థితి ఆధారంగా కాల్పుల విరమణ కోసం ఒక ప్రణాళికను రూపొందించారని రాయిటర్స్ రాసింది. అయినప్పటికీ, ట్రంప్ ప్రచారం ఏదైనా నిర్దిష్ట ప్రతిపాదనలకు దూరంగా ఉంది. శాంతి ఒప్పందం ఉక్రెనియన్ నాయకుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ ప్రవచించిన 'శాంతి సూత్రం'పై మాత్రమే ఆధారపడి ఉంటుందని కీవ్ చాలా కాలంగా భావించింది. ఇందులో 1991నాటి ఉక్రెయిన్ సరిహద్దుల పునరుద్ధరణ ఉంటుంది. రష్యా ఈ నిబంధనలను హోల్‌సేల్‌గా తిరస్కరించింది. ఉక్రెయిన్ తటస్థ దేశంగా మారడానికి అనుకూలంగా నాటోలో చేరాలనే దాని ఆకాంక్షలను వదులుకోవాలని, రష్యాలో చేరడానికి ప్రజాభిప్రాయ సేకరణలలో ఓటు వేసిన క్రిమియా, ఇతర ప్రాంతాలపై తన వాదనలను త్యజించాలని పట్టుబట్టింది.

జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్‌తో శుక్రవారం ఫోన్‌లో మాట్లాడుతూ, రష్యా యొక్క భద్రతా సమస్యలను విస్మరించడంలో "నాటో దీర్ఘకాల దూకుడు విధానం యొక్క ప్రత్యక్ష ఫలితం" ఈ సంఘర్షణ అని పుతిన్ పునరుద్ఘాటించారు.

ఘన వ్యర్థాల నిర్వహణకు 2016 నిబంధనలు అమలు చేయాల్సిందే

- సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఘన వ్యర్థాల నిర్వహణపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2016 అమలులో ప్రభుత్వ ఏజెన్సీలన్నీ విఫలమయ్యాయంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. స్టేక్ హోల్డర్లందరితో సమావేశం ఏర్పాటు చేసి ఈ అంశంపై చర్చించాలని సీఎస్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీలో 2016 నాటి నిబంధనలు సక్రమంగా అమలు చేయడం కీలకమని చెప్పింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం ఈ నెల 11న జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అధికారులంతారూ సమస్య పరిష్కారంపై ఏకతాటిపైకి రాలేదని.. 2016 నాటి ఆదేశాల అమలుకు సంబంధించి గడువును చెప్పకపోతే.. తామే కఠినమైన ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగా కోర్టుకు నివేదిక సమర్పించాలని స్టేక్ హోల్డర్లను కోర్టు ఆదేశించింది. సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలను చెప్పేందుకు డిసెంబర్ 13 వరకు గడువు విధించింది. ఇతర కేసుల్లో మాదిరిగానే నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయని పేర్కొంది.

ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో నిబంధనలు అమలు చేయడంలో విఫలమైతే దేశంలోని ఇతర నగరాల్లో ఏం జరుగుతుందో ఊహించవచ్చని చెప్పింది. ఈ అంశంపై విచారణను డిసెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది. ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంలో కాలుష్యంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నది. ఈ సందర్భంగా ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ అంశం ప్రస్తావనకు వచ్చింది. 2026 నాటికి దేశ రాజధానిలో ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే 11,000 టన్నుల ఘన వ్యర్థాలను ప్రాసెస్ చేసే సామర్థ్యాన్ని మించిపోతుందని ఢిల్లీ ఎండీసీ అక్టోబర్ 18న సుప్రీంకోర్టుకు తెలిపింది. జూలై 26న దేశ రాజధానిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలను సరిగ్గా అమలు చేయడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో ప్రతిరోజూ 3వేల టన్నులకు పైగా ఘన వ్యర్థాలు శుద్ధి కాకుండా మిగిలిపోతున్నాయని.. ఇది ప్రజారోగ్యంపై దుష్ప్రభావాలు చూపుతుందని పేర్కొంది. దేశ రాజధానిలో రోజుకు 11,000 టన్నులకు పైగా ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతుండగా, ప్రాసెసింగ్ ప్లాంట్ల రోజువారీ సామర్థ్యం 8,073 టన్నులు ఉందంటూ సుప్రీం కోర్టు ఎండీని మందలించింది.

ఇజ్రాయిల్ ప్రధాని ఇంటిపై బాంబుల దాడి

- నరమేధాన్ని ఆపాలంటూ నిరసనల వెల్లువ



జెరూసలేం: ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇంటిపై బాంబు దాడి జరిగింది. సిజేరియా పట్టణంలోని నెతన్యాహు ఇంటిపై రెండు ఫ్లాష్ బాంబులతో దాడి జరగడంతో భారీ స్థాయిలో మంటలు చెలరేగాయి. ఘటన సమయంలో నెతన్యాహు, ఆయన కుటుంసభ్యులు ఇంట్లో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.మరోవైపు నెతాన్యాహు సైన్యం తెగబడుతున్న తీరుపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. గాజా స్ట్రిప్‌లో హమాస్ మిలిటెంట్ గ్రూప్ చేత పట్టుకున్న బందీలను విడుదల చేయాలని, నెతన్యాహు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి.

మౌనంగా భరించే రోజులు పోయాయ్..

- బీజేపీ మాజీ ఎంపీ నవనీత్ రాణా
- మహారాష్ట్ర ఎన్నికల ప్రచార సభలో రగడ




ముంబయి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న వేళ మాజీ ఎంపీ, సినీనటి నవనీత్ రాణా ప్రచార సభలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అమరావతి జిల్లాలోని ఖల్లార్ గ్రామంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కొందరు ఆమె సభలో అభ్యంతరకరంగా వ్యవహరించారు. దీంతో ప్రచార సభలో హింసకు దారితీసింది. ఈ ఘటనలో పోలీసులు 45మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై నవనీత్ రాణా తీవ్రస్థాయిలో స్పందిస్తూ.. బెదిరింపులను మౌనంగా భరించే రోజులు పోయాయన్నారు.

"ఖల్లార్ గ్రామంలో బహిరంగ సభలో నేను మాట్లాడుతుండగా కొందరు మతపరమైన నినాదాలు చేశారు. నా ప్రచారాన్ని ముగించుకొని... 'మహాయుతి' అభ్యర్థికి మద్దతుగా అక్కడకు వచ్చిన కొందరు వికలాంగులు, మహిళలు, చిన్నారులను కలిసేందుకు వారి దగ్గరకు వెళ్లాను. కొందరు దుండగులు నా దగ్గరకు వచ్చి మళ్లీ నినాదాలు చేస్తూ.. నన్ను బెదిరించడం మొదలుపెట్టారు. కుర్చీలు విసిరారు. నన్ను గాయపరిచేందుకు కూడా ప్రయత్నించారు. కాంగ్రెస్ బెదిరింపు సంస్కృతికి మద్దతు పలుకుతోంది. వీరి బెదిరింపులను మౌనంగా భరించే రోజులు పోయాయి. గ్రామంలోని పార్టీ నేతల ఆదేశాల మేరకు జరిగిన ఈ ఘటనపై ఉద్ధవ్ ఠాక్రేకు కచ్చితంగా సమాధానం చెబుతాం" అని నవనీత్ రాణా వ్యాఖ్యానించారు.

రెండేండ్లలో పుతిన్, స్కోల్జ్ ల ఫస్ట్ ఫోన్ కాల్



బెర్లిన్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్ దాదాపు రెండేండ్ల తర్వాత శుక్రవారం నాడు మొదటిసారి ఫోన్ లో మాట్లాడుకున్నారు. ఉక్రెయిన్ వివాదం గురించి, మాస్కో, కీవ్ మధ్య సంభావ్య శాంతి చర్చల గురించి ఇరువురు నేతలు చర్చించారని ప్రభుత్వ ప్రతినిధిని ఉటంకిస్తూ జర్మన్ మీడియా రిపోర్ట్ చేసింది. ప్రత్యక్ష చర్చల ప్రణాళికలను మొదట శుక్రవారం నాడు జర్మన్ మీడియా వెల్లడించింది. అయితే క్రెమ్లిన్ వివరాలను అందించకుండా పగటిపూట అంతర్జాతీయ ఫోన్ కాల్ నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నట్టు ధ్రువీకరించింది. కానీ, సంభాషణ నిజంగా జరిగిందని, దాదాపు గంటపాటు కొనసాగిందని జర్మన్ ప్రభుత్వ ప్రతినిధి స్టెఫెన్ హెబెస్ట్రీట్ జర్నలిస్టులకు నిర్ధారించారు.

హెబెస్ట్రీట్ ప్రకారం, జర్మన్ ఛాన్సలర్ "న్యాయమైన, శాశ్వతమైన శాంతిని సాధించడానికి ఉక్రెయిన్‌తో చర్చలు జరపడానికి రష్యా సిద్ధంగా ఉండాలని పట్టుబట్టారు." "అవసరమైనంత కాలం" కీవ్‌కు మద్దతు ఇవ్వడానికి బెర్లిన్ "అచంచలమైన సంకల్పం" గురించి కూడా స్కోల్జ్ మాట్లాడారు. సంఘర్షణను ముగించాలని అలాగే "తమ దళాలను ఉపసంహరించుకోవాలని" స్కోల్జ్ పుతిన్‌ను కోరారు. ఇరువురు నేతలు పరస్పరం సంపర్కంలో ఉండేందుకు అంగీకరించారని జర్మన్ అధికారులు టాస్ వార్తా సంస్థకు తెలిపారు. ఫోన్ కాల్‌కు ముందు, జర్మన్ ఛాన్సలర్ ఉక్రెయిన్‌కు చెందిన వ్లాదిమిర్ జెలెన్‌స్కీని కూడా సంప్రదించారు. పుతిన్‌తో సంభాషణ తర్వాత అతనితో మళ్లీ మాట్లాడాలని స్కోల్జ్ భావిస్తున్నట్టు హెబెస్ట్రీట్ చెప్పారు.

దాదాపు రెండేండ్లలో ఇరువురు నేతల మధ్య తొలి ప్రత్యక్ష సంభాషణ శుక్రవారంనాడు జరిగింది. పుతిన్, స్కోల్జ్ ఫోన్‌లో చివరిసారిగా డిసెంబర్ 2, 2022న మాట్లాడుకున్నారని క్రెమ్లిన్ పేర్కొంది.

లోకసంచారం

ఫ్రిజ్‌లో ఐస్ గడ్డ కడుతోందా..?

ఫ్రిజ్ ఇప్పుడు ప్రతి ఒక్కరి ఇంట్లో సర్వసాధారణమైపోయింది. సింగిల్ డోర్ ఫ్రిజ్‌లో తరచుగా ఐస్ గడ్డకడుతూ ఉంటుంది. ఫ్రీజర్‌ని ఎంత శుభ్రం చేసినా గడ్డకడుతూనే ఉంటుంది. ఈ సమస్యకు ప్రధాన కారణం తెలియక చాలా మంది అలాగే వదిలేస్తుంటారు. ఫ్రిజ్ డోర్ లేదా డోర్ గ్యాస్‌కట్ చెడిపోయినప్పుడు అంటే రబ్బరు చెడిపోయి బయటి గాలి లోపలికి వచ్చినప్పుడు ఈ సమస్య వస్తుంది.

నీటిని శుభ్రపరిచే వాటర్ ఫిల్టర్ సరిగా పనిచేయకపోతే కూడా ఐస్ గడ్డ కడుతుంది. ఇది మీ ఫ్రిజ్‌లోని అన్ని వస్తువులను స్తంభింపజేస్తుంది. కాబట్టి వాటర్ ఫిల్టర్ మార్చడమే దీనికి పరిష్కారం.

ఫ్రిజ్‌లో దిగువ నుండి నీరు పోయే గొట్టం ఉంటుంది. ఈ ట్యూబ్ బ్లాక్ అయితే మీ ఫ్రిజ్ లోపల ఐస్ గడ్డకట్టడం ప్రారంభమవుతుంది. ట్యూబ్‌ను తరచుగా శుభ్రం చేయాలి. మురికిని శుభ్రం చేయడానికి సబ్బును ఉపయోగించండి. ట్యూబ్‌లో ఏదైనా చిక్కుకుపోయినట్లయితే, దాన్ని బయటకు తీయడానికి స్ట్రింగ్‌ని ఉపయోగించవచ్చు.

ఫ్రిజ్ వెనుక భాగంలో చల్లగా ఉండటానికి సహాయపడే కాయిల్స్ ఉంటాయి. ఈ కాయిల్ మురికిగా లేదా మంచుతో కప్పబడి ఉంటే ఫ్రిజ్ సరిగ్గా పనిచేయదు. ఫ్రిజ్‌లో ఎక్కువ ఐస్ పేరుకుపోతుంది.

డిజిటల్ వ్యసనానికి దూరంగా..


ప్రస్తుత కాలంలో మన జీవితంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వాటిలో ముఖ్యమైనది టెక్నాలజీ వినియోగం. స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు మన రోజువారీ జీవితంలో అంతర్భాగంగా మారాయి. అయితే, ఈ టెక్నాలజీ ప్రేరిత ప్రపంచంలో అనేక వ్యసనాలు మనల్ని పట్టిపీడిస్తున్నాయి. వాటిలో ఒకటి డూమ్ స్క్రోలింగ్. ఇది ఒక మహమ్మారి, మన ఆరోగ్యానికి హానికరంగా పరిణమిస్తోంది. దాని గురించి మరింత సమాచారం తెలుసుకుందాం...



డూమ్ స్క్రోలింగ్ అంటే సామాజిక మాధ్యమాలు, న్యూస్ వెబ్‌సైట్లు, ప్రతికూల, భయానక వార్తలను ఎడతెగకుండా చూస్తూ, స్క్రోల్ చేస్తూ ఎక్కువ సమయం గడపడం. ఇది వ్యక్తుల ఆలోచనలు, భావోద్వేగాలపై ప్రతికూలంగా పనిచేస్తుంది. ముఖ్యంగా అనిశ్చితి, భయాలు, ఆందోళనలు పెరిగే పరిస్థితుల్లో మనలో బలమైన జిజ్ఞాస వల్ల ఇలాంటి కంటెంట్‌పై మరింత ఆసక్తి చూపిస్తాం. ఇది మానసికంగా క్షీణతకు దారితీస్తుంది.

పుట్టుకకు కారణాలు

డూమ్ స్క్రోలింగ్ పుట్టుకకు ప్రధాన కారణాలు టెక్నాలజీ పరిణామం, సమాచార యుగం, సామాజిక మాధ్యమాల అతి వినియోగం. ప్రతి నిమిషం ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే తాజా వార్తలను మనం తెలుసుకోవాలనే ఆసక్తి మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా కోవిడ్-19 మహమ్మారి సమయంలో డూమ్ స్క్రోలింగ్ పెరిగిపోయింది. ప్రతికూల వార్తలు, మరణాలు, ఆర్థిక కష్టాలు వంటి అంశాలు వ్యక్తుల్లో ఆందోళనను పెంచాయి.



కలిగే ప్రభావాలు

దీని వల్ల మన ఆరోగ్యంపై పడే ప్రభావాలను ప్రధానంగా మూడు విభాగాలుగా విభజించవచ్చు:

1. మానసిక ఆరోగ్యం: డూమ్ స్క్రోలింగ్ వల్ల మానసిక ఆరోగ్యం అత్యంత ప్రభావితమవుతుంది.

ఆందోళన, డిప్రెషన్: నిరంతరం ప్రతికూల వార్తలను చదవడం వల్ల వ్యక్తుల్లో భవిష్యత్తుపై భయం పెరుగుతుంది. ఇది మానసిక ఆందోళనకు, డిప్రెషన్‌కు దారితీస్తుంది. దాంతో జీవితంపై నమ్మకం కోల్పోతారు.

నిద్రలేమి: సమయానికి నిద్రపోకుండా రాత్రి వేళల్లో కూడా స్మార్ట్‌ఫోన్ స్క్రోల్ చేయడం నిద్రలేమికి కారణం అవుతుంది. నిద్రలేమి వల్ల మనశ్శక్తి తగ్గిపోతుంది. అది మానసిక ఆందోళనను మరింతగా పెంచుతుంది.

ఆత్మహత్య ప్రేరేపించే ఆలోచనలు: మానసిక ఒత్తిడికి గురైన వారు తాము ఏం చేస్తున్నారో తెలియకుండా జీవితం నిరుత్సాహంగా ఉందనే భావన, దాని వల్ల కలిగే ఆలోచనలు ఆత్మహత్య చేసుకోవాలనే విధంగా ప్రేరేపిస్తాయి. ఇది సుదీర్ఘ కాలంలో తీవ్రమైన మానసిక సమస్యలకు దారితీస్తుంది.

2. శారీరక ఆరోగ్యం : డూమ్ స్క్రోలింగ్ వల్ల శారీరక ఆరోగ్యంపై కూడా తీవ్రమైన ప్రభావాలు ఉంటాయి.

స్క్రీన్ సమయం పెరుగుదల: స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ముందే ఎక్కువ సమయం గడపడం వల్ల కంటి సమస్యలు వస్తాయి. ప్రత్యేకంగా డిజిటల్ ఐ స్ట్రెన్ అనే సమస్య ఉత్పన్నమవుతుంది. కంటిలో తడి పదార్థం తగ్గి కంటినొప్పి, మసక కంటిచూపు వంటి సమస్యలు వస్తాయి.

శరీర తిమ్మిరి: డూమ్ స్క్రోలింగ్ వల్ల కదలికలు తగ్గి శరీర తిమ్మిరి లేదా బరువు పెరగడం సాధారణం. ఇది మధుమేహం, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తుంది.

ఉమెన్ హెల్త్

వీపు, మెడ నొప్పులు: అనుకూలమైన పొజిషన్‌లో కాకుండా ఫోన్ స్క్రోల్ చేయడం వల్ల టెక్ నెక్ (Tech Neck) అనే సమస్య ఉత్పన్నమవుతుంది.

3. భావోద్వేగ ఆరోగ్యం : డూమ్ స్క్రోలింగ్ భావోద్వేగ స్థిరత్వాన్ని కూడా దెబ్బతీస్తుంది.

భయాలు, ఒత్తిడి: భయంకర వార్తలను చదవడం వల్ల వ్యక్తి భావోద్వేగంగా చాలా బలహీనతను అనుభవిస్తాడు. ఇది కుటుంబ సభ్యులు, స్నేహితులతో సంబంధాలను దెబ్బతీస్తుంది.

డూమ్ స్క్రోలింగ్, డోపమైన్ వ్యసన చక్రం

డూమ్ స్క్రోలింగ్ సమయంలో మన మెదడులో డోపమైన్ అనే రసాయన పదార్థం విడుదల అవుతుంది. డోపమైన్ అనేది ఆనందానికి, సంతృప్తికి, ప్రేరణకు కారణమయ్యే న్యూరోట్రాన్స్‌మిటర్. ప్రతిసారి కొత్త వార్తను చూడగానే, ప్రత్యేకించి సంచలనాత్మక, భయానక, ఆశ్చర్యకరమైన సమాచారం ఉంటే మెదడు చిన్న మొత్తంలో డోపమైన్‌ను విడుదల చేస్తుంది. ఇది తక్షణంగా మనలో తాత్కాలిక ఉల్లాసాన్ని కలిగిస్తుంది. అయితే ఈ అనుభూతిని మళ్ళీ పొందడానికి మనం ఆ కంటెంట్‌ను మరింతగా స్క్రోల్ చేయడం ప్రారంభిస్తాము. ఇది డోపమైన్ లూప్ అని పిలువబడే వ్యసన చక్రానికి దారితీస్తుంది. ఈ విధంగా మనం ఎన్ని వార్తలు చూసినా సరిపోదు. మరిన్ని చూసేందుకు ఉత్సాహం పెరుగుతూ ఉంటుంది. ఇది అనారోగ్యకరమైన అలవాటుగా మారి ఆరోగ్యంపై తీవ్రంగా ప్రభావం చూపుతుంది

అసహనం

సామాజిక మాధ్యమాల్లో ఎడతెగని వార్తల ప్రవాహం మనలో ఒక నిరాసక్తత, అసహనం పెరగడానికి కారణం అవుతుంది. ఇది ఇతరులతో మన దినచర్యల్లో అసౌకర్యం కలిగిస్తుంది.


డూమ్ స్క్రోలింగ్‌ను తగ్గించే మార్గాలు

దీన్ని నియంత్రించడం అంత సులభం కాదు. కానీ కొంత క్రమశిక్షణ, జాగ్రత్తతో మాత్రం సాధ్యమే.

1. **సమయ పరిమితి:** సోషల్ మీడియా కోసం ప్రతిరోజూ ఒక సమయం కేటాయించండి. ఆ పరిమితి దాటకూడదని కఠినంగా నిర్ణయించుకోండి.
2. **సానుకూల కంటెంట్‌ను ఎంచుకోండి:** ప్రతికూల వార్తలు, పక్కనపెట్టి సానుకూల వార్తలు, వ్యక్తిత్వ వికాస ఆర్టికల్స్, విద్యావంతమైన కంటెంట్‌ను చదవడం అలవాటు చేసుకోండి.
3. **డిజిటల్ డీటాక్స్:** ప్రతిరోజూ కొంత సమయం పూర్తి డిజిటల్ విరామం తీసుకోండి. ఫోన్, ల్యాప్‌టాప్‌లకు దూరంగా ఉండడం ద్వారా మనసుకు విశ్రాంతి కలిగించండి.
4. **వ్యాయామం:** ధ్యానం, యోగా, ఇతర శారీరక వ్యాయామాలు మనసును ప్రశాంతంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి మానసిక ఒత్తిడిని తగ్గించి, శారీరకంగా శ్రేయోభివృద్ధిని కలిగిస్తాయి.
5. **గాడ్జెట్ల వినియోగం తగ్గించండి:** నిద్రకు ఒక గంట ముందు స్క్రీన్‌లను పూర్తిగా ఆఫ్ చేయడం అవసరం. ఇది నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది.

సామాజిక బాధ్యతగా...

ప్రజల్లో డూమ్ స్క్రోలింగ్ మానసిక, శారీరక ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావాలు చూపుతుందో తెలియజేయడం చాలా ముఖ్యం. ఈ సమస్యను నివారించడానికి వైద్యులు, విద్యావేత్తలు, నిపుణులు కలిసి పని చేయాలి. పాఠశాలలు, కాలేజీలు, కార్యాలయాల్లో డిజిటల్ డిటాక్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించవచ్చు. డూమ్ స్క్రోలింగ్ అనేది ఒక ప్రమాదకర వ్యసనంగా ఉన్నప్పటికీ, దీనిని సమర్థవంతంగా నియంత్రించడం ద్వారా మన ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. వ్యక్తిగత స్థాయిలో స్పృహను పెంచుకొని, మార్గదర్శకాల ప్రకారం క్రమశిక్షణతో ముందుకు సాగితే, ఈ వ్యసనాన్ని తగ్గించుకోవచ్చు. 'మనసు ప్రశాంతంగా ఉంటే జీవితం సంతోషకరంగా ఉంటుంది' అందుకే ప్రతికూలతను పక్కనబెట్టి సానుకూలతను ఆలింగనం చేసుకోవడం మానసిక ఆరోగ్యానికి మంచిదని గుర్తించాలి. మీ ఆరోగ్యాన్ని రక్షించేందుకు ఎటువంటిదూమ్ స్క్రోలింగ్‌ను నియంత్రించండి!





Dr.Prathusha. Nerella
MD(General Medicine) CCEBDM; CCGDM; NLP; FID
Senior General Physician
Positive Psychologist certified Nutritionist
Diabetes And Lifestyle Expert
Pranic Healer Chiief Holistic Health Consultant And Medical Director @ Praveha General, Diabetes And Lifestyle Clinic - A Holistic Centre With Integrated Approach.
Ph: 8897684912/040-49950314

ఎదగనివ్వని కులవివక్ష

(మొదటిపేజీ తరువాయి)


ఆఫ్రికా రేటు 33.6 శాతంతో భారత్ కంటే తక్కువగానే ఉన్నది. సబ్-సహారా ఆఫ్రికాతో పోలిస్తే భారత చిన్నారులు ఎత్తు తక్కువవున్నారన్న హైట్ గ్యాప్ మీదనే దృష్టిని సారిస్తూ.. పిల్లల పోషకాహార లోపంలో సామాజిక గుర్తింపు పాత్రను, ముఖ్యంగా కులాన్ని విస్మరిస్తున్నారని అధ్యయనం తెలిపింది.

'గోల్డెన్ పీరియడ్'లో చిన్నారులకు సవాళ్లు

చిన్నారుల జీవితంలో 'గోల్డెన్ పీరియడ్'గా పిలవబడే తొలి వెయ్యి రోజులు చాలా కీలకం. రెండేండ్ల వయసు వచ్చేనాటికి 80 శాతం మెదడు ఎదుగుతుంది. ఇది సుదీర్ఘ జీవితానికి కావాల్సిన ఒక పునాది. ఈ కీలకమైన సమయంలో చిన్నారులకు ఆరోగ్య సంరక్షణ, మంచి పోషకాహారం, ప్రారంభ అభ్యాసం, సురక్షితమైన వాతావరణం వంటివి చాలా ముఖ్యం. ఇవి చిన్నారుల భవిష్యత్తును నిర్ణయిస్తాయని నిపుణులు చెప్తున్నారు. అయితే, గోల్డెన్ పీరియడ్‌లో చిన్నారులకు ఇవేమీ అందకపోవటంతో వారి ఎదుగుదలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని అంటున్నారు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం.. 2021లో సబ్‌సహారా, దక్షిణాసియా (భారత్‌తో కలుపుకొని)లు ప్రపంచ పేదరికంలో 85 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇది పేదరిక, అభివృద్ధిలో సవాళ్లను తెలియజేస్తున్నది. ఇది కూడా చిన్నారులపై ప్రభావం చూపించిందని విశ్లేషకులు చెప్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక ఎదుగుదల సమస్య రేట్లు యుద్ధంతో దెబ్బతిన్న సబ్-సహారా ఆఫ్రికాలోని డీ.ఆర్ కాంగో వంటి దేశాల్లో ఉన్నాయి.

భారత్‌లో 35 శాతం.. ప్రపంచవ్యాప్తంగా 22 శాతం

భారత్‌లో 13.7 కోట్ల మంది ఐదేండ్లలోపు చిన్నారుల్లో 35 శాతం కంటే ఎక్కువ మంది ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా 22 శాతం మాత్రమే కావటం గమనార్హం. ఐదేండ్లలోపు వయసున్న చిన్నారుల్లో మూడోవంతు కంటే ఎక్కువ వాటాను కలిగి ఉన్న ఆదివాసీలు, దళితుల్లో పరిస్థితులు మరింత క్లిష్టంగా ఉన్నాయని నిపుణులు చెప్తున్నారు. భారత్‌లో అణగారిన కులాలతో పోలిస్తే.. ఆధిపత్య కులాల పిల్లల్లో ఎదుగుదల లోపం 20 శాతం తక్కువ అని పరిశోధకులు చెప్పారు. జనన క్రమం, పారిశుధ్య పద్ధతులు, తల్లి ఎత్తు, తొబుట్టువుల సంఖ్య, విద్య, రక్తహీనత, కుటుంబ సామాజిక ఆర్థిక పరిస్థితి వంటి అంశాలు ఇందులో పరిగణలోకి తీసుకుంటారు. దేశంలో ఉన్న కుల వ్యవస్థ ఇప్పటికీ ఇక్కడి చిన్నారుల ఎదుగుదలకు అడ్డంకిగా మారుతున్నదని నిపుణులు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేశారు.



సామాజిక అసమానతపై చర్చ జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

బాధపడుతున్నారు. భారత్‌లో ప్రత్యేకించి పేద కుటుంబాలు, తక్కువ చదువు కలిగి ఉన్న తల్లులు, అణగారిన సామాజిక వర్గాలకు చెందిన పిల్లలు ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారన్నది సుస్పష్టమని నిపుణులు చెప్తున్నారు. చిన్నారుల్లో ఈ ఎదుగుదల అంతరం విషయానికి వస్తే.. కుల ఆధారిత సామాజిక అసమానత కారణమవుతున్నదని, దాని విషయంలో సమాజంలో చర్చ జరగకపోవటం శోచనీయమని విశ్లేషకులు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణకు రూ.205 కోట్లు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

మామునూరు ఎయిర్‌పోర్టును పునరుద్ధరించడానికి అవసరమైన 253 ఎకరాల భూమిని సేకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు డీపీఆర్ సిద్ధం చేయాలని ఆర్ అండ్ బీ శాఖను ఆదేశిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. దాంతో మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ముందడుగు పడ్డట్టయింది. ఇటీవల విమానాశ్రయం పునరుద్ధరణకు అవసరమైన 253 ఎకరాలను సేకరించడానికి మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ గుంటూరుపల్లి గ్రామంలో గుంటూరుపల్లి, గాడిపల్లి, నక్కలపల్లి గ్రామ రైతులతో సమావేశాన్ని నిర్వహించిన విషయం విదితమే. కాగా, ఇప్పటివరకు మామునూరు ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణ సాధ్యమవుతుందో లేదోనన్న అనుమానాలను పటాపంచలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవడం పట్ల ఉమ్మడి వరంగల్‌లో హర్షాతిరేకం వ్యక్తమవుతుంది.

మూడు గ్రామాల్లో 253 ఎకరాలు

మామునూరు విమానాశ్రయానికి 950 ఎకరాల భూమి అవసరముండగా, ప్రస్తుతం 693 ఎకరాల భూమి ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధీనంలో ఉంది. మరో 253 ఎకరాల భూమి అవసరముండగా, ఖిలావరంగల్ మండలంలోని గుంటూరుపల్లి, గాడిపల్లి, నక్కలపల్లి గ్రామాల్లో ఈ భూమిని సేకరించనున్నారు. నక్కలపల్లిలో 43 ఎకరాలు, సంగెం మండలంలోని గుంటూరుపల్లిలో 185 ఎకరాలు, గాడిపల్లిలో 25 ఎకరాలను రైతులు కోల్పోతున్నారు. గాడిపల్లి గ్రామంలో 12 ఇండ్లు, ఒక చెరువు కూడా భూ సేకరణలో పోతుంది. వంద ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ చెరువును ప్రత్యామ్నాయంగా మరో స్థలంలో నిర్మించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు అంగీకరించారు. చెరువు కింద ఉన్న 100 ఎకరాల ఆయకట్టులో 25 ఎకరాల ఆయకట్టును రైతులు విమానాశ్రయం కింద కోల్పోతున్నారు.

ఈవీలకు బంపర్ ఆఫర్

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం తెచ్చిన ఈ నూతన ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీ 2026 డిసెంబర్ 31 వరకు అమల్లో ఉంటుందని తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సులు, కార్లు, ఆటోలు, ప్రయివేటు ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేస్తే వందశాతం పన్ను మినహాయింపులు ఉంటాయని వివరించారు. ఈ మేరకు జీవో నెంబర్ 41 జారీ చేశామన్నారు. ఈ పాలసీ రాష్ట్రం మొత్తానికి వర్తిస్తుందన్నారు. సోమవారం నుంచి ఈ పాలసీ అమల్లోకి వస్తుందని, ఎలక్ట్రిక్ వాహనాలకు ఎలాంటి పరిమితి లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణ కోసం మూడు వేల బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు తేవాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఇప్పటి వరకు పరిమితి సంఖ్యలోనే ఎలక్ట్రిక్ వాహనాలు వాడుతున్నారని, ఈ సంఖ్యను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలు ఈవీ వాహనాలు కొనుగోలుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. 15 ఏండ్లు దాటిన వాహనాలను స్క్రాప్ చేసేందుకు ప్రత్యేక పాలసీ తెచ్చామని గుర్తుచేశారు. పాత వాహనాలను ఆ పాలసీ ద్వారా స్క్రాప్ చేస్తే, ప్రోత్సాహకాలు లభిస్తాయని చెప్పారు. దేశంలో ఏటా రోడ్డు ప్రమాదాల వల్ల 1 లక్ష 50 వేల మంది చనిపోతున్నారని, రాష్ట్రంలో రోజుకు 20 మంది చనిపోతున్నారని వివరించారు. రోడ్డు భద్రతపై లైసెన్స్ ఇచ్చేముందు అవగాహన కల్పించాలని గురునాథరెడ్డి సంస్థ సిఫార్సు చేసిందని, దాన్ని అమలు చేస్తామన్నారు. యునిసెఫ్ ద్వారా పాఠశాలల్లో అవగాహన పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రవాణాశాఖకు కొత్త లోగో, కొత్త వాహనాలు వస్తాయని, కొత్తగా ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఎన్‌ఫోర్స్‌మెంట్ ట్రాఫిక్ పోలీసుల మాదిరే వాహనాల తనిఖీలు చేస్తారని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలు చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో నెలకు ఈవీ వాహనాలకు మాత్రమే వర్తించేలా పన్ను మినహాయింపులు ఇచ్చారని, ఇప్పటి వరకు లక్షా 70 వేల ఎలక్ట్రిక్ వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయని చెప్పారు. తాము ఈ పరిమితిని ఎత్తేస్తున్నామన్నారు. పొల్యూషన్ చెక్ చేసే వాహనాలు సరిగా పనిచేయట్లేదని, అందుకే ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్లు తీసుకొస్తున్నామన్నారు. సమావేశంలో రవాణాశాఖ కార్యదర్శి వికాస్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

హే..గాంధీ..!

(మొదటిపేజీ తరువాయి)

తెప్పిస్తున్నారు. డాక్టర్లు చెప్పిన మందులే తీసుకొచ్చి స్టాక్ పెట్టి రోగులకు అమ్ముతున్నారు. ఇందులో తలాపీడికెడు కమీషన్ రూపంలో ఉండవున్నాయన సర్వత్రా వినపడుతోంది. ఈ హాస్పిటల్‌లో ఉన్న ప్రయివేట్ మెడికల్ షాపులు రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నాయి. ఉచితంగా మందులు ఇవ్వాల్సిన హాస్పిటల్‌లో బహిరంగంగా ప్రయివేటు మందుల మాఫియా దోపిడీ కొనసాగుతున్నా.. దాన్ని అడ్డుకునే నాథుడే లేకుండా పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రయివేటు మెడికల్ మాఫియాకు అడ్డుకట్ట వేయడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల డ్రగ్స్ కంట్రోల్ అధికారులు గాంధీ హాస్పిటల్ ప్రాంగణంలో ఉన్న ప్రయివేటు మెడికల్ షాపులపై దాడులు నిర్వహించారు. నామ్స్ ప్రకారం లేని మెడికల్ షాపులకు నోటీసులు ఇచ్చినట్టు సమాచారం. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించడం, ఫార్మసిస్టులు లేకపోవడం, డ్రగ్ స్టాక్ రిజిస్టర్ మెయిన్‌టెయిన్ చేయడం, అమ్మకం, కొనుగోలు బిల్లింగ్ ప్రొసెస్ ఏమీ అలాగ కావటం లేదని గుర్తించిన డ్రగ్స్ కంట్రోల్ అధికారులు, మెడికల్ షాపుల యజమానుల వివరణ అనంతరం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



ఎక్స్‌రేలకు తిప్పలు..

గాంధీ హాస్పిటల్‌లో ఎక్స్‌రే యంత్రాలు పని చేయడం లేదు. ఇక్కడ మొత్తం 5 యంత్రాలు ఉండగా.. నాలుగు మూలన పడగా.. ఒక్కటే పని చేస్తుంది. దాంతో ఐపీ, ఓపీ విభాగాల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఓపీకి వచ్చే రోగులు బయట ఎక్స్‌రే తీయించుకుంటున్నారు.

స్తోమత లేని పేదలు హాస్పిటల్‌లోనే ఎక్స్‌రే తీయించుకునేందుకు రెండు, మూడు రోజులు ఎదురు చూడాల్సి వస్తోంది. మరోవైపు, అర్ధరాత్రి ప్రమాదాలకు గురైన వారు దాదాపు 100 మంది వరకు అంబులెన్స్‌లో గాంధీకి వస్తుంటారు. యంత్రాలు పని చేయకపోవడంతో అత్యవసర సమయాల్లో వీరికి ఎక్స్‌రేలు తీయడం ఇబ్బందిగా మారుతోంది. ఆరు నెలలుగా యంత్రాలు పని చేయకపోయినా.. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో గమనార్హం.

అవయవ మార్పిడులు అంతంతే..

గాంధీలో అవయవ మార్పిడులు ఉచితంగా చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. దాంతో అవయవమార్పిడి అవసరమైన రోగులు తమ వంతు ఎప్పుడు వస్తుందా.. అని ఎదురు చూడాల్సి వస్తోంది. అవయవ మార్పిడికి కార్పొరేట్ హాస్పిటల్స్‌లో రూ.10లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుంది. నగరంలోని పలు ప్రయివేట్ హాస్పిటల్స్‌లో వేల సంఖ్యలో అవయవ మార్పిడులు జరుగుతుండగా.. గాంధీలో వందల సంఖ్యలో కూడా జరగడం లేదు. గడిచిన పదేండ్లలో జీవన్‌దాన్ ద్వారా ఇక్కడ కేవలం 14 మాత్రమే జరిగాయి. ఈఎస్ఐలో 2013 నుంచి 2024 ఆగస్టు వరకు కేవలం 99 మాత్రమే జరిగాయి. గడిచిన పదేండ్లలో గాంధీలో కేవలం 13 కిడ్నీ మార్పిడిలు జరిగ్గా.. ఒక్కరికి మాత్రమే గుండె మార్పిడి చేశారు. ఇక ఊపిరితిత్తుల మార్పిడి, కాలేయ మార్పిడిలు ఒక్కటీ జరగలేదు.

రిస్క్ తీసుకోలేక.. దాతలు ముందుకు రాక..

అవయవ మార్పిడి అంటే రిస్క్‌తో కూడుకున్నది. ఏ మాత్రం ఇన్‌ఫెక్షన్ సోకినా.. నిర్లక్ష్యం జరిగినా.. ప్రాణాలకే ముప్పు. అందుకే కొంత మంది ముందుకు రావడం లేదని తెలుస్తోంది. మరోవైపు గాంధీలో ప్రత్యేకంగా అవయవ మార్పిడికి అవసరమైన ఆధునిక పరికరాలు, ఆపరేషన్ థియేటర్లు పెద్దగా లేవు. పాతకాలం నాటి ఆపరేషన్ థియేటర్లలోనే అవయవ మార్పిడులు చేయాల్సి రావడం వల్ల కూడా వైద్యులు పెద్దగా రిస్క్ తీసుకోవడం లేదని తెలుస్తోంది. ఇక దీనికితోడు అవయవ దానానికి దాతల కుటుంబాలు కూడా పెద్దగా ముందుకు రాకపోవడం ఈ పరిస్థితికి మరో కారణంగా తెలుస్తోంది.

నర్సిరెడ్డిని మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉంటే అక్కడ ఉంటూ, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తూ ఆదర్శ ఎమ్మెల్సీగా పని చేశారని అన్నారు. అలాంటి వ్యక్తిని మరో మారు మండలికి పంపించడం అందరి కర్తవ్యమని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రంజిత్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు కందుల శ్రీనివాస్, వెంకటేష్, కృష్ణ, చిక్కుడు శ్రీనివాస్, రవీందర్, మర్రెడ్డి, రాము, నీలకంఠం, సుధీర్, మోడల్ స్కూల్ బాధ్యులు శ్రీనివాస్, బాల మురళి, సోషల్ వెల్ఫేర్ బాధ్యులు సైదా బాబు, పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి భవనాలకు రూ.110 కోట్లు కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.110 కోట్లు కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి లోకేష్‌కుమార్ కుమార్ జీవో 734 జారీ చేశారు. రాష్ట్రంలోని 22 జిల్లాల్లో ఒక్కో భవనానికి రూ.5 కోట్లతో పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వీటిని నిర్మించనున్నారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్, కామన్ వర్క్‌షెడ్, ఉత్పత్తుల ప్రదర్శన, సాంస్ మేళాలు, జీవనోపాధి తదితర కార్యక్రమాల కోసం నిర్మిస్తున్నట్టు సర్కార్ తెలిపింది. నవంబర్ 19న హన్మకొండలో జరిగే ప్రజాపాలన విజయోత్సవ సభలో ఈ భవనాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

ఫోటో షూట్లు..కొత్త బెడ్లు, కొత్త బెడ్‌షీట్లు..కాళ్లకు సాక్స్

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. అనేక విషయాల్లో ఆ రెండు పార్టీలు పరస్పరం సహకరించుకుంటున్నాయని విమర్శించారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు డీపీఆర్ వచ్చేంతవరకు కూడా ఓపిక పట్టరా? అని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ప్రశ్నించారు. మూసీ నిద్ర పేరిట చిలిపి చేష్టలు చేస్తున్నారని అన్నారు. 'దాయిపే చర్చ' కాదు...'మూసీ పే చర్చ' చేయాలని కోరారు. మూడు నెలలపాటు నిద్ర చేస్తే అర్థమవుతుందంటూ సీఎం సూచించారని, 12 గంటలు నిద్ర చేస్తే ఏం తెలుస్తుందని ప్రశ్నించారు. అక్కడికెళ్లి కేంద్ర మంత్రి ఏం సాధించారని అన్నారు. నిరాశ్రయులకు డబుల్‌బెడ్ రూమ్‌లు ఇస్తామన్నారు. గుజరాత్‌కు గులాములుగా మారి, రాష్ట్ర ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారని విమర్శించారు. దక్షిణ భారతదేశం అభివృద్ధి కాకూడదా? అని ఆయన ప్రశ్నించారు. మూసీ రంగారెడ్డి, హైదరాబాద్, నల్గొండ జిల్లాల గుండా 150 కి.మీ దూరం ప్రవహిస్తున్నదని చెప్పారు. ఆ రైతులకు పంట పొలాలకు నీరు అందుతుందన్నారు. రానున్న కాలంలో ప్రపంచ పర్యాటకులు వస్తాయని నిపుణులు చెబుతున్నారని చెప్పారు. దీంతో ప్రజలకు సురక్షితమైన హైదరాబాద్‌ను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ముందుకు పోతున్నారని అన్నారు. మూసీ ప్రక్షాళనపై కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ అవగాహన ఉందని, కాబట్టి తాము నిద్ర చేయాల్సిన అవసరం లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అయితే మూసీ నిద్ర చేసిన కిషన్‌రెడ్డి ప్రభుత్వానికి మంచి ప్లాన్ ఇవ్వాలని కోరారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లాగా కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్ పంపించబోదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతుందంటూ ప్రశ్నించారు.. అది బీఆర్ఎస్, బీజేపీ సృష్టిస్తున్న ప్రచారమేనని చెప్పారు. కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ అనుమతి కోరామని, ఆయన ఎందుకు అనుమతి ఇవ్వడం లేదో ఆరా కావడం లేదన్నారు. ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ.. లగచర్ల నిర్వాసితులకు భూమికి భూమి, ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. కంపెనీలో ఉద్యోగాల కోసం భూ సేకరణ చేస్తున్న బీఆర్ఎస్ కేంద్రం ప్రయత్నిస్తున్న క్రమంలోనే బీఆర్ఎస్ రైతులను రెచ్చగొట్టిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రచారాన్ని ప్రజలు నమ్మకూడదని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. లగచర్లలో ఫార్మా కంపెనీకి సీఎం అల్లుడు కోసమేనా? అన్న ప్రశ్నకు అది బీఆర్ఎస్ చేస్తున్న పుకార్లు అని ఎంపీ కొట్టిపారేశారు.

కృష్ణ నటించిన చివరి సినిమా..



సూపర్ స్టార్ కృష్ణ నటించిన చివరి చిత్రం 'ప్రేమ చరిత్ర - కృష్ణ విజయం'. అంబుజా మూవీస్, రామ్ ఫిల్మ్స్ బ్యానర్స్ పై హెచ్.మధుసూదన్ దర్శక, నిర్మాతగా రూపొందిన ఈ చిత్రంలో యశ్వంత్, సుహాసిని జంటగా నటించారు. నాగబాబు, ఆలీ ముఖ్య పాత్రలు పోషించారు. శనివారం కృష్ణ ద్వితీయ వర్ధంతి సందర్భంగా మేకర్స్ ఆయనకు ఘన నివాళి అర్పించారు.
సంక్రాంతి కానుకగా జనవరి 3న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు.
ఈ సందర్భంగా దర్శక, నిర్మాత మధుసూదన్ మాట్లాడుతూ,'కృష్ణతో సినిమా రూపొందించడం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన నటించిన ఆఖరు చిత్రం విడుదల కాని చిత్రాల జాబితాలో ఉండకూడదనే పట్టుదలతో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నాం. ఆధునిక సాంకేతిక హంగులన్నీ అద్దుకున్న ఈ చిత్రం కృష్ణ అభిమానులతోపాటు అందరినీ అమితంగా అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు. ఎం.ఎం. శ్రీలేఖ సంగీతం సమకూర్చిన ఈ చిత్రానికి సహ నిర్మాతలు బండ్రి నాగరాజ్ గుప్తా - బి.వెంకటేష్ శెట్టి - శ్రీపాద హన్ చాటే, కథ -స్క్రీన్ ప్లే - మాటలు - నిర్మాణం - దర్శకత్వం: హెచ్.మధుసూదన్.



రూప కొడువాయూర్, ప్రియదర్శి

ఆద్యంతం వినోదభరితం

మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తున్న సినిమా 'సారంగపాణి జాతకం'. ఇందులో ప్రియదర్శి సరసన తెలుగమ్మాయి రూప కొడువాయూర్ కథానాయికగా నటించారు. 'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' విజయాల తర్వాత మోహనకృష్ణ ఇంద్రగంటి, శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందుతున్న మూడో చిత్రమిది. డిసెంబర్ 20వ తేదీన సినిమా విడుదల చేయనున్నారు. ఈనెల 21, ఉదయం 11:12కి టీజర్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఆదివారం ప్రకటించారు.
ఈ సందర్భంగా నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, 'టీజర్‌తో ప్రేక్షకులకు మా సారంగపాణి ప్రపంచం ఎలా ఉంటుందో పరిచయం చేస్తాం. సినిమా చిత్రీకరణ సెప్టెంబర్ మొదటి వారంలో పూర్తి చేశాం. డబ్బింగ్ కార్యక్రమాలు సైతం పూర్తి అయ్యాయి. పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం రీ-రికార్డింగ్ జరుగుతోంది. మనిషి భవిష్యత్తు చేతి రేఖల్లో ఉంటుందా? లేదా చేసే చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు జవాబు ఇచ్చే ఓ పరిపూర్ణ హాస్యరస చిత్రమిది. ఇంటిల్లిపాది చూసి నవ్వుకునే వినోదాత్మక సినిమా. మోహనకృష్ణ ఇంద్రగంటి అద్భుతంగా తీశారు. ఏడాది ఆఖరులో అందరినీ నవ్విస్తుందీ సినిమా' అని అన్నారు.
నరేష్ విజయకృష్ణ, తనికెళ్ళ భరణి, శ్రీనివాస్ అవసరాల, 'వెన్నెల' కిశోర్, 'వైవా' హర్ష, శివన్నారాయణ, అశోక్ కుమార్, రాజా చెంబోలు, వడ్లమాని శ్రీనివాస్, 'ఐమ్యాక్స్' వెంకట్ ఈ చిత్రంలో ఇతర ప్రధాన తారాగణం.

ఘనంగా కాంతారావు 101వ జయంతి వేడుక



భారత్ కల్చరల్ అకాడమీ, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం ఆధ్వర్యంలో కళాప్రపూర్ణ కాంతారావు 101వ జయంతి వేడుక ఫిలిం ఛాంబర్‌లో ఘనంగా జరిగింది.
భారత్ కల్చరల్ అకాడమీ అధ్యక్షులు నాగబాల సురేష్ కుమార్ సారథ్యంలో జరిగిన ఈ వేడుకలో రమణా చారి మాట్లాడుతూ, 'ఎన్టీఆర్, ఏఎన్నార్‌లతో పాటు సినిమా రంగంలో రాణించిన కాంతారావుకు ప్రభుత్వం నుండి రావలసిన గుర్తింపు రాలేదు. ఈ విషయంలో ఎన్టీఆర్, ఏఎన్నార్‌లకు కూడా ఆలస్యంగా గుర్తింపు లభించింది. కాంతారావుకు ఇప్పటికైనా ప్రభుత్వం తరపున తగిన గుర్తింపు దక్కేలా కృషి చేస్తే బాగుంటుంది. నటుడిగా ఆయన జీవిత ప్రయాణం అందరికీ స్ఫూర్తిదాయకం' అని అన్నారు.
'కాంతారావుతో చైల్డ్ ఆర్టిస్ట్ గానే కాకుండా హీరోయిన్‌గా కూడా నటించాను. అదొక గొప్ప మర్చి పోలేని అనుబంధం. ఆ రోజుల్లో కాంతారావుకి మంచి క్రేజ్ ఉంది. ఆయన నటన అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించింది ' అని రోజా రమణి చెప్పారు.
నటి కవిత, రచయిత్రి డా.కె.వి.కృష్ణ కుమారి, నిర్మాత రామ సత్య నారాయణ, కాంతారావు కుమార్తె సుశీల, కుమారుడు రాజా, రచయితల సంఘం అధ్యక్షుడు ప్రేమ్ రాజ్, కోశాధికారి చిత్తరంజన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్‌డియస్ ప్రకాష్, అక్కినేని శ్రీధర్, కెవియల్ నరసింహ రావు, ప్రేమ్ కమల్, స్వప్న తదితరులు పాల్గొని కాంతారావు నట జీవిత ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు.



రోహిత్ శర్మ దూరం

పెర్త్ టెస్టుకు హిట్‌మ్యాన్ గైర్హాజరు

పెర్త్ (ఆస్ట్రేలియా) : బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టుకు భారత కెప్టెన్ రోహిత్ శర్మ దూరం అయ్యాడు!. పితృత్వ సెలవులో ఉన్న రోహిత్ శర్మ నవంబర్ 22న ఆరంభం కానున్న పెర్త్ టెస్టుకు అందుబాటులో ఉంటాడనే అంచనాలు ఉన్నాయి. కానీ, రోహిత్ శర్మ కుటుంబంతో ఉండేందుకు మొగ్గుచూపటంతో హిట్‌మ్యాన్ లేకుండానే భారత్ పెర్త్ టెస్టుకు సిద్ధం కానుంది. రోహిత్ శర్మ, రితిక దంపతులు శుక్రవారం రెండో బిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. భారత్, ఆస్ట్రేలియా రెండో టెస్టు డిసెంబర్ 6 నుంచి అడిలైడ్‌లో ఆరంభం కానుంది. కానీ, నవంబర్ 30 నుంచి భారత్ మూడు రోజుల డే నైట్ వార్మప్ మ్యాచ్ ఆడనుంది. పింక్‌బాల్ వార్మప్ మ్యాచ్ సమయానికి రోహిత్ శర్మ జట్టుతో చేరనున్నాడని సమాచారం.
పెర్త్ టెస్టుకు భారత్ టాప్ ఆర్డర్ సమస్యలు ఎదుర్కొంటుంది. రోహిత్ శర్మ పితృత్వ సెలవులో ఉండగా.. శుభ్‌మన్ గిల్ ఎడమ చేతి బొటనవేలి గాయానికి గురయ్యాడు. దీంతో గిల్ సైతం తొలి టెస్టుకు అందుబాటులో లేడు. రోహిత్ స్థానంలో గిల్ ఓపెనర్‌గా వస్తాడనే అంచనాలు కనిపించాయి. ఇప్పుడు రోహిత్, గిల్ దూరం కానుండటంతో.. ప్రత్యామ్నాయ ఆటగాళ్లు కెఎల్ రాహుల్, అభిమన్యు ఈశ్వరన్ ఇద్దరూ తుది జట్టులో నిలిచే అవకాశం లేకపోలేదు.

అఖిల్‌కు ఎఫ్4 టైటిల్

ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్



కోయంబత్తూర్ : హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ డ్రైవర్ అఖిల్ అలీభాయ్ ఎఫ్4 ఇండియన్ చాంపియన్‌షిప్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. రుహాన్ అల్వ (బెంగళూర్) ఆఖరు రేసులో టాప్ పొజిషన్‌లో నిలిచినా.. రేసు ఆరంభానికి ముందే 29 పాయింట్ల ఆధిక్యంలో నిలిచిన అఖిల్ అలీభాయ్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. సీజన్‌లో ఆరు విజయాలు సాధించిన అఖిల్.. ఆదివారం రెండుసార్లు పోడియంపై నిలిచాడు. అఖిల్‌ను హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ సహ యజమాని అక్కినేని నాగచైతన్య అభినందించారు.



విజయంతో ముగిస్తారా?

- మలేషియాతో భారత్ ఢీ నేడు
- గచ్చిబౌలిలో ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్
- రాత్రి 7.30 నుంచి స్పోర్ట్స్18లో..

నవతెలంగాణ-హైదరాబాద్

భారత ఫుట్‌బాల్‌కు ఈ ఏడాది మిశ్రమ ఫలితాలు ఇచ్చింది. జనవరిలో వరుసగా రెండోసారి ఆసియా కప్‌లో పోటీపడిన భారత్.. జూన్‌లో ఫిఫా ప్రపంచకప్ క్వాలిఫయర్స్ నుంచి నిష్క్రమించింది. ఫిఫా ర్యాంకింగ్స్‌లోనూ దిగజారిన 'బ్లూ టైగర్స్'.. సొంతగడ్డపై ఇంటర్‌కాంటినెంటల్ కప్‌ను సైతం చేజార్చుకుంది. కొత్త కోచ్ మనాలో మార్క్వెజ్‌పై అంచనాలు భారీగా ఉన్నప్పటికీ.. జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఆఖరిసారి భారత ఫుట్‌బాల్ జట్టు మైదానంలోకి రానుంది. హైదరాబాద్‌లోని జీఎంసి బాలయోగి అథ్లెటిక్ స్టేడియంలో నేడు మలేషియాతో ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్‌లో తలపడనుంది. వచ్చే ఏడాది ఆరంభంలో మలేషియా, భారత్‌లు ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో బరిలోకి దిగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు జట్ల మధ్య ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్ ఆసక్తిగా మారింది.

కుర్రాళ్లకు సవాల్

కోచ్ మనాలో మార్క్వెజ్ గత నాలుగేండ్లుగా హైదరాబాద్‌తో అనుబంధం కలిగి ఉన్నాడు. హైదరాబాద్ ఎఫ్‌సీ కోచ్‌గా మనాలో ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) టైటిల్ సాధించాడు. కుర్రాళ్లకు ఎక్కువ అవకాశాలు కల్పించి, ఫలితాలు రాబట్టడం మనాలో శైలి. కానీ ఇంటర్‌కాంటినెంటల్ కప్‌లో ఆ ప్రయోగం ఆశించిన ఫలితాలు అందించలేదు. అయినా, మనాలో మార్క్వెజ్ శైలిలో మార్పులేమీ రాలేదు. గత మ్యాచుల్లో చేసిన పొరపాట్లను సరిదిద్దుకుని, కఠోర సాధన చేస్తున్న భారత జట్టు ఈ ఏడాదిని విజయంతో ముగించాలని ఎదురు చూస్తోంది. నేడు మలేషియాతో మ్యాచ్‌లో మైదానంలో ఆటగాళ్ల మార్పును మనాలో ఏ విధంగా చేస్తాడనే ఆసక్తి కనిపిస్తోంది. 'మలేషియా భిన్నమైన జట్టు. ఈ సవాల్‌కు భారత్ కొత్తగా సన్నద్ధమైంది. గతంలో చేసిన పొరపాట్ల నుంచి నేర్చుకున్నాం. ప్రత్యర్థిని దీటుగా ఎదుర్కొంటామనే ధీమా ఉంది. చివరగా భారత్ ఇక్కడ మ్యాచ్‌కు అభిమానులతో స్టేడియం నిండిపోయింది. నేడు మలేషియాతో మ్యాచ్‌కు సైతం అభిమానుల నుంచి అదే స్థాయిలో మద్దతు ఉంటుందని ఆశిస్తున్నాను' అని మనాలో మార్క్వెజ్ అన్నారు. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ 125వ స్థానంలో, మలేషియా 133వ స్థానంలో కొనసాగుతున్నాయి. భారత కోచ్ మనాలో, మలేషియా కోచ్ మార్టిన్‌లు స్పెయిన్‌లోని బార్సిలోనా నగరానికి చెందిన వ్యక్తులు కావటం విశేషం.

ఘనంగా ఏర్పాట్లు

భారత్, మలేషియా ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్‌కు తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) ఘనంగా ఏర్పాట్లు చేసింది. గతంలో ఇంటర్‌కాంటినెంటల్ కప్‌కు ఆతిథ్యం అందించిన గచ్చిబౌలి స్టేడియం ఇప్పుడు ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్‌కు అంతకుమించి ముస్తాబైంది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి ఇరు జట్ల ఆటగాళ్లతో కరచాలనం చేసి మ్యాచ్‌ను ఆరంభించనున్నారు. ఫుట్‌బాల్ మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు ఆరంభం కానుండగా.. సాయంత్రం 5.15 గంటల నుంచి స్టేడియంలో సంగీత కచేరి నిర్వహించనున్నారు.

ప్రజాపాలన విజయోత్సవ సభను విజయవంతం చేయాలి

- 22 జిల్లాల్లో ఇందిరా మహిళా భవన్‌లు : మంత్రులు కొండా సురేఖ, సీతక్క



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రజలు నియంతృత్వ పాలనకు చరమగీతం పలికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకొని డిసెంబర్ 7 నాటికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 19న హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో తలపెట్టిన ప్రజాపాలన విజయోత్సవ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, ప్రజలకు మంత్రులు కొండా సురేఖ, సీతక్క పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో బహిరంగసభ ఏర్పాట్లను వారు పర్యవేక్షించారు. అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ.. బహిరంగసభ వేదికకు ఇందిరా మహిళా శక్తి ప్రాంగణంగా నామకరణం చేశామని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదింటిని అమలు చేశామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, బడుగు, బలహీన వర్గాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్టు తెలిపారు. అలాగే, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద ఇచ్చే సాయాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపుదల, రూ.2 లక్షల రుణమాఫీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. ఇందిరమ్మ రాజ్య స్థాపనే లక్ష్యంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని వేల కోట్ల రూపాయాల రుణాలను అందిస్తూ వారి స్వయం సాధికారత దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి జోడెద్దులుగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. వరంగల్ పర్యటనలో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 22 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 23 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసిందన్నారు.

సినీనటి కస్తూరికి రిమాండ్

- పుళల్ కేంద్ర కారాగారానికి తరలింపు



తమిళనాడు : తమిళనాడులో స్థిరపడ్డ తెలుగువారిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసుకు సంబంధించి.. సినీ నటి కస్తూరిని పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి విదితమే. తాజాగా ఈ కేసు విచారించిన ఎగ్మోర్ మెట్రోపాలిటన్ న్యాయస్థానం 12 రోజుల పాటు ఆమెకు రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు ఆమెను పుళల్ కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ నెల 29 వరకు ఆమె రిమాండ్‌లో ఉండనున్నారు. నవంబర్ 3న చెన్నైలోని బ్రాహ్మణ సమాజ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న కస్తూరి.. తమిళనాడులో ఉంటున్న తెలుగు ప్రజలు 300 ఏండ్ల క్రితం తమిళ రాజుల భార్యలకు సేవలు చేయడానికి వచ్చారని, కానీ ఇప్పుడు ఆ తెలుగోళ్లే తమిళ వాళ్లమని చెప్పుకుంటూ చలామణీ అవుతున్నారని వ్యాఖ్యలు చేశారు. ఈ కామెంట్స్ పెను దుమారం రేపాయి.

యూనివర్సిటీల్లో ముగిసిన పీజీ ప్రవేశాలు

గణనీయంగా పెరిగిన గర్ల్స్ ప్రవేశాలు

- అందరి చూపు ఓయూ వైపే
- 8 యూనివర్సిటీల్లో సగం సీట్లే ప్రవేశాలు..



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కామన్ పోస్టు గ్రాడ్యుయేషన్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీపీజీఈటీ-2024), అడ్మిషన్స్ ప్రక్రియ ఇటీవలే ముగిసింది. రాష్ట్రంలోని ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలంగాణ విశ్వవిద్యాలయం, పాలమూరు, కాకతీయ, శాతవాహన, చాకలి ఐలమ్మ, మహాత్మాగాంధీ, తెలంగాణ విశ్వవిద్యాలయాల్లో మొత్తం 45 పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు అడ్మిషన్లు నిర్వహించారు. కాగా, ఈ 8 యూనివర్సిటీల్లో మొత్తం 47,722 సీట్లు ఉండగా వాటిలో 21,170 సీట్లు మాత్రమే ప్రవేశాలు తీసుకున్నారు.
మరో 23 వేల పీజీ సీట్లు ఖాళీగా ఉన్నాయి. అడ్మిషన్స్ పొందిన వారిలో 15,712 మంది అమ్మాయిలు, 5,458 మంది అబ్బాయిలు ఉన్నారు. గత ఐదేండ్ల నుంచి పీజీ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడం నుంచి అడ్మిషన్ల వరకు అమ్మాయిలే ముందు వరుసలో ఉన్నారు. ఈ సంఖ్య ప్రతిఏటా పెరుగుతోంది.

ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలలో.. 20వరకు స్పాట్ అడ్మిషన్స్

ఇక పీజీ కోర్సుల్లో భారీగా సీట్లు మిగిలి ఉండటంతో ఈ నెల 20వ తేదీ వరకు మెరిట్ కలిగి ఉన్న విద్యార్థులు అఫ్లియేటెడ్ (ప్రభుత్వ ప్రయివేటు కళాశాలల్లో) కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్స్ పొందవచ్చునని కన్వీనర్ ప్రొఫెసర్ ఐనవోలు పాండు రంగారెడ్డి తెలిపారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు సీట్లు కేటాయించనున్నట్టు చెప్పారు. పూర్తిస్థాయి వివరాల కోసం ఓయూ, సీపీజీఈటీ వెబ్‌సైట్లలో చూడాలని కోరారు. ఇలా స్పాట్ అడ్మిషన్స్ ద్వారా సీట్లు పొందిన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్స్‌ను సంబంధిత కళాశాలల వారు కన్వీనర్‌కు 26వ తేదీవరకు సబ్మిట్ చేయాలని, వాటిని పరిశీలించి సర్టిఫై చేసి అప్రూవల్ ఇవ్వనున్నట్టు తెలిపారు. కాగా,ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సీట్లు పొందటానికి 80శాతం మంది దరఖాస్తు చేసుకోవడం విశేషం.

ఇన్ని సీట్లు మిగిలి ఉండటానికి కొన్ని కారణాలు..

కామర్స్, గణితం, ఫిజిక్స్ , కెమిస్ట్రీ, స్టాటిక్స్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎకనామిక్స్, తెలుగు, ఇంగ్లీషు, తదితర ప్రధాన కోర్సుల్లో (విభాగాల్లో) అధిక సంఖ్యలో సీట్లు మిగిలి ఉన్నాయి. ప్రవేశ పరీక్షలు రాసిన విద్యార్థుల కంటే సీట్లు ఎక్కువ ఉండటం, డిమాండ్ లేకుండా కొత్త కోర్సులు పెట్టడమే సీట్లు మిగలడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. అలాగే, విద్యార్థులు కేవలం యూనివర్సిటీల్లో సీట్లు వస్తేనే చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని, ప్రభుత్వ, ప్రయివేట్ కాలేజీల్లో చేరేందుకు ఆసక్తి చూపడం లేదని తెలిసింది. ఉన్నత విద్య కంటే డిగ్రీ పూర్తి కాగానే పలు జాబ్స్ కోసం ప్రిపరేషన్ కావడమూ కారణమే.

ప్రధాని మోడీకి నైజీరియా అత్యున్నత పురస్కారం..



న్యూఢిల్లీ : భారత ప్రధాని మోడీకి నైజీరియా ప్రభుత్వం తమ దేశ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించింది. 'ది ఆర్డర్ ఆఫ్ ది నైజర్' గ్రాండ్ కమాండర్‌ను ఆయనకు ఇవ్వనున్నది. 1969లో క్వీన్ ఎలిజబెత్‌కు నైజీరియా ఈ అవార్డును ప్రదానం చేసింది. అనంతరం, ఇప్పుడు మోడీకి అందజేయనున్నది. విదేశాల్లో మోడీ అందుకున్న అత్యున్నత అంతర్జాతీయ అవార్డుల్లో ఇది 17వ పురస్కారం. "నైజీరియాలోని అబుజా చేరుకున్న మోడీకి ఫెడరల్ క్యాపిటల్ టెరిటరీ మంత్రి నైసోమ్ ఎజెన్‌వో సాదరంగా స్వాగతం పలికి జ్ఞాపికను అందజేశారు. ఇది భారత ప్రధానిపై వారికున్న నమ్మకం, గౌరవానికి ప్రతీక" అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొన్నది. దేశాధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు ఆహ్వానం మేరకు మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని ఆదివారం నైజీరియా చేరుకున్నారు. తర్వాత జీ-20 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు బ్రెజిల్ వెళ్తారు. అక్కడ వివిధ సభ్య దేశాధినేతలతో భేటీ కానున్నారు. 18, 19 తేదీల్లో రియో డీ జనీరోలో జరిగే శిఖరాగ్ర సమావేశానికి మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తదితరులు హాజరుకానున్నారు. 19న మోడీ గయానాకు చేరుకుంటారు. ఆ దేశాధ్యక్షుడి ఆహ్వానం మేరకు వెళ్తున్న ఆయన 21వ తేదీ వరకు అక్కడ ఉంటారు.

విమాన ప్రయాణికులకు ఎయిరిండియా గుడ్ న్యూస్

- తెలుగు రాష్ట్రాల నుంచి అదనపు సర్వీసులు
- హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం సర్వీసుల సంఖ్య పెంపు



అమరావతి : తెలుగు రాష్ట్రాల విమాన ప్రయాణీకులకు ఎయిరిండియా గుడ్ న్యూస్ చెప్పింది. శీతాకాల సర్వీసుల్లో భాగంగా అదనపు సర్వీసులను ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ప్రకటించింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి అదనపు సర్వీసులను ప్రకటించడంతో ఈ మూడు నగరాల నుంచి వారంలో నడిచే సర్వీసుల సంఖ్య 173 నుంచి 250కి పెరిగాయి. కొత్తగా ప్రకటించిన సర్వీసుల్లో హైదరాబాద్ - గ్వాలియర్ డైరెక్ట్ సర్వీస్, విశాఖపట్నం - విజయవాడ సర్వీస్ ఉన్నాయి. హైదరాబాద్ నుంచి బెంగళూరు, కోచికి సర్వీసుల సంఖ్య పెంచారు. అలానే హైదరాబాద్ నుంచి 17 దేశీయ గమ్యాలు, సౌదీ అరేబియాలోని మూడు ప్రధాన విమానాశ్రయాలకు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుపుతున్నట్టు కంపెనీ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ అంకుర్ గార్గ్ తెలిపారు. విజయవాడ నుంచి అంతర్జాతీయ గమ్యాలకు విమాన సర్వీసులు నడుపుతున్న ఏకైక సంస్థ ఎయిరిండియానే అని ఆయన చెప్పారు. సీజన్ మొత్తం మీద ఈ నగరాల నుంచి సర్వీసుల సంఖ్య 45 శాతం పెరిగినట్టు అంకుర్ గార్గ్ తెలిపారు.



సచివాలయంలో భారీ మార్పులు

- వాస్తు కోసమే అంటూ ప్రచారం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ సచివాలయం ప్రధాన గేట్లతో పాటు రోడ్లలో కీలక మార్పులు చేస్తున్నారు. ఆదివారం తూర్పు వైపు ఉన్న బాహుబలి గేటుగా పిలిచే ప్రధాన ద్వారాన్ని పూర్తిగా తొలగించారు. తూర్పు వైపు లుంబినీ పార్క్ ఎదురుగా ఉన్న ఈ గేటు నుంచే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాకపోకలు సాగించేవారు. ఆ గేటు నుంచి సచివాలయం లోపల ప్రధాన ద్వారం వరకు వాహనాల రాకను కొంతకాలంగా నిలిపివేశారు. అక్కడే తెలంగాణ తల్లి విగ్రహంతో పాటు చుట్టూ లాన్, ఫౌంటెయిన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈశాన్యం వైపు మరో గేటు నిర్మిస్తున్నారు. ఇందుకోసం ఇనుప గ్రిల్స్‌ను తీసేశారు. సచివాలయానికి ప్రస్తుతం నాలుగు వైపులా ప్రధాన గేట్లున్నాయి. నైరుతి, ఈశాన్య గేట్లను కలుపుతూ రోడ్డు నిర్మిస్తున్నారు.వాస్తు కోసమే సచివాలయం గేట్లు, రోడ్లలో మార్పులు చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది.

సీబీఐ వలలో వాల్తేరు డీఆర్‌ఎం

- కాంట్రాక్టరు నుంచి రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం



విశాఖ : వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) సౌరభ్ కుమార్ ప్రసాద్ ముంబయిలో లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కారు. ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం డిమాండ్ చేసిన నేపథ్యంలో ఢిల్లీకి చెందిన కేంద్ర దర్యాప్తు బ ందం సిబిఐ పక్కాగా వల పన్ని శనివారం ముంబయిలో ఆయనను అరెస్టు చేసింది. సీబీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం వాల్తేరు డివిజన్‌లోని మెకానికల్ బ్రాంచి పరిధిలో 39 కోట్ల రూపాయల విలువైన పనుల టెండర్లను అనుకూలంగా మార్చేందుకు సౌరభ్ కుమార్ ప్రసాద్ రూ.25 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో, కాంట్రాక్టర్ సీబీఐని ఆశ్రయించారు. ప్రస్తుతం సెలవులో ఉన్న డీఆర్‌ఎం కాంట్రాక్టర్‌ను డబ్బులు తీసుకుని ముంబయిలోని తన నివాసానికి రావాలని చెప్పారు. సీబీఐ అధికారులు సదరు కాంట్రాక్టర్ వెంట వెళ్లి డబ్బులు ఇస్తున్న సమయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం విశాఖలోని డీఆర్‌ఎం కార్యాలయంలోనూ, బంగ్లాలోనూ సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. వాల్తేరు డిఆర్‌ఎంపై గతం నుంచీ ఆరోపణలు ఉన్నాయి. ఎట్టకేలకు సీబీఐ ఢిల్లీ అధికారులు ఆయనను అరెస్టు చేసి విచారణ చేపట్టడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సౌరభ్ కుమార్ ప్రసాద్‌ను ఒకటి, రెండు రోజుల్లో విశాఖపట్నానికి తీసుకొచ్చే అవకాశ ముందని రైల్వే అధికారులు చెప్తున్నారు. రైల్వే చరిత్రలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ డీఆర్‌ఎంల్లో సౌరబ్ కుమార్ ప్రసాద్ రెండోవారు. కొద్ది రోజుల క్రితం గుంతకల్లు డీఆర్‌ఎం వినీత్ సింగ్ లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886